# కథా మంజరి

పది  కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి  ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**ఆగస్టు 2021 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari


సుస్వాగతం



# యువ కథలతో

## "కథామంజరి" ప్రత్యేక సంచిక

పేరులోనే కొంత అర్థమయి ఉండాలి. కాకపోయినా 'కథామంజరి' ఆశయం తెలిసుంటే భావం స్ఫురిస్తుంది. సరే.. సూటిగా విషయంలోకి వచ్చేస్తే.. యువ కథకుల కథల కదంబం. సెప్టెంబరు 21 సంచిక కోసం యువతరం నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. నిబంధనలంటూ పెద్ద మాటలు వాడం గాని, సూచనలు మాత్రం కొన్ని పొందుపరుస్తున్నాం.

- యువతరం అంటే నలభై సంవత్సరాల లోపు వయసులో ఉన్న వారి కథలను మాత్రమే ఎంపిక ప్రక్రియలోకి తీసుకోబడతాయి.
- వయసు వివరాలు అక్కర్లేదు గాని, రచయితల విజ్ఞతకే ఆ విషయం వదిలిపెట్టేస్తున్నాం.
- కథ పంపే మెయిల్లో "కథ యువకథ కోసం" అని స్పష్టంగా రాయాలి".
- కథతో పాటు హామీపత్రం జత చెయ్యాలి. అందులో.. కథ స్వీయ రచన అనీ, ఇతర పత్రికల పరిశీలనలో లేదనీ, సాంఘిక మాధ్యమాలలో రాలేదనీ, వయసు విషయంలో అర్హత కలదనీ.. కథతో పాటు పంపాలి.
- కథాంశం ఏదైనా కావొచ్చు. 1000 పదాలకు మించకుండా కథ ఉంటే మంచిది. కథని వర్డ్ లో యూనికోడ్ లో టైపు చేసి submit@kathamanjari.in కి పంపాలి.
- ఎంపిక చేసిన కథలకు తగు పారితోషికం ఇవ్వబడుతుంది.
- కథలు మాకు చేరవలసిన ఆఖరు తేది. 10.08.2021 రాత్రి 10 గంటలు.

ఎప్పటిలాగే మా ఈ చిన్ని ప్రయత్నాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.

**"రండి! 'యువ' సంచిక చేద్దాం!"**

# కథామంజరి శ్రావ్య సంచిక

## ఈ నెల శ్రావ్య సంచిక

కోసం

ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | విశిష్ట అతిథి | | iv |
| V | కథా మార్గదర్శి | | vii |
| | **క థ లు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
| 1 | పరువు | సునీత పోతూరి | 1 |
| 2 | నేటి తరం | గొర్తి వాణిశ్రీనివాస్ | 8 |
| 3 | దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి | కొత్తపల్లి ఉదయబాబు | 11 |
| 4 | ఆమె | భాగవతుల భారతి | 17 |
| 5 | నలుపే తెలుపు | బోడపాటి రమేష్ | 23 |
| 6 | పౌడర్ డబ్బా | సీత మండలీక | 25 |
| 7 | ఆవకాయ-ఆత్మానుబంధం | అక్కిరాజు శ్రీహరి | 29 |
| 8 | నేరము-శిక్ష | అంగర వెంకట శివప్రసాద రావు | 32 |
| 9 | పదవీ దాహం | నిష్ఠల సుబ్రహ్మణ్యం | 36 |
| సరళమైన భాషలో మన మధ్యే, ఎదురుగానో జరిగినట్టు, సరళమైన శైలిలో, అజరామరంగా నిలిచే కథలు గుప్పించిన రచయిత కీ.శే. మధురాంతకం రాజారాం గారు. వారి కలం నుండి జాలువారినదీ కథ. ఈ సంచిక ప్రత్యేకం .. కథామంజరి పాఠకుల కోసం. | | | |
| 10 | తలుపులు-తాళాలు | మధురాంతకం రాజారాం | 40 |

| | | |
|---|---|---|
| VI | వినదగునెవ్వరు చెప్పిన | ix |
| VII | పాఠకుల పేజీ | xii |



# మా జట్టు

## సాంకేతిక సహకారం

harbinger
PUBLISHING

## బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

## సంపాదక సహకారం

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు

శ్రీ కృపాకర్ పోతుల

# కృతజ్ఞతలు


# SPONSORS

## ఈ సంచికకు ఆర్థిక సహకారం

# OF THE ISSUE

**శ్రీమతి సరస్వతి కరవది గారు**

**శ్రీ వరప్రసాద్ కరవది గారు**





# 'కథా'కీయం




'కొన్ని కథలు రాసినప్పుడు వొళ్లు దగ్గర పెట్టుకుని రాయాలి!' అనే హెచ్చరిక, ఎప్పుడో ఏభై ఏళ్ల కిందట కథలు రాయలనే తపన ఏర్పడినప్పుడు ఓ పెద్దాయన మొదటి పాఠంగా చెప్పారు. 'ఆ మాటకొస్తే ఏది రాసినా ఆ సూత్రం వర్తిస్తుందనే' విషయం.. అనుభవం వచ్చిన తర్వాత అర్థమయింది. అక్షరాలు ముద్రణగా అవతారం ఎత్తితే.. అవి శిలాక్షరాలే అవుతాయి. అందులో నేటి కంప్యూటర్ యుగంలో అక్షరం చేతివేలు దాటితే, ఏకు మేకు అయినట్టే! పొరపాటు దొర్లితే, ఎత్తుకోలేని గ్రహపాటే... వచ్చే తరాల వారికి అదే శాసనంగా చలామణి అయిపోతుంది.

ఇలాంటి పొరపాటు జులై 21 కథామంజరి కథాకీయంలో జరిగింది. మనుచరిత్రలో పద్యం గుర్తుకు వచ్చిందంటూ, భర్తృహరి సుభాషితాల్లోని పద్యం.."ఆరంభింపరు నీచ మానవులు..." గురించి చెప్పడం జరిగింది. ఇంకా తెలుగువారి అదృష్టం ఏమిటంటే.. ఇలాంటి తప్పుల్ని వెంటనే పట్టుకుని, హెచ్చరించగల సత్తా ఉన్న పాఠకులు ఉన్నారు. సంచిక విడుదలైన ఒక గంటలోపే.. "అయ్యా అది మనుచరిత్ర కాదు. భర్తృహరి సుభాషితాల్లోది కదా!" అంటూ నిద్రలేపి మరీ హెచ్చరించారు. మరో పెద్దాయనయితే "ఈ పద్యం మనుచరిత్రలో కూడా ఉందా?" అంటూ ఓ సుతిమెత్తని మొట్టికాయ మోదుతూ "పర్వాలేదు. ఇలాంటి పొరపాట్లు దొర్లినప్పుడే రచయితలకి వొళ్లు దగ్గర పెట్టుకుని పని చేయలనే ఆలోచన వస్తుంది!" అంటూ పరామర్శ కూడా అందించారు.

ఇంతకీ చెప్పొచ్చే మాట ఏమిటంటే.. ఇలా కథల్లో, నవలల్లో, వ్యాసాల్లో.. వెరసి ఏ రాతల్లోనైనా వాస్తవరీతులను ఉటంకిస్తున్నప్పుడు ఆయా విషయాలను ఒకటికి రెండుసార్లు దీక్షగా పరిశీలించుకుని, ఆ తర్వాతే విషయానికి అక్షరరూపం ఇవ్వాలి. అలాగే.. అవసరమయితే తమ రచనలో చెప్పదలుచుకున్న విషయం మీద పరిశోధన చేసి, ఖచ్చితమైన సమాచారాన్ని కథల్లో ప్రస్తావించాలి. అలా ఎందరో రచయితలు రాసేది కథైనా, నవలయినా, వ్యాసమైనా.. అవసరం వస్తే పరిశోధన చేసి ఉన్నతమైన రచనలు అందించారు. సైన్స్, ఫిక్షన్, చారిత్రాత్మక, ఇతిహాస, రాజకీయ, సాంఘిక... అంశం ఏదైనా సరే, కథలో ఆయా విషయాలు చోటుచేసుకున్నప్పుడు, అవి తప్పుదారి పట్టకుండా చూసుకోవలసిన భాద్యత రచయితదే. ఆ శ్రద్ధ తీసుకోకపోతే ఆ రచన రక్తి కట్టించదు. తప్పులు రాస్తే, అవే ఒప్పులుగా, వచ్చే తరాలవారికి బట్వాడా అయిపోతాయి. ఇదే అతి పెద్ద ప్రమాదం. ఇప్పటికే గూగుల్ సెర్చిలో గాని, వికీపీడియాలో గాని కొన్ని విషయాలలో తప్పులు కనబడుతున్నాయి. కథారచయితలుగా మనం అలాంటి తప్పులు దొర్లకుండా గట్టిగానే కృషి చేస్తూ, మంచి రచనలు చెయ్యాలి. అదే మనం మన భాషకి, మన కథకి ఇచ్చే ఘనమైన గౌరవం!

***0***

# విశిష్ట అతిథి



## "మంజుశ్రీ" - శ్రీ డా. అక్కిరాజు రమాపతిరావు గారు

"తెలుగు రచయితలలో గొప్ప రచయిత ఎవరని ఒకే ఒక పేరు చెప్పమంటే.. నేను "అడవి బాపిరాజు' గారంటాను. మిగతావారు గొప్ప రచయితలే.. కాని సమకాలీన చారిత్రాత్మక కథలు, నవలలు కళ్లకు కట్టినట్లు రచించిన రచయిత బాపిరాజుగారు! ఆయన రాసిన నవల "హిమబిందు"లో శ్రీముఖి శాతవాహనుడి రెండో కొడుకు 'మంజుశ్రీ'. ఆ పేరు నచ్చి నా కలం పేరు పెట్టుకున్నాను! అప్పటికి నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను. చదువు పాడుచేసి, రచనా వ్యాసంగంలో మక్కువ చూపిస్తున్నాని ఇంట్లో పెద్దలు, కాలేజి అధ్యాపకులూ ఎక్కడ పసిగట్టి చీవాట్లు పెడతారనే ఆలోచన కూడా ఇలా కలం పేరు పెట్టుకోవడానికి కారణం కావచ్చు!" అంటూ కలం పేరు వెనుక ఉన్న అసలు కథను చెప్పే శ్రీ అక్కిరాజు రమాపతిరావు గారు .. ఈ సంచిక విశిష్టఅతిథి. ఐదువేల పైచిలుకు రచనలు అన్ని ప్రక్రియలలో చేసి, 'కలం' విడవకుండా ఏడు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి ముందుండి సేవలందిస్తున్న ఈ తెలుగు సాహితీవేత్త వయసు కేవలం ఎనభైఏడు వసంతాలు మాత్రమే!

గుంటూరు జిల్లా వేమవరం గ్రామంలో జన్మించిన శ్రీ రమాపతిరావుగారు హైదరాబాదు న్యూసైన్స్ కాలేజిలో అధ్యాపకుడుగా పనిచేసి, తర్వాత తెలుగు అకాడమీలో మూడు దశాబ్దాల పైగా పని చేసారు. కందుకూరి వీరేశలింగం సారస్వతాన్ని సమగ్రంగా పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు.

"నేను రచయితను ఎందుకైనానో, ఎట్లా అయినానో చెప్పటం కష్టం. 'నిన్నాడనేల నీరజాక్ష, కన్న వారిపై కాకయునేల? కర్మానికి దగినట్లు, కార్యములు నడచేని, పుణ్యానికి దగినట్లు పూనికలు పుట్టేని' అని త్యాగరాజస్వామి అన్నట్టు .. ఇది కాలక్రీడ!" అంటూ తాను రచయిత అవడానికి ప్రత్యేకంగా కారణాలు అంటూ ఏమి లేవని చెప్పకనే చెపుతారయాన.

"భాష పట్ల అభిమానం, చేసే పని పట్ల చిత్తశుద్ధి ఉంటే ఒక వ్యక్తి సాహితీ ప్రపంచంలో ఎన్ని ఉన్నత శిఖరాలైనా అధిరోహించగలరు అనే దానికి ఉదాహరణ శ్రీ అక్కిరాజు రమాపతిరావుగారు. వీరేశలింగం పంతులుగారి ప్రభావం వీరి మీద ఉందని నాకనిపిస్తూ ఉంటుంది. భాషలో ప్రావీణ్యం ఉన్న వ్యక్తి.. సాధారణంగా అందరూ ఏదో ఒకటో రెండో సాహిత్య ప్రక్రియలలో మాత్రమే నిష్ణాతులై ఉంటారు. రమాపతిరావుగారు అలా కాదు... కథ, నవల, సాహిత్య చరిత్ర, జీవిత చరిత్ర, అనువాదం, పదకోశం, సంకలనం, కూర్పు, సాంఘిక చరిత్ర, ఆధ్యాత్మిక రచన.. ఇలా అనేక అంశాల్లో తన ప్రతిభతో తెలుగు వారందరినీ కట్టిపడేశారు!" అంటూ మనదేశ ఉపరాష్ట్రపతి గౌరవనీయులు శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయిడు గారు.. రమాపతిరావుగారి వేయిపున్నముల వేడుక సందర్భంగా బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటురు వారు వెలువరించిన "స్వాత్మకథ" అనే సాహితీ జీవనసాఫల్య అభినందన సంపుటిలో సందేశ పూర్వకంగా కొనియాడారు.

పది నవలలు, నూట ఏభై పైగా కథలు, వాటితో ఆరు కథా సంపుటాలు, తొమ్మిది జీవిత చరిత్రలు, వీరివి వెలువడ్డాయి. వీరి కథలపై పలువురు పరిశోధనలు చేసి డాక్టరేట్లు కూడా పొందారు. వీరి రచనలు ఇతర భాషల్లోకి అనువదింపబడ్డాయి. వీరి రచనలలో.. తెలుగు నేలపై జన్మించిన ప్రముఖల గురించి.. అంటే 1780 సంవత్సరంలో జన్మించిన యేనుగుల వీరాస్వామయ్య గారి నుంచి 1931 సంవత్సరంలో జన్మించిన సినారె వరకు నూటిరపై ఎనిమిది మంది తెలుగు ప్రముఖల జీవిత విషయాలనూ, విశేషాలనూ పరిశోధించి, వారి వారి చిత్రములను కూడా సేకరించి, గ్రంథరూపంలో తీసుకొచ్చిన "ప్రతిభామూర్తులు" తెలుగు సాహితీవనంలో చెప్పుకోదగ్గ గ్రంథం!

పదిహేడు, పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో కథలు రాయడం ప్రారంభించిన మంజుశ్రీగారి మొదట నవలిక " జీవిత వలయాలు" 1955 లో "తెలుగు స్వతంత్ర" లో అచ్చయింది. తర్వాత నవలే "జారుడు మెట్లు"... వారి రచనలలో చాలా ప్రాచుర్యం పొందిన నవల. కథల విషయానికొస్తే.. మంజుశ్రీగారి తొలి కథ నుండి కుటుంబ జీవితంలోని మానవీయమైన అనుబంధాలను కథలనిండా పొందుపరిచారు. ఆయన కథల్లో ఆరాధ్య పాత్ర

'అమ్మ'!  అమ్మ స్పర్శ, అమ్మ కన్నీళ్లు, అమ్మ ప్రేమ లేకుండా ఏ కథా ఉండదు. " 'వానలో తడుస్తున్న మనిషి', 'కుక్క', 'రామదర్శన లాలస', 'నాతో పాటు నలుగురు',  'సాధుపాఠం'... మొదలైన కథల వైవిధ్యం చూస్తే, ఆయన విషయ పరిజ్ఞానంలో సవ్యసాచి అనిపిస్తుంది. "వ్యావహారిక భాషా వికాసం – చరిత్ర" అనే వీరి పరిశోధన గ్రంథానికి 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.

బలివాడ కాంతరావు, అవసరాల రామకృష్ణరావు, శీలా వీర్రాజు, మధురాంతకం రాజారాం, మాలతీ చం దూర్, తురగా జానకీరాణీ... వంటివారు వీరి అభిమాన రచయిత(త్రి)లు.

ఎత్తిన కలం దించకుండా రచనలు చేసిన మంజుశ్రీగారిలో 'ఇంకా చేయవలసినది ఎంతో మిగిలిపోయింది' అనే చింత కనబడుతుంది.  అలాగే దానిని పూర్తి చేయ్యాలనే తపన కూడా పుష్కలంగా ఉంది. అలా.. అయన తలపెట్టిన సాహితీ కార్యములన్ని పూర్తిచేయడానికి కావలసిన నిండునూరేళ్ల ఆయుష్షు, ఆరోగ్యం ఆయనకి లభించాలనీ మనసారా కోరుకుంటూ... ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసి, మాకు ఎన్నో విషయాలను తెలియచేసిన శ్రీ అక్కిరాజు రమాపతిరావు గారికి  హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం!!

కథామంజరి బృందం

# కథా మార్గదర్శి



# కీ.శే. మధురాంతకం రాజారాం గారు

"ఏడే అల్లరి వనమాలి.." శ్రీమతి వేదవతి ప్రభాకర్ గారు పాడిన ఈ పాట ఆకాశవాణిలో తరుచు ఇప్పటికీ వినబడుతుసేవుంది. ఆ పాట రచయిత ప్రముఖ కథారచయిత కూడా. ఆయన్ని "దామల్ చెరువు పెద్దాయన" అంటే తెలుగు సాహితీ లోకానికి తెలుస్తుంది గాని, సాధారణ పాఠకులకు తెలియదు. ఆయనకి ఆ పేరు ఎందుకు వచ్చిందంటే.. చిత్తూరు జిల్లాలో ఓ గ్రామం పేరు అదనీ, ఆ పెద్దాయన స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఊరనీ, ఆ ఊరుంటే ఆయనకి వల్లమాలిన అభిమానం అనీ, ఆయనకి ఎలాంటి అవకాశాలు వచ్చినా సరే ఆ ఊరుని వదలలేదనీ, అంతకంటే ఎక్కువగా ఆయన కథల్లో ఆ ఊరు, ఊరి జనాల సమకాలీన జీవన విధానాలు తొంగిచూస్తాయని తెలిసి.. ఆయనెవరో అని తరిచిచూస్తే సాక్ష్యాత్కరించేది కీ.శే. మధురాంతకం రాజారాంగారు. ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయులు, ప్రవృత్తి వ్యవసాయం. జీవితంలో ఆర్థికపరమైన అంశాలకు తక్కువ ప్రాధాన్యత ఇచ్చి, రచయితగా ఏ రకమైన ఇజాలనీ, బేషజాలనీ సమర్థించకుండా రచనలు సాగించిన గొప్ప రచయిత రాజారాం గారు. అందువలననేమో.. ఆయన కథల్లో శైలి, భావవ్యక్తీకరణ, భాషా ప్రయోగం, కథనం అతి సామాన్యంగా ఉంటూనే, అసామాన్యమైన సందేశాలని ఇస్తాయి. ఎక్కువగా రాయలసీమ గ్రామీణ వాతావరణం కనబడే వీరి కథలలో పాత్రలన్నింటిలో మన చుట్టూ

ఉండే మనుషులే కనబడతారు. ఆయన రచనా శైలిలో.. బెత్తం పట్టుకుని స్కూల్లో పిల్లల్ని సుతిమెత్తగా అదలిస్తూ, మందలిస్తూ, ఆకట్టుకునేలా పాఠాలు చెప్పే మాష్టారు కనబడతారు. ఇంకా చెప్పాలంటే.. ఆయన కథల్లోని పలుకుబడి, స్నిగ్ధలావణ్యాలు పెద్దబాలశిక్ష చదువుతున్నట్టే వుంటాయి! ఇంకా.. పతనమవుతున్న విలువలను గురించిన పరితాపశిఖలు కొన్ని కథల్లో కనిపిస్తాయి. భారతీయ గ్రామీణ ఆహింసాతత్వం.. ఆయన జీవితంలోనూ, రచనా వ్యాసంగంలోనూ, కథా సంవిధానంలోనూ చివరివరకూ అంటిపెట్టుకునే వుంటాయి. అదే రాజారాం గారి రచనలలో గొప్పతనం!

రాజారాం గారు ముందు గేయరచయితగానే రచనా ప్రస్థానం ప్రారంభించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ రోజుల్లో వచ్చే ఆంధ్రపత్రిక, భారతి వంటి పుస్తకాల్లో గేయాలు, పద్యాలతో పాటు కథలు చదివి, కథలు రాయాలనే ఆలోచనలతో మొదటడుగు వేసారు. ఆయన రాసిన మొట్టమొదటి కథ పేరు 'కుంపట్లో కుసుమం'. అనతి కాలంలోనే 'అంగ రక్షకుడు', 'అక్కయ్య అంతరంగం', 'అడిగిరాని వరాలు', 'ఎక్కవలసిన రైలు,'.. మొదలగు ఎన్నో ఆణిముత్యాల్లాంటి కథలు వ్రాసారు.

1968లో ఆయన "వెలిగించిన దీపాలు" కథాసంపుటికి ఉత్తమ కథకుడిగా రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 1993 లో "మధురాంతకం రాజారాం కథలు" పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. రాజారాంగారి కలం నుంచి జాలువారిన నాలుగు వందలు పైగా కథలు, రెండు నవలలు, నవలికలు, నాటకాలు, గేయాలు, సాహితీ వ్యాసాలు .. ఎంతో జనబాహుళ్యం పొందాయి. వీరి చాలా రచనలు తమిళంలోకి అనువదింపబడ్డాయి కూడా! వీరికి లభించిన అవార్డులు, బహుమతులు చాలా ఉన్నాయి. జయకాంతన్ కథలన్నా, డా.కేశవరెడ్డి నవలలన్నా రాజారాం గారికి చాలా ఇష్టం.

ఇలాంటి మహారచయితని ఈ సంచిక కథా మార్గదర్శిగా స్మరించుకుని, వారి కథ "తలుపులు - తాళాలు" ను సవినయంగా ఈ సంచికలో ప్రచురిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# పరువు

సునీత పోతూరి



"మీనన్ ఈజ్ నో మోర్ తెల్సా?" సాయంత్రం వచ్చింది కాల్.

"అయ్యో తెలీదే! కోవిడ్ తోనా?"

"వచ్చి తగ్గిందిట. సడన్ కార్డియాక్ అరెస్ట్."

"అంతేలే... అప్పుడో, ఎప్పుడో, అంతాను! ఎవరూ వెళ్లి చూసేలా లేవు రోజులు. మే హిజ్ సోల్ రెస్ట్ ఇన్ పీస్!" ఫోన్ పెట్టేశాడు అరవింద్.

ఈ శతాబ్దపు పెను ఉత్పాతం కోవిడ్. జీవితం ఇప్పుడు మునుపటిలా లేదు. ఇక ఉండబోదు కూడా. ఒంటరిగా గదుల్లో బంధించబడి గడపడం.. ఎంత ఒంటరితనం కోరుకునే వాళ్ళకైనా దుర్భరంగానే ఉంటోంది. ఏ రోజు ఎటువంటి దుర్వార్త వినాల్సి వస్తుందో అన్న భయమొకటి దానికి తోడు.

మీనన్ అరవింద్ కి ఒకప్పుడు బాస్. అహ్మదాబాదులో ఐ.ఐ.ఎం. చేసాడు. బిలాంగ్స్ టు ద సో కాల్డ్ క్రీమీ లేయర్. పర్ఫెక్షనిస్ట్. అతనే కదా తన కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ తగలెట్టింది. నరకానికే పోయుంటాడు. స్వగతం ఇలా మూలుగుతూ ఉంటే, ఎప్పుడో చదివిన కొటేషన్ గుర్తుకొచ్చి, లోపలి సంస్కారం హెచ్చరించింది.

"De mortuis nihil nisi bonum. " (Do not speak ill of the dead)

"పోయిన వాళ్ల గురించి. చెడు మాట్లాడకూడదు లక్ష్మీ!" నాన్న అన్నాడు. ఆ రోజు అమ్మలో అంత కోపం, దుఃఖం. అంతకు ముందూ, ఆ తర్వాతా కూడా చూడలేదు!

టివి 'ఆన్' చేసాడు. అన్నీ కోవిడ్ వార్తలే. పడకలు దొరకని హాస్పిటల్స్, ఖాళీలులేని శ్మశానవాటికలూ.. వినలేక కట్టేశాడు.

మనసంతా ఏదో తెలియని అశాంతి. కోవిడ్ మహమ్మారితో ఎంతోమంది పోతున్నారు. రేపు తనకేదేనా అయితే...ఉన్నట్టుండి సీత గుర్తుకు వచ్చి బెంగగా అనిపించింది. ఎలా ఉందో? అనుకున్నాడు.

ఒక్కగానొక్క పిల్ల ఇష్టపడిందని మనసుకు నచ్చచెప్పుకుని మరీ పెళ్లి చేసారు. ఏం జరిగిందో, పెళ్ళయ్యాక ఇంటికి రావడమే మానేసింది. వాళ్ళమ్మ పోయినపుడు వొచ్చింది. అంతే. ఆ తరవాత రానేలేదు. ఈలోగా కరోనా మూలంగా లాక్డౌన్!

ఫోన్ చేసినా, రెండు నిముషాల్లోనే 'పనుంది డాడీ' అని పెట్టేస్తుంది. మళ్ళీ తను చేసే దాకా అంతే. ఈ మధ్య అదీ లేదు. ఓ క్షణం ఆలోచించి సీత మొబైల్ కి రింగ్ చేసాడు.

'నాట్ రీచబుల్.' అంటోంది.

మరోసారి.. ఇంకోసారి.. అంతే! మనసులో ఆందోళన మొదలైంది అరవింద్ కి.

ప్రశాంత్... సీత భర్త. తను అతనితో మాట్లడినది చాలా తక్కువ. నెంబర్ వెతికితే వుంది. రెండోసారికి తీశాడు.

"హాస్పిటల్ కి వచ్చాం అంకుల్. మెడిసన్స్ కొంటున్నా. మళ్ళీ చేస్తా!" ఏమిటి విషయం అని అడిగే లోపే ఫోన్ పెట్టేసాడు. ఏ హాస్పిటల్ అని కూడా చెప్పలేదు. ఎవరికి బాగోలేదో తెలీదు.

“కోవిడ్ అయ్యుండొచ్చు!” అనుకోగానే కంగారు మొదలైంది. అతను తిరిగి ఫోన్ చేసేదాకా ఆగాల్సిందే. అలాగే బాల్కనీ రెయిలింగ్ ఆనుకుని వీధిలోకి చూడసాగాడు అసహనంగా! వీధి పొడుగునా సైనికుల్లా ఎలక్ట్రిక్ దీపస్తంభాలు. గట్టిగా కళ్ళు చికిలించాడు. వెలుగుతున్న అగ్గిపుల్లల్లా మండుతూ దూసుకు వస్తున్నాయి. అరవింద్ చేతిలో మొబైల్ మోగింది. చూస్తే ప్రశాంత్.

"అంకుల్ వెంటనే బయలుదేరి శారదా నర్సింగ్ హోమ్ కి రాగలరా..?"

"ఏమైంది? సీతకు ఎలా ఉంది?" కంగారుగా అడిగాడు.

"కంగారు పడకండి. బాగానే ఉంది. మీకు చెప్పలేదా తను? తనకి ఇప్పుడు డెలివరీ టైం. సాయంత్రమే హాస్పిటల్లో చేర్చాను. రేపు ఉదయం సిజేరియన్ చేస్తారుట! మీరు ఫోన్ చేసారని చెప్పాను సీతకి. మిమ్మల్ని చూడాలని ఉందిట. మీకు లొకేషన్ షేర్ చేస్తాను వచ్చేయండి!" చెప్పాక ఫోన్ పెట్టేసాడు.

అంటే సీత తల్లి కాబోతోందా? అతను కాని, వాళ్ల పెద్దవాళ్లు కాని ఎందుకు చెప్పలేదు ? అర్థం కాకుండా వుంది. వసుంధర ఉంటే ఇలా జరిగేదేనా? విచారం కలిగింది.

ఏదో ఒప్పందం చేసుకున్నట్టు తన భార్య వసుంధర, అమ్మాయి పెళ్ళి అయిన కొద్ది రోజులకే, తనని ఒంటరిని చేసి వెళ్ళిపోయింది. కాన్సర్ అన్నారు. అడ్వాన్స్డ్ స్టేజ్ అట. తెలుసుకునే లోగానే అంతా అయిపోయింది.

తల్లి లేని పిల్ల .. తనే ఒకసారి వెళ్లి చూసి ఉండాల్సింది.. అలా అనుకుంటే కళ్ల నీళ్లు తిరిగాయి అరవింద్ కి. ఇంటికి తాళం వేస్తూండగా, నోటిఫికేషన్ వచ్చింది. నర్సింగ్ హోమ్ తను ఉన్న చోటు నుండి ఇరవై నిముషాల డ్రైవ్.

హాస్పిటల్ ఎంట్రెన్స్ లోనే ఎదురయ్యాడు ప్రశాంత్. మాస్కులూ, దూరాలూ ఎలానూ ఉండేవే. శానిటైజ్ చేసుకున్నాక, సీతను ఉంచిన రూమ్ కి తీసుకుని వెళ్లాడు. టైం చూసాడు అరవింద్. సరిగ్గా అర్ధరాత్రికి పదినిముషాలు ఉంది.

సీత మేల్కొనే ఉంది. నీరసంగా ఉన్న సీతను చూడగానే కడుపు తరుక్కుపోయింది.

"డాడీ!" అంటూ కళ్ల నీళ్లు పెట్టుకుంది.

"ఏం తల్లీ ఈ డాడీని మర్చిపోయావా అమ్మా?" అంతకంటే మాట పెగల్లేదు అరవింద్ నోటినుండి. ప్రశాంత్ ఒక కుర్చీ తెచ్చి, దగ్గరగా వేసి కూర్చోమని చెప్పి, తను బయటకు వెళ్లాడు.
"నాకు తెలుసు డాడీ.. నువ్వు బాగా హర్ట్ అవుతావని." పంటి బిగువునే అంది సీత. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ మళ్ళీ అంది "నాకు నిన్ను చూడాలని ఎంతగానో ఉంటుంది. అసలే నీకు ఇష్టం లేని పెళ్ళి. అమ్మ కూడా లేదు... వస్తే .."
"ఊఁ వస్తే?"
"వస్తే నువ్వు నన్ను చంపేస్తావని...!"
"సీతమ్మ తల్లీ!" నిర్ఘాంత పోయాడు.
"మా పెళ్ళి నువ్వు నీ పూర్తి యిష్టంతో చేయలేదు కదా డాడీ. అసలు మా అత్తవారి వేపు వారితో సరిగా నువ్వు మాటాడనే లేదు!" మాటరాలేదు అరవింద్ కి.
"ఎందుకిలా మాటాడుతున్నావు? అసలు.."
"ఇప్పుడు ఇదంతా అవసరమా సీతా?" అప్పుడే లోపలికి వచ్చిన ప్రశాంత్ సీతను అనునయంగా వారించాడు.
"అంకుల్.. మీరు రండి మనం బయట కూర్చుందాం!" అంటూ బయటకు పిలుచుకుపోయాడు. ఈలోగా ఏవో సరంజామాతో నర్స్ లోపలికి వచ్చింది.

బయటకు అడుగు వేసిన అరవింద్ ఒకసారి వెనుతిరిగి కూతురు దగ్గరకి వచ్చాడు. తలమీద ఆనీ ఆననట్టుగా చేయివుంచి చెప్పాడు
"అమ్మలూ మనసులో ఇలాంటి అర్థంలేనివి పెట్టుకుని మనసు పాడుచేసుకున్నావా? డాడీ అంత దుర్మార్గుడు అనుకున్నావా బంగారుతల్లీ? అలాంటి ఆలోచనలేవీ పెట్టుకోకుండా హాయిగా బిడ్డని కని ఇంటికి రా!"
అతని చేతిని గట్టిగా పట్టుకుంది సీత నిశ్శబ్దంగా ఏడుస్తూ. నెమ్మదిగా ఆమె తల నిమిరి కన్నీరు తుడుచుకుంటూ బయటకు వచ్చేసాడు అరవింద్.
"సీతమ్మ నామీద ఎంత అభాండం వేసింది!" ఆరోపించాడు అరవింద్ అక్కడ కుర్చీలో కూర్చుంటూ. రెండు కాఫీలు తీసుకుని వచ్చి అరవింద్ కు ఓ కప్ అందించి, తనూ పక్కనే కూర్చున్నాడు ప్రశాంత్. కాసేపయ్యాక ప్రశాంత్ చెప్పాడు.
"మా అమ్మ మేనమామకి మీరు తెలుసట! వాళ్లది కూడా ఫిరంగిపురమే. సీత అచ్చు మీ పిన్నిగారు సీతామహాలక్ష్మిగారి పోలికేనట."
అరవింద్ కు కాసేపు అర్థం కాలేదు అతడేం చెబుతున్నాడు అన్నది. "మా పిన్ని... మీకెలా?" ఎలా అడగాలో తెలియలేదు.

"మీ తాతగారి పేరు రామచంద్రరావుగారట. ఆయనని ఊళ్ళో అంతా పంతులుగారని పిలిచేవారుట. మీ అమ్మగారి పేరు మహాలక్ష్మి, మీ పిన్నిగారు సీతామహాలక్ష్మి. ఆవిడ ఒక ప్రమాదంలో చనిపోయారట. అవునా?"

"అవును. ఇవన్నీ మీకెలా...?"

"మీ సీత పిన్నిగారిది ప్రమాదం కాదు పరువుహత్య అని కూడా తెలుసు. అందుకే భయపడి సీతను పంపవద్దంది మా అమ్మ!"

అతని మాట వింటూనే అలజడికి గురయ్యాడు అరవింద్. ఎన్నడో భూస్థాపితం అయిందనుకున్న విషయం. తడబాటు పడుతూ అన్నాడు.

"నాకే సరిగా తెలియని సంగతి అది. మీకెలా చెప్పను? అయినా ప్రయత్నిస్తాను. నేను విన్నదీ, నాకు జ్ఞాపకం ఉన్నదీ ఇదీ..." అంటూ కూర్చున్న కుర్చీలోనే వెనక్కి తలవాల్చి కూర్చొని, చెప్పడం మొదలు పెట్టాడు అరవింద్.

అరవింద్ కి అప్పుడు అయిదేళ్లు. సీత పిన్ని పెళ్లికి వెడుతున్నాం అని అమ్మ అంటే.. ఎగిరి గంతేసాడు. తనంటే సీతపిన్నికీ ఎంత ఇష్టమో, సీతపిన్నంటే అరవింద్ కీ అంత యిష్టం. తాతగారి ఊరు ఫిరంగిపురం వెళ్ళారు అమ్మా, అరవిందూ. అతని తండ్రికి శలవు దొరక్క రాలేదు.

లోపలికి వస్తున్న అరవింద్ ని చూస్తూనే అట్టహాసంగా నవ్వారు రామచంద్రరావుగారు. మనవడ్ని ప్రేమగా దగ్గరకి తీసుకుంటూ, అక్కడే ఉన్న శాస్త్రులు గారితో చెప్పారు "శాస్త్రులూ చూసావా నా దౌహిత్రుడు!" అంటూ గర్వంగా. తెల్లటి పంచెకట్టు, గుబురు మీసాలు, ఎప్పుడూ నోట్లో వెలుగుతున్న చుట్ట... తాతగారి ఆహార్యం అహంకారాన్ని తెలియచేస్తూ ఉంటుంది. ఆస్తి, అంతస్తూ, ఊర్లో పలుకుబడీ... అహంభావానికి దర్పణం పడితే, అది రామచంద్రరావుగారు!

"అయితే పంతులుగారూ ఇతడే తమ వారసుడన్నమాట. దీర్ఘాయుష్మాన్ భవ!" పిల్లవాడిని ఆశీర్వదించాడు ఆయన. కొడుకులు లేని రామచంద్రరావుకి దౌహిత్రుడే వారసుడు. అదీ మురిపెం.

తాతయ్యతో సరదాగా పొలం వెళ్లడం, అక్కడ పని వారంతా 'చిన్నపంతులుగారూ' అంటూ పిలవడం.. చెప్పలేనంత గర్వంగా ఉండేది అరవింద్ కి. ఎంతో సరదాగా గడుస్తున్నాయి రోజులు.

రోజూ సాయంత్రం ఒక గంటసేపు పవర్ కట్! సీత చీకటి పడకముందే, పెరటివేపు వంటింటికి ఆనుకొని ఉన్న వరండాలో, కిరసనాయిలు లాంతరుని తుడిచి సిద్ధం చేస్తూ ఏదో కూనిరాగం తీస్తుంది. అరవింద్ నడుం మీద చేతులు వేసుకుని ఆసక్తిగా చూస్తూ నించున్నాడు అక్కడే! మహాలక్ష్మి వంటింటికి ఇవతల కత్తిపీట వేసుకుని, వంకాయలు తరుగుతోంది రాత్రి కూరకు. చెల్లెలిని చూసి నవ్వింది.

"నీ ఉత్సాహం అదీ చూస్తే, అమ్మ ఉంటే బాగుండునని అనిపిస్తోందే సీతా. అది సరేగాని, నాన్న నిజంగానే ఇష్టపడ్డాడా ఈ పెళ్లికి?" తండ్రి వినకుండా రహస్యంగా అడిగింది.

"ఇష్టమే.. నాన్న ప్రాణస్నేహితుడి కొడుకేగా రంగా."
"మంచిదే. కాని, నువ్వు కాస్త ...."
"ఒరేయ్ తాతా ఆ నిప్పుపెట్టె ఇలా ఇవ్వరా"  తాతయ్య గొంతు వింటూనే అమ్మ చప్పున మాటలాపేసి, వంటింటిలోకి పరుగెత్తి అగ్గిపెట్టె తెచ్చి నా చేతికిచ్చి వెళ్లిపోయింది.
అగ్గిపెట్టె అందుకుని జేబులోంచి చుట్ట తీస్తూ అడిగాడు తాతయ్య.
"ఒరేయ్ తాతా.. పిస్తోలు పేల్చడం నేర్పనా?"
"అంటే?"
"అంటే పిస్టల్. ఇలారా చెప్తాను.."
నిప్పుపెట్టెలోంచి ఓ పుల్లతీసి పక్కకు తిప్పి, ఏటవాలుగా ఆన్చి, చూపుడు వేలు ట్రిగ్గర్ మీద పెట్టినట్టు కదిపాడు.  రఫ్ మని నిప్పుపుల్ల అంటుకొని  దూరంగా ఉన్న  నీళ్లతొట్టి  వేపుకి పడింది.
కళ్లు విప్పార్చుకుని ఆశ్చర్యంగా చూసాడు అరవింద్. "భలే తాతయ్యా!  నేనూ ట్రై చేస్తా" సరదా పడుతున్న మనవణ్ణి దగ్గరగా తీసుకున్నాడు..
"ఇలా... అదీ... అలా! "
ఒకదాని వెంట ఒకటి, మరొకటి.  ఒకోసారి పుల్లలు విరిగి పోతున్నాయి. వెలిగినప్పుడు వాడికి సరదాగా ఉంది. పెట్టె ఖాళీ అయిపోతోంది.
ఇంతలో ఎవరో పిలిచారు..
లేచి ఆయన వీధి గదిలోకి వెళ్తూ, "ఒరేయ్ జాగ్రత్త.. ఇప్పుడే వస్తా.." అంటూ జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్లాడు.
"ఏంచేస్తున్నావ్ రా తాతా!"  అంటూ కాసేపటికి లోపలికి వచ్చాడు తాతయ్య.
"అగ్గిపుల్లలు విరిగిపోతున్నాయి తాతయ్యా.." అంటూ వెనక్కి తిరిగాడు. ఇంతలో...
అనూహ్యంగా జరిగిందా సంఘటన. స్నానం కోసం, స్టౌమీద నుండి వేణ్ణీళ్ల గిన్నె దించుతున్న సీత చెంగు అంటుకుంది. భగ్గుమని మంటలు క్షణంలో  ఆమెను చుట్టేసాయి. అరుపులతో..  కేకలతో భీతావహంగా మారింది అక్కడి వాతావరణం.
మహాలక్ష్మి  లోపల నుండి దుప్పటి తెచ్చి సీతకు చుట్టినా ప్రయోజనం లేకపోయింది.  షాక్ తో చిన్నపిల్లవాడైన అరవింద్ స్పృహ తప్పాడు..
పోలీస్ కేసు అన్నారు.  సీతామహాలక్ష్మి మరణవాంగ్మూలంలో తను స్నానానికి వేడినీళ్లు తోడుకుంటూ ఉంటే, చీరకొంగు అంటుకుంది అని చెప్పింది,  అది ప్రమాద ఘటనగా నిర్ధారించారు పోలీసులు.
అరవింద్ కి తిరిగి మెలుకవ వచ్చేసరికి హైదరాబాద్ లో వాళ్లింట్లో ఉన్నారు అమ్మా, తనూ. అసలేమైంది అన్న నాన్న ప్రశ్నకు సమాధానం ఏం చెప్పాలో అర్థం కాలేదు. తర్వాత ఏదో గుసగుసగా మాటాడుకున్నారు అమ్మా నాన్నా.
ఆ తర్వాత  మళ్లీ ఫిరంగిపురం వెళ్లనేలేదు అరవింద్. అతని తండ్రికి ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ అవడం, మళ్ళీ వెనక్కి

రాకపోవడంతో ఆ విషయాలు మరుగున పడిపోయాయి.
కొన్నాళ్ళకు రామచంద్రరావు చచ్చిపోయాడు అన్న వార్త. ఆ విషయం అమ్మ మహాలక్ష్మిని ఏవిధంగానూ కదిలించలేదు సరికదా, ఎప్పుడో రాత్రి అన్నాలు తింటున్నపుడు అంది నాన్నతో.
"డబ్బూ, ప్రాణం అన్నీ తనకు శాశ్వతమని కామోసు ..."
"పోనీలే లక్ష్మీ, పోయిన వాళ్ల గురించి చెడు ఎందుకు?' అన్నాడు నాన్న. " ఇంకా నువ్వు మీ చెల్లెలు చావుకి మీ నాన్నగారే కారణం అనుకుంటున్నావా? అది ప్రమాదం అయి ఉండవచ్చు కదా?"
"ఆః.. అలాగనే కేసు అవలేదు. కాని, ఆయన స్వభావం నాకు తెలుసు. ఆయన మాకు ముందే చెప్పాడు! ప్రేమ, దోమా అంటే నరికి పోగులు పెడతాననేవాడు. ఇద్దరూ ఆడపిల్లలమని కోపం. అమ్మని వేధించేవాడు. ఆ దిగులుతోనే ఆవిడ పోయింది అనుకుంటా. బిక్కు బిక్కు మంటూ నేనూ చెల్లీ ఎన్ని ఆంక్షల మధ్య గడిపామో తెలుసా మీకు?"
ఆవిడకి కోపం, దుఃఖం ఒక్కసారిగా వచ్చాయి.
"ఆయనేం చేసాడో ఎవరు చూసారు గనక? అయినా అసలు పిల్లాడితో అటువంటి ఆటలు ఆడించడం దేనికోసం?"
"ఇక చాలులే లక్ష్మీ... నీ మాట ప్రకారం మనం ఆయనతో తెగతెంపులు చేసుకున్నాం.. చూడ్డానికి కూడా పోలేదు కదా."
తాతయ్యకు చివర్లో ఎవరూ లేక.. నానా బాధలూ పడ్డాడనీ, ఊరి వాళ్లే దయతో అన్నీ చేసారని తెలిసింది. అప్పటికి నాకు ఊహ తెలిసినా, విషయం విపులంగా అర్థం అయ్యే వయసు, లోకజ్ఞానం లేవు. క్రమంగా తెలిసాయి.
"ఇది జరిగి యాభై యేళ్ళు అయింది. ఇప్పుడు అదే విషయం ఇలా అపార్థం సృష్టిస్తుందని నా కూతురును నాకు దూరం చేస్తుందని అనుకోలేదు."

అంతా చెప్పి ప్రశాంత్ కేసి చూసాడు. ఏం విన్నాడో ఎంత అర్థం చేసుకున్నాడో అనుకుంటూ. అతను వస్తున్న నిద్రను ఆపుకుంటూ చేతిగడియారం కేసి చూసాడు. రెండు దాటింది. మావగారి వైపు చూస్తూ నెమ్మదిగా..తగ్గు స్వరంతో చెప్పాడు "బాగుంది అంకుల్.. మీరు ఇంకా అయిదేళ్ల అబ్బాయిలానే జరిగింది చెప్పారు. మీకెవరికీ సంబంధం లేదు అన్నట్టు. మీ అమ్మగారు అంత నమ్మకంగా చెప్పినపుడు మీ తాతగారు చేసిన పరువుహత్యని ఎందుచేత బయట పెట్టలేక పోయారు? అది నేరాన్ని కప్పిపుచ్చడం కిందకి వస్తుంది! అలా చూస్తే వారూ నేరస్థులే. అసలు ఊరంతా అనుకున్నారుట. మీ అమ్మ గారి సపోర్ట్ తోనే చేసారని!"
"నో.. వే... " కోపం వచ్చింది అరవింద్ కు. తమాయించుకున్నాడు కష్టం మీద. “అమ్మకు అసలు తెలిస్తేగా!” అన్నాడు నోరు పెగుల్చుకొని.

"లేదులెండి! మా తాత కూడా అన్నారు... మీ అమ్మగారికి తెలియక పోవచ్చని! కాని పోలీసులకు నిజం చెప్పకపోవడం నేరమే."

"నేరం జరిగింది అనేది అనుమానమే. ఆధారాలు లేవు. ఒకవేళ నేరం జరిగినా, అసలు నేరస్థులు అంటే.. మీతో అభియోగం మోపబడినవారు... ఆయనే లేరు కదా! ఇప్పుడు ఇదేమిటి?" ఉద్విగ్నతను అణచుకుంటూ తలవంచుకున్నాడు అరవింద్.

గాఢంగా నిట్టూర్చాడు ప్రశాంత్. "తరతరాలుగా పాతుకు పోయిన విశ్వాసాలకు దెబ్బ పడగానే అహం పడగ విప్పుతుంది. దానికి ధనబలం తోడైతే మనిషి నేరం చేయడానికి వెనకాడడు. మీరలా కాదని ఎలా అనుకోమంటారు? అందుకే భయపడి సీతను దూరం పెట్టాము."

"ఇంకానా? సీత పెళ్లి అయి తను వెళ్ళిపోతుంటే లోలోపలే ఎంత ఏడ్చానో నాకు మాత్రమే తెలుసు. కన్న కూతురు విషయంలో ప్రతి తండ్రి కబ్బుడే." అన్నాడు అరవింద్.

"లేదు లెండి. సీత అంటే మీకు ప్రాణం అని తెలుసు. మీతో ఇంత ఫ్రీగా మాట్లాడింది ఇప్పుడే కదా. అత్తయ్యగారు దూరమయ్యాక మీ ఒంటరితనమూ, బాధా అర్థం అయ్యాయి." ప్రశాంత్ సమాధానం ఇచ్చి, లేచి వెళ్ళి సీత గదిలోకి తొంగిచూసాడు. నిద్రలో ఉంది సీత.

అరవింద్ కు మంచి నిద్ర పట్టేసింది అలా కూర్చుని ఉండగానే. ప్రశాంత్ తట్టి లేపేదాక మెలుకువ రాని నిద్ర. సీతను ఆపరేషన్ థియేటర్ కి తీసుకు వెళ్లారని చెప్పాడు. కొద్దిగా కంగారు కనిపించింది ప్రశాంత్ మొహంలో. అతని చేయిని పట్టుకున్నాడు అరవింద్ అనునయంగా..

ఇంకాసేపటికి డాక్టర్ వచ్చి కంగ్రాట్స్ చెప్పారు. "మగ పిల్లవాడు. ఇద్దరూ క్షేమం. కాసేపు ఆగి తల్లినీ. పిల్లాడిని చూడచ్చు!" అన్నారు. అరవింద్ మనసు తేలిక పడింది ఆ మాటతో.

మనవడికి మూడో నెలలో, బారసాల తన ఇంట్లో ఏర్పాటు చేసాడు అరవింద్. కోవిడ్ ప్రోటోకోల్ ప్రకారం ఎవర్నీ పిలవలేదు.

పిల్లాడి తండ్రి బియ్యంలో పేరు రాసాడు. తాతల ఇద్దరి పేర్లు కలిపి 'అరవింద కృష్ణ' అని.

"పంతులుగారు మళ్ళీ పుట్టారు' అని మా రంగయ్య తాత అన్నాడుట. వైర ప్రేమ అంటే ఇదేనేమో!" ప్రశాంత్ నవ్వుతూ అన్నాడు..

"అంకుల్ మీకు తెలీదు కదా! మా రంగయ్యతాతే... సీతామహాలక్ష్మి గారిని వివాహం చేసుకోవాలనుకున్నది."

***0***



# నేటి తరం

## గొర్తి వాణిశ్రీనివాస్

మధ్య తరగతి జీవితాల కోరికలు ఆశల దీపాల చుట్టూ పరిభ్రమించే రెక్కల పురుగులు. తిమిరంతో సమరం చేస్తూనే వెలుగు దాహం తీర్చుకోవటానికి నేర్పు కావాలి.

ఈపూట అత్తగారితో మాట రాకుండా చూసుకోవాలి అనుకుంది కొత్త కోడలు అరుణ. కానీ అలా జరగలేదు. నూలుబట్టకి రంధ్రాలు వెతుకుతుంది. సూది బెజ్జంలోంచి నూటొక్క దారపుపోగులు లాగుతుంది శాంతమ్మ.
"బంగాళాదుంప నా ఒంటికి పడదని నీ పెళ్ళానికి తెలుసు గదా! అయినా అదే చేస్తుంది. నా అంతం చూసేదాకా దాని పంతం వదలదు." అంది శాంతమ్మ కొడుకు రఘుతో.

ఆ మాటలు వంటింట్లో ఉన్న అరుణ చెవిన పడ్డాయి. పడాలనే శాంతమ్మ కంఠశోష. తీసిన బంగాళా దుంపల్ని తిరిగి బుట్టలో పడేసింది అరుణ. అత్తగారి ఆవేదనంతా కూర గురించి కాదని అరుణకు తెలుసు. వంటింట్లో దొండకాయ ముక్కల్ని కట్ చేస్తూ హాల్లో వాళ్ళ సంభాషణ వింటోంది.
"సాయంత్రం వచ్చేటప్పుడు కూరలు తెస్తాను. ఇంట్లో ఏదుంటే అదే చేయమని అరుణతో నేనే చెప్పాను" అన్నాడు రఘు వంటింటి వైపు చూస్తూ.
"చవట సన్నాసి! పైసా కట్నం తీసుకురాని పెళ్ళానికి వత్తాసు పలుకుతున్నాడు చూడు. ఆ నంగనాచి నా కొడుకుని కొంగున ముడేసుకుంది. ఇక నా మాటేం వింటాడు?" అంటూ వారుణాస్త్రాన్ని ప్రయోగించింది శాంతమ్మ.
కన్నీళ్లు పెట్టుకుంటున్న తల్లిని చూసి ఏదో అనబోయి సంబాళించుకున్నాడు రఘు.
"అరుణ ఉద్యోగం చేస్తోంది కదమ్మా, ఇంకా కట్నం దేనికి! వాళ్ళు కూడా పెద్దగా ఉన్నవాళ్లు కారు. పెళ్లి చేయడానికే చాలా కష్టపడ్డారు. అన్నీ తెలిసి కూడా కట్నం ఎలా తీసుకుంటాను చెప్పు!" అన్నాడు రఘు వీలైనంత సౌమ్యంగా.
"ఓయబ్బో! ఏమంత జీతం తెస్తోందని. తిప్పికొడితే పాతిక వేలు. మీ ఇద్దరి జీతం కలిపితే ఇంటి ఖర్చులకు బొటాబొటీగా సరిపోతోంది. మరి నీ చెల్లెలి పెళ్లి ఎట్టా చేస్తావ్. నీ కట్నం డబ్బులతో దాని పెళ్లి చేద్దామనుకున్నాను. వీరేశలింగం మళ్లీ పుట్టినట్టు ఆదర్శం బాట పట్టావు నువ్వు! కానీ నీ చెల్లెల్ని ఆదర్శ వివాహం చేసుకునే గొప్ప మనసు ఎవరికుంటుంది? ఆ మహారాజు ఈ సంసారాన్ని నా నెత్తిన పడేసి

చక్కాపోయారు. ఇదంతా నా చావుకొచ్చింది. ఇంతకీ ఆ లోన్ డబ్బులతో ఏం చేస్తుందో కనుక్కున్నావా?" అంటూ అమ్ముల పొదిలో ఒక్కొక్క అస్త్రాన్నే ప్రయోగించింది శాంతమ్మ.

"గట్టిగా అరవకమ్మా! ఎవరైనా వింటారు. కట్నం పేరుతో కోడల్ని వేధిస్తే డొమెస్టిక్ వైలెన్సు కేసు పెట్టి మనందర్నీ జైల్లో పెడతారు. ఈ కాలంలో పెళ్లికి పిల్ల దొరకటమే కష్టం. అలాంటిది సూటీపోటీ మాటలంటే వాళ్ళు తీసుకోలేరు. ఎదురుతిరిగి వెళ్ళిపోతే మనకే కష్టం. వాళ్ళకి ఇబ్బంది కలక్కుండా చూసుకోవాలి" అన్నాడు రఘు తల్లికి నచ్చచెప్పే ధోరణిలో.

"చూశావుటే కమలా! మీ అన్నయ్య ఎంత మారిపోయాడో. కాదు కాదు. అదే మార్చేసింది. ఇక నీ పెళ్లి కలగానే మిగిలిపోతుందే తల్లీ. పుట్టింట్లోనే పడి ఏడవాల్సిన రాత నీకుండబట్టే, ఆ మహాతల్లి మనింట్లో కాలు పెట్టింది. ఈ ఇల్లు అమ్మేస్తే దీని పెళ్లి చేసేయొచ్చు. కానీ నిన్ను చెట్టుకింద నిలబెట్టడం ఇష్టం లేక ఇంకా ఆలోచిస్తున్నాను!" అంటూ కురుక్షేత్ర యుద్ధానికి కాలుదువ్వింది శాంతమ్మ.

వంట పూర్తి చేసి హాల్లోకొచ్చింది అరుణ. అమ్మ అన్న మాటల్ని అరుణ వినే ఉంటుంది. ఇక రివర్స్ దాడి మొదలెడుతుంది. ఎందుకు ఊరుకుంటుంది. ఉద్యోగం చేస్తూ ఇంటిని చూసుకుంటూ, వంశాంకురాన్నిస్తూ కూడా వాజమ్మలా ఎందుకూరుకుంటుంది. తిరగబడుతుంది. ఈరోజు ఇంట్లో లాంచర్లు పేలతాయ్. ఈ సంగ్రామంలో నేను ఏ పక్షం వహించాలో అనుకుంటూ భార్యవంక భయంగా చూసాడు రఘు.

ఆఫీసుకి బయలుదేరుతూ, భర్తకీ తనకీ భోజనం బాక్సులు సర్ది పట్టుకొచ్చిన అరుణ అత్తగారి వైపు చూసి నవ్వింది. కమలా, శాంతమ్మా మొహామొహాలు చూసుకున్నారు. రఘు భార్యని ఆఫీస్ లో దింపి తన వర్క్‌షాప్ కి వెళ్ళాడు. అరుణ దారి పొడవునా 'తన తల్లి ఆమెను అన్న మాటలకు నొచ్చుకుంటూ' ఏదో చెబుతుందనుకున్నాడు. కానీ ఆమె మామూలుగానే ఉంది. రోజూ శాంతమ్మ కమల పెళ్లి విషయం ఎత్తి కోడల్ని ఏదోటి అనడం, కమల ఆమెను నవ్వుతూ చూడటం మామూలైంది .

భార్య వైఖరికి సంతోషించాడు రఘు. కానీ అరుణ ఎన్నాళ్ళని భరిస్తుంది? తన సహనానికీ ఓ హద్దుంటుంది. సాధింపులు వినీ వినీ తను తిరగబడితే? ఈ కాలం పిల్లలకి అసలే ఓర్పు తక్కువ. అరవై ఏళ్ల మనిషికి లేని మెచ్యూరిటీ ఇరవై ఏళ్ళ అరుణ నుంచి ఆశించటం ఎంతవరకూ సబబు? అమ్మకి ఎంత చెప్పినా అర్థం కాదు. కమల పెళ్లి చేయాలనే తొందర తప్ప, ఆవిడ ఇంకేం ఆలోచించట్లేదు!.. అనుకున్నాడు రఘు.

లోన్ ఎందుకు తీసుకుందో అడుగు అంటూ అమ్మ పెట్టే పోరు పడలేక ఒకరోజు అరుణని అడిగాడు రఘు.

"నాకోసమే లోన్ పెట్టావు కదూ. నా బండి పాతదైపోయింది కొత్తబండి కొనడానికి ఆఫీస్ లో లోన్ పెట్టి డబ్బులు తీసుకుంటున్నావని నాకు తెలుసులే" అన్నాడు రఘు అరుణతో.

"కాదండీ! అందుకు తీసుకోవట్లేదు" అంది అరుణ ముక్తసరిగా.

"మన కమల పెళ్లి కోసమే అయ్యుంటుంది.  కదు అరుణా!  ఆ రామనాధం కొడుకు వాసు ఏదో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడట. వాళ్లకేం ఆస్తిపాస్తులు లేవు కాబట్టి పెద్దగా కట్నం కూడా ఇవ్వక్కర్లేదు. ఇద్దరికీ పెళ్లి చేస్తే, ఏదో సూదీ దారంలా  కలో గంజో తాగి బతుకుతారు!" అంది శాంతమ్మ.

"ఈ లోను కమల పెళ్లికోసం తీసుకోలేదత్తయ్యా!" అంది అరుణ.

"అనుకుంటూనే వున్నాను. ఆడపడుచు పెళ్లితో నీకేం అక్కరుందని?  మీ సరదాల కోసమే అనుకున్నా. కానీ ఈ ముసలిదాని బాధ అర్థం చేసుకుని వుంటావని కాస్త ఆశపడ్డాను. లేమి లోంచి వచ్చిన నీకు అంత డబ్బిస్తే  ఇవ్వడానికి మనసొప్పుతుందా?  పెళ్లికోసం ధారపోసే పెద్ద మనసెందుకుంటుందిలే" అంది శాంతమ్మ  అరుణవైపు నిరసనగా చూస్తూ.

అరుణ చిన్నగా నవ్వింది. అమ్మ మాటలు మంచుకత్తుల్లా గుచ్చుతుంటే అరుణ నవ్వుతూ ఎలా వుండగలుగుతోంది. మంచు కరిగిపోయాక గానీ కత్తి గాయం నొప్పి తెలీదు.  కొత్తగా వచ్చింది కదా. అత్తవారింట్లో సర్దుకుపోవాలని ప్రయత్నిస్తోంది పాపం అనుకున్నాడు రఘు.

"కమల డబ్బు సంపాదించడం మీకు ఇష్టం లేదా అత్తయ్యా?" అంది అరుణ సీరియస్ గా.

"ఇంటర్ చదివిన పిల్ల ఏ విధంగా డబ్బు సంపాదిస్తుందే. తిక్కమాటలు మాట్టాడకు" అంది శాంతమ్మ చిరాగ్గా.

"కమల బాగా చదువుకుంటే తప్పకుండా సంపాదిస్తుంది. కమలను ఇంజనీరింగ్ కాలేజీలో చేర్చడానికి డొనేషన్ కట్టాలి. అందుకే లోన్ తీసుకున్నాను. ఇంజనీరింగ్ తరవాత ఎం బీ ఏ చేసిందంటే అప్పుడు కమల సంపాదించే జీతాన్ని మీరు ఊహించలేరు." అంది అరుణ.

"పిల్లకి పెళ్లి చేయమంటే చదువు ఉద్యోగం అంటుందేంట్రా! ఓ అయ్య చేతిలో పెట్టేస్తే మన భారం తీరిపోతుందని దానికి చెప్పరా! బెల్లం కొట్టిన రాయల్లే చూస్తావేరా!" అంటూ దీర్ఘాలు తీసింది శాంతమ్మ.

"కాలం మారిందత్తయ్యా! ఇదివరకటిలా భార్యను భర్త జీవితాంతం పోషించటం కాస్త కష్టమే. ఇద్దరూ సంపాదిస్తేనే ఇల్లు గడుస్తుంది.  మన కమల కూడా తన కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలంటే మనం చదివించి తన కాళ్ళమీద తను నిలబడేలా చేయాలి!"  అంది అరుణ దృఢంగా.

"అమ్మా..  అరుణ తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. చెల్లి పెళ్లికి ఇప్పుడేం తొందర్లేదు. బాగా చదివిద్దాం. ఉద్యోగం వచ్చాక మన కమలని కోరి పెళ్లి చేసుకుంటారు. ఆ విషయాన్ని అరుణకు వదిలేసి నువ్వు నిశ్చింతగా వుండు." అన్నాడు రఘు.

కమల కూడా వదిన నిర్ణయాన్ని ఆమోదిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేసింది. కొత్తతరం వాళ్ళ ముందు చూపుకు తను అడ్డం పడకూడదని మౌనంగా ఉండిపోయింది శాంతమ్మ.

***0***



# దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి

## కొత్తపల్లి ఉదయబాబు

దిండునానుకుని మంచంమీద కూర్చుని కిటికీలోంచి బయట శూన్యంలోకి చూస్తున్న విజయలక్ష్మి ఒడిలో ఏదో బరువు పడినట్టు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంచి ఖరీదైన శారీ ప్యాకెట్. ఆమె తలెత్తింది. ఎదురుగా తన కొడుకు అర్జున్.

"వారం రోజుల్లో నాటిక వేయాలట. తల్లి పాత్రట. ఆ పాత్రకు నువ్వైతేనే సరిపోతావట. బాలాజీరావుగారు చెప్పమన్నారు. నువ్వు చేస్తావని చెప్పాను. నీ నిర్ణయం చెబితే అది వారికి చెబుతాను." ఆమె పెదవులపై వాడిపోయిన పువ్వులాంటి నవ్వు మెరిసి మాయమైంది.

"బాలాజీరావుగారు నిన్ను కలిసారా? నువ్వు ఆయన్ని కలిసావా?" అడిగింది

"నిన్న కాకినాడ కాంప్ కి వెళ్ళాను కదా. స్టేషన్లో కనిపించారు. ఆయనే వద్దామని బయల్దేరారట. నన్ను చూసి సంతోషంతో కౌగలించుకుని నాకు అన్ని వివరాలు చెప్పి 'నేను మీ ఇంటికే వస్తున్నాను. నువ్వు ఎలాగూ కనిపించావు కదా. ఈ వివరాలని మీ అమ్మగారికి చెప్పు.' అని చెప్పి, వెనక్కు వెళ్లిపోయారు. ఇంతకూ ఏమంటావ్?" వింటున్న వాళ్ళకి అవి అమృతమయమైన మాటల్లా వినిపిస్తాయి. కానీ వాటిల్లో కత్తి అంచులాంటి పదును ఆమెకు మాత్రమే తెలుసు.

"నేను నాటకాలు ఆడటం మరచిపోయి ఏళ్ళు దాటింది. ఇపుడు మళ్ళీ నటించడం అవసరమా? నీ ఉద్దేశం ఏంటి?" అని అడుగుదామనుకుంది. "నీ నిర్ణయమే నా నిర్ణయం." అంది. కసాయివాడు కత్తి మెడమీద పెట్టి, వేటు వెయ్యనా వద్దా అంటే ఏం చెప్పగలడు(దు) మనిషైనా, జంతువైనా!!!

"ఇదిగో పోర్షన్. నాటకానికి మూడువేలు ఇస్తారట. చివరి రెండు రోజులు వస్తే చాలు అన్నారు." అనేసి తలుపులు దగ్గరగా లాగేసి వెళ్ళిపోయాడు అర్జున్.

ఆమె చేతిలో తాటాకు విసనకర్రతో రెండుమూడు సార్లు విసురుకుంది. కరెంట్ లేక కాదు. కరెంట్ ఉన్నా తిరగని ఫాన్ ఉన్న గదిలో తాను ఉంది కనుక.

ఇసుక తుఫాను వెళ్ళిపోయింది అనుకుని నిట్టూర్చిన ఆమె, ఒడిలో ఉన్న అట్టపెట్టె తెరిచింది. రాణీ కలర్ చీర మీద గుమ్మడిపూవు సైజులో అదే రంగు పూలు ఎంబ్రాయిడరీ చేయబడి, కుడివైపు చిన్న బోర్డర్, ఎడమ వైపు జానెడు పెద్ద బోర్డర్ ఉన్న మంగళగిరి కోరా శారీ... తనకిష్టమైన రంగు... కానీ అతనికెలా

తెలుసు? ప్రకాశం కాని చెప్పాడా? అన్నట్టు ఇపుడు ప్రకాశం ఎక్కడున్నాడో... ఏంచేస్తున్నాడో? తనతో కలిసి ఎంతోకాలం నటించినవాడు. అతని ప్రేమను తన పుట్టినరోజున వ్యక్తపరచి, ఆరోజు రాణీ కలర్ చీర పెళ్లి చీరగా ఇచ్చి, తన మెడలో గుడిలో తాళికట్టిన రోజు.. తన జీవితంలో మరపురాని రోజు.

తొలిచూపులోనే అతనిని ప్రేమించినా, ఉన్నత సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన తాను తన ప్రేమను వ్యక్తపరచలేక, అలా అని తనకు వస్తున్న సంబంధాలను తప్పించుకోలేక ఎన్ని అవస్థలు పడిందో! ఒకరోజు సాయం సంధ్యవేళ రిహార్సల్స్ కు వెళ్ళినపుడు తామిద్దరే హాజరై మిగతావారు రాకపోవడంతో, ప్రకాశం తాను రిహార్సల్స్ చేస్తూనే, ఆ తమకంలో ఒక్కటయ్యారు. ఫలితంగా తాను తల్లి అయింది. ఆ విషయం ఇంట్లో చెప్పే లోపలే తండ్రికి గుండెనొప్పి వచ్చి మరణించడం, తాను అక్కయ్య గూట్లో చేరడం, బావ తండ్రిలా తన బాధ్యత తీసుకుని పోస్టల్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం వేయించడం, తాను అందులో జాయిన్ అయిపోవడం అన్నీ కేవలం నెలలోనే జరిగిపోయాయి.

తమ విషయం తెలిసిన ప్రకాశం భార్య తాము రిహార్సల్ చేస్తున్న చోటికి వచ్చి అతన్ని కొట్టి, పదిమందిలోను అవమానపరచి లాక్కువెళ్లిపోయిన సంఘటనతో, ప్రకాశంతో తనకు సంబంధ బాంధవ్యాలు పూర్తిగా తెగిపోయాయి. లేదు లేదు... పూర్తిగా తెంపేసింది ప్రకాశం భార్య. అంతలో ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ సెల్ మోగింది.

"విజయా భోజనం చేశావా?" అవతల అడిగిన ప్రశ్నకు సమాధానంగా

"చేసాను బావా నువ్వు?"

"నిజం చెప్పు?"

"నిజంగానే తిన్నాను బావా నీ మీద ఒట్టు."

"నా మీద కాదు. ప్రకాశం మీద ఒట్టు వెయ్యి."

"లేదు బావా ఇంకా తినలేదు. నీకేం అదృష్టవంతుడివి. నీ కొడుకులూ, కోడళ్ళూ నిన్ను అపురూపంగా ఆదరంగా చూసుకుంటారు. అక్కయ్య తన కోడళ్ళకి అలాంటి తర్ఫీదు ఇచ్చి, ఆ సుఖాలు అనుభవించడం ఇష్టపడక నీకన్న ముందుగానే వెళ్ళిపోయింది. అయినా నీ జీవితం నువ్వు చెప్పిన ప్రకారం రాజాలా నడుస్తోందంటే, నీ పూర్వజన్మ సుకృతం బావా!" అందామె మార్దవంగా.

"పిల్లల మీద ప్రేమ ఉండచ్చు విజయా! నవమాసాలు మోసి కనీ పెంచి, కష్టమొస్తే కంటికి రెప్పలా వాడిని కాపాడుకున్న తల్లివి నువ్వు! వృద్ధాప్యంలో ఆదరిస్తాడు అనే అతినమ్మకంతో నీకంటూ ఏమీ మిగుల్చుకోకుండా ఇచ్చేసావు! భార్య మాట విని కడుపునిండా రెండు పూటలా అన్నం పెట్టని, కాలక్షేపానికి కూడా టీ.వీ. చూడనివ్వని బిడ్డపట్ల మాత్రం పిచ్చి ప్రేమ పెంచుకొని చాలా తప్పు చేశావు విజయా."

"అమ్మ తరపున మిగిలిన ఒక్కగానొక్క ఆత్మీయుడవు నువ్వు ఒక్కడివే బావా! నువ్వు వూహించని మరో విషయం చెప్పనా? ఎలాగూ ఇల్లు వాడికే కదా అని వీలునామా రాసేశానా, నేను లేనప్పుడు ఆ కాగితాలు

ఎప్పుడు తీసేసుకున్నారో తెలీదు. ఇపుడు నెలకు నేనున్న గదికి ఐదువేలు రూపాయలు అద్దె తీసుకుంటున్నాడు బావా. అది కాక నెలలో ఎపుడైనా డబ్బు కావలసివస్తే 'అమ్మా...ఒక రెండువేలు తీసుకుంటానే. మళ్ళీ నెలలో జీతం వచ్చాకా ఇచ్చేస్తాను.' అని నేను 'ఊ' అనకుండానే తీసుకువెళ్లి, అవసరం తీరాకా పట్టుకొచ్చి నా దిండు కింద పెట్టేస్తాడు ఆ ఏ.టి.ఎం.కార్డ్ ని! ఊహ తెలిసినప్పటి నుంచి నేను నిన్ను సొంత అన్నగారిలాగానే భావించాను బావా. కానీ నన్ను పెళ్లి చేసుకుందామనే ఆశ నీకు ఉందని, మేమిద్దరం పెళ్లి చేసుకున్న రోజు ప్రకాశం చెప్పాడు. నా మనసులో అసలా ఉద్దేశం లేదు కనుకనే నిర్భయంగా, నీకు కూడా చెప్పకుండా, నువ్వు పరిచయం చేసిన ప్రకాశాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్లి చేసుకున్నాను!" ఆ మాట అంటున్నపుడు అప్పట్లో జరిగిన సంఘటన గుర్తుకొచ్చి, మాటలు ఆగిపోయాయి.

నాన్న పోయిన తరువాత నన్ను చేరదీసి ఉద్యోగం వేయించిన మా బావ, నేను ప్రకాశాన్ని పెళ్లి చేసుకోగానే నిర్దాక్షిణ్యంగా ఇంట్లోంచి గెంటేస్తూ.. ''ఇదంతా ఎందుకు చేశాననుకున్నావ్? నీ మీద ప్రేమతో కాదు. మీ అక్క మీద మోజు తీరిన నాకు, నీ మీద మోజు అలానే ఉండిపోయింది. అది తీరుస్తూ జీవితాంతం నా ఇంట్లో పడి ఉంటావనుకున్నాను!'' అని తన మృగ బుద్ధి ప్రదర్శిస్తూ ముఖం మీద తలుపేసుకున్నాడు. ఒక్కసారిగా ఆలోచనల నుంచి బయటపడి, తమాయించుకుని.. తిరిగి అంది.

"బావా.. లోకం నన్ను అన్ని రకాలుగా నిందించినా నేను భరించాను సహించాను. అయిదుగురు భర్తలను పొందిన ద్రౌపదీదేవి, ఒక్కొక్క భర్తతో ఉన్నప్పుడు ఎంత పాతివ్రత్యంతో కాపురం చేసిందో, నేను ప్రకాశంతో అంత పవిత్రంగా కలిసాను. అతను నాకు మాతృత్వాన్ని ప్రసాదించినవాడు. మగదిక్కులేని నా జీవితంలో మరో మగదిక్కుగా, వాడి చేతుల్లో నా జీవితనావ ప్రశాంతంగా సాగిపోతుంది అన్న నమ్మకంతో వాడిని పెంచాను. కానీ పెళ్లి అయిన తరువాత వాడిని మార్చగలిగే మరో స్త్రీశక్తి భార్య రూపంలో వస్తుందని వూహించ లేకపోయాను. వాడు భార్య మాటవిని, తన విచక్షణను కోల్పోయి నాపట్ల ప్రవర్తిస్తున్న తీరు చూస్తుంటే, నేను పెంచిన కొడుకేనా వీడు అన్న అనుమానం వెక్కిరించేది నన్ను. వాడు ఇలా చేసాడు, అలా చేసాడు అని నీతో చెప్పుకునేది ఎందుకో తెలుసా బావా? ఆ బాధలు భరించలేకా కాదు... నీ ఓదార్పూ, జాలీ పొందాలనీ కాదు బావా... మనసు తట్టుకోలేకపోతోంది బావా! వాడి చిన్నతనంలో హోరున వానలో, ఒకసారి టైఫాయిడ్ వచ్చి ఎవరి సహకారం లేక, వాడిని భుజాన వేసుకుని తిరగని హాస్పిటల్ లేదు. ఒక పక్క ఒప్పుకున్న నాటకాలు. ఇంకొక పక్క డ్యూటీ... నాటకాల్లో ఏడుపు సీన్లో నా పరిస్థితి తలుచుకుని ఏడ్చేసేదాన్ని. అందుకే ''ఉత్తమ శోక నటీమణి" గా ఎన్నో అవార్డులు అందుకున్నాను. ఓపిక ఉన్నంతవరకు భరిస్తాను. అది లేనినాడు దేహాన్ని దేవుడికి అప్పగించేస్తాను. సరే బావా...నువ్వు ఎక్కడున్నా సంతోషంగా ఉండు. నా బావ సంతోషంగా ఉన్నాడు అనే ఆనందాన్ని నా గాయాలకు మందుగా

పూసుకుని హాయిగా బతికేస్తాను. ఉంటాను బావా... ఇప్పటికే బాగా విసిగించినట్టున్నాను. బై." అంటూ, ఫోన్ తానే కట్ చేసింది విజయలక్ష్మి.

పడుకుని లేచాకా మందు బిళ్లలు వేసుకోవాలనుకుని చూస్తే కారీ బాగ్ లో మందు బిళ్ళలు అయిపోయిన ఖాళీ స్ట్రిప్స్ కనిపించాయి. విజయ గుండెల్లో రాయి పడింది. మళ్ళీ ఒక దెబ్బలాటకి కారణం దొరికింది వాళ్ళకి. మందు బిళ్ళలు అయిపోయిన స్ట్రిప్స్ అన్నీ వాళ్ళకి చూపిస్తే, వాడికి గుర్తుంటే, ఏ మూడో రోజుకో వస్తాయి. అదీ తాను చెవిని ఇల్లు కట్టుకు పోరితే. ఒకసారి ఇలాగే పక్క దులుపుకుంటూ మందు బిళ్ళలు ఉన్న కవరు పరుపు కిందకు తోసి మర్చిపోయింది. మందు బిళ్ళలు అయిపోయాయనుకుని కొడుక్కి చెబితే కోడలు రయ్ మని లేచింది.

"వారం రోజులు కాలేదు. అపుడే మందు బిళ్లలు అయిపోవడం ఏంటి? మోతాదు కన్నా ఎక్కువేసుకుని ఇంకా ఎక్కువ కాలం బతికేద్దాం అనుకుంటున్నావేమో. నేను చూస్తానాగు!" అని గదంతా అతలాకుతలం చేసేసింది.

బట్టలన్నీ మడతలు విప్పేసి, సామాను చిందరవందర చేసేసి, గదంతా పిచ్చి పిచ్చిగా చేసేస్తే, సర్దుకోలేక నడుము నొప్పితో విలవిలలాడి పోయింది ఆమె.

పరుపు కింద దొరికిన మందుల కవరు చూసి తన కొడుకుతో ఉన్నవీ లేనివీ చెప్పి "మనం మందులు కొనమేమో అని పరుపుల కింద దాచుకుని, లేవని చెబుతోంది. ఇంతా చూసి తల్లికి మందులు కూడా కొనలేని కొడుకు అనిపించుకుంటావో ఏమో నీ ఇష్టం!" అనేసి హాల్లోకి వెళ్ళిపోయింది.

మూడురోజుల తర్వాత కాంప్ నుంచి వచ్చాకా చెప్పిందో ఏమో... దాంతో కొడుకు శివాలెత్తినట్టు అరిచేసి "ఇంకెక్కడ దాచుకున్నావో అన్ని తీయి." అని సర్దుకున్న బట్టలన్నీ తనచేతే మడతలు విప్పించి అలమారులలో ఉన్న ప్రతీ వస్తువును తీయించి, మంచం మీద పరుపు పూర్తిగా తిరగేసేసి, ఆమె దాచుకున్నవేవీ లేవని నిర్ధారించుకున్నాకా...

"ఇదిగో చూడమ్మా. ఇష్టంతో కన్నాను అన్నావు. ఒక్కగానొక్కడినని కళ్ళల్లో వత్తులు వేసుకుని మరీ పెంచాను అన్నావు. ఆ ప్రేమతోనే నేను మనస్ఫూర్తిగా ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేశావు. 'నన్ను కనమ్మా' అని నేను అనకపోయినా నన్ను కన్నావు కాబట్టి, సవ్యంగా పెంచి నీ బాధ్యత సక్రమంగా నిర్వర్తించుకున్నావు. అందరితో 'విజయలక్ష్మిగారు ఎంతో చక్కగా తన బాధ్యతలు నెరవేర్చిందమ్మా' అనిపించుకున్నావు. అంతే బాధ్యతతో 'ఆవిడ కొడుకు కూడా తల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకున్నాడన్న' పేరు తెచ్చుకోవాలని నాకూ ఉంది. అందుకే నామీద నీకేమాత్రం ప్రేమ ఉన్నా, నాకు చెడ్డ పేరు రాకుండా చూసుకో. ఇక మీదట మందు బిళ్లలు అయిపోయిన ఖాళీ రేపర్లు చూపిస్తేనే కొనిస్తాను. అంతే తప్ప ఇలా మంచాల కిందో, ఇంకెక్కడో దాచేసుకుంటే నా బాధ్యత కాదమ్మా. నాకు చెడ్డ పేరు వచ్చిందో నేను బతికి ఉండనమ్మా. ఆ..." అనేసి వెళ్ళిపోయాడు.

"దేవుడి సాక్షిగా పరుపు కింద పెట్టిన విషయం మర్చిపోయాను. అంతే గాని నువ్వు కొనవేమో అని దాచుకోలేదురా.  నీమీద ఒట్టురా!  నిన్ను ఎలా నమ్మించను?' పేగులు తెగేలా ఏడ్చి, మళ్ళీ అన్నీ సర్దుకుంది తాను.

అవును. సర్దుకోవాలి. వాడిని అడిగి కనలేదుగా తను? అందుకు సర్దుకోవాలి. సర్దుకుంటాను. నువు సుఖపడాలనే ఈ అమ్మ కోరికరా నాన్న! ఆనాటి నుంచి వాళ్ళు ఎలా చెబితే అలా వింటోంది తాను. అయినా తనకు రోజు వెళ్లనీయడం లేదు కోడలు.

మనఃశాంతిగా బతకాలంటే  ఏదో ఒక వ్యాపకం ఉండాలి ఆమెకి. అందుకే కాబోలు.. ఆ నటరాజు మళ్లీ దారి చూపించాడు!  మెలకువగా ఉన్నప్పుడల్లా నాటకం పోర్షన్ నెమరు వేసుకుంటోంది. అది జరిగిన మూడో రోజు...

హాలులో ఒకటే సందడి. కొడుకు కోడలు  లోపలికి వచ్చి

"అత్తయ్యా శుభ్రమైన చీర కట్టుకురా. మీ  మనవరాలిని చూసుకోవడానికి పెళ్ళి వారొస్తున్నారు." అని అంటూ,         'నువు కూడా చెప్పు.' అన్నట్టు  డొక్కలో పొడిచింది మొగుడిని .

"అవునమ్మా! నా   పెద్దదిక్కు నువ్వేగా! నీ కోడలు   పిన్ని మనవడు, ఒక పెళ్ళిలో దాన్ని చూసి  ఇష్టపడ్డానని  చెప్పాడు. ఇవి నామకః పెళ్ళిచూపులు! మాటలు, ఇచ్చిపుచ్చుకోవడాలు అన్నీ మాట్లాడేసుకున్నాం. మళ్ళీ నెలలోనే పెళ్లి. నువు తొందరగా తెములు. నువ్వు పద." అని పెళ్ళాంతో వెళ్లిపోయాడు కొడుకు. పెళ్ళివాళ్లు వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్లాకా  కొడుకు మళ్ళీ వెనక్కి వచ్చి, నేలమీద కూర్చుని తన వొడిలో తల పెట్టుకుని

"అమ్మా. నీ మానవరాలి పెళ్ళికి కొంచం డబ్బు కావాలి. నీ పెన్షన్ లో లోను పెట్టి ఇస్తే, మళ్ళీ తీర్చేస్తాను. ప్లీజ్ అమ్మా!" అని జాలిగా అడిగితే గుండె ద్రవించిపోయింది ఆమెకు. లోనుగా వచ్చిన  లక్ష రూపాయలు తీసుకున్నాడు.

తనకి, తన  పెద్దరికానికి ఈరూపంగానైనా విలువ  ఇస్తాడనుకున్న ఆశ ఈ  ఆఖరి అవకాశంతో తీరకుండానే పెళ్లికూడా అయిపోయింది. పెళ్ళిలో మాత్రం తనకు ఎంత గౌరవం చేశారని? పెళ్లి మండపంలో ఆఖరి వరుసలో చివార్న కుర్చోపెట్టారు. ఆఖరికి  టిఫిన్, కాఫీ, మంచినీళ్లు, భోజనంతో సహా ఓ మూల పెట్టారు. ఆ పక్కనే బాత్రూము కాబట్టి సరిపోయింది. తనని కాలు   కదపనీయలేదు. దాన్నెవత్తినో తాటకిలాంటి దాన్ని తన పనుల కోసం పెట్టారట.

"నీకు ఏం కావలిసినా అడుగమ్మా. ఇక్కడే ఉంటాను." అని పక్కన మెట్టు మీద కూర్చుంది. తెలిసినవారు ఎవరు తనకోసం వచ్చి పలకరించి వెళ్ళినా అన్నీ మాటలూ వింటూ,  ఆ తాటకి జాకెట్లో దోపుకున్న  స్మార్ట్ ఫోన్ బయటకు తీసి  పాటలు వినేది. మొత్తానికి యే గొడవా లేకుండా పెళ్లి శుభంగా జరిగిపోయింది.

పిల్ల అత్తారింటికి వెళ్లిపోయింది. ఎందుకో.. ఆ రోజు ఎంతకీ నిద్ర పట్టలేదు. వేసుకుందామని తీసిన నిద్రబిళ్ళ కాస్తా తీస్తున్నప్పుడు జారీ పడిపోయింది. కోడల్ని పిలిచి తీయమంటే చంపెయ్యదూ? లైటేస్తే ఇంకేమన్నా ఉందా? అనుకుంటూ ఉండగా - హాల్లో మాటలు.

''ఇక్కడేమిటే? అమ్మ వింటుంది.''

''ఆవిడ నిద్రబిళ్ళ వేసుకుని ఎప్పుడో పడుకుని ఉంటుంది. విన్నా నష్టం లేదు. ఇలా ఎంతకాలం ఈ జంజాటం. పిల్ల పెళ్లి అయ్యి అత్తారింటికి వెళ్లింది. ఈ లంపటాన్ని ఎలా వదిలిస్తావో వొదిలించెయ్. సుఖంగా ఉండచ్చు.'' అంటోంది కోడలు.

''ఏమని చెప్పను?'' కొడుకు బేలతనం.

''ఏ వృద్ధాశ్రమంలోనో ఉండమను! చచ్చేంతవరకు అక్కడే ఉండాలి. నీకు చేతకాకపోతే చెప్పు, నేను చెబుతాను. మాట వినకపోతే ఎలా పంపాలో నాకు తెలుసు.''

''ఈ ఇల్లు ఆవిడదే. నీ పుణ్యమా అని ఆవిడ ఇంట్లో ఉంటూ, ఏదో రకంగా అద్దెతో పాటు మిగిలిన పెన్షన్ కూడా దోచేస్తున్నాం. పాపమే! ఇపుడు బయటకు వెళ్తే పెన్షన్ లోను పోగా పదివేలు కూడా రాదే.''

''చూడు. మాట వింటే, నువ్వు అపుడప్పుడు చూసుకోవడానికైనా మీ అమ్మ మిగిలి ఉంటుంది. తర్వాత నీ ఇష్టం.'' కోడలి ఉద్దేశం అర్థమైంది.

***

''అమ్మా విజయా మీ నటన పాత్రకు ప్రాణం పోసింది. యధాతథంగా ఉత్తమ నటి అవార్డ్ కొట్టేశారు. నా వూహని నిజం చేశారు. ఇదిగో మీకు బహుమతిగా వచ్చిన ఆ వెండి షీల్డ్ ...'' అన్నాడు బాలాజీ రావు.

ఆమె దాన్ని బాగ్ లోంచి తీసి ఇచ్చేసింది ఆయనకు. ''మీరు ఇచ్చిన చీర... మూడువేలు నాకు చాలు సర్ వస్తాను.'' అని బస్ ఎక్కేసింది ఆమె

***

ఏ.టి.ఏం. కార్డు కోసం తల్లి గదిలోకి అడుగుపెట్టి దిండు కింద చేయి పెట్టిన ఆ కొడుకుకి ఒక చీటి తగిలింది చేతికి.

"నాన్నా,

కన్న ప్రేమపాశం తెంపుకోవడానికి ఇంతకాలం పట్టింది. పుట్టిన ప్రతీ మనిషికి దేవుడే ఇస్తాడు వీధి ఒకటి. నాకు ఇచ్చాడు. నీకు ఇవ్వకుండా చూసుకో!

అమ్మ .. విజయలక్ష్మి"

ఆమె ఎక్కిన రైలు పడమర దిక్కుగా సాగిపోతోంది.

***0***

# ఆమె

## భాగవతుల భారతి



నా చిన్నప్పటి నుండీ భాగవతం, మహాభారతం వింటూనే పెరిగానేమో... 'కౌశికుడూ, ధర్మవ్యాధుడు.. ఓ పతివ్రత కథ!'నన్ను ఆలోచింపజేసేవి. అలాగే 'కుచేలోపాఖ్యానం' కూడా!

ఇలా కూడా జరుగుతుందా అనీ, అనుభవంలోకి వచ్చేవరకూ చాలా విషయాలు 'అబ్బే.. అంతా అబద్ధమే' అని అందరు అనుకుంటారేమో! నేనూ కూడా అంతే.. అలాగే అనుకున్నా, 'ఆమె' కలిసేవరకూ ......! రేపు ఆఖరి పాప పెళ్ళి ఈ గుళ్ళోనే.. గుడిలోకి చూసాను. గురువాయూరప్ప నవ్వుతున్నట్లనిపించి, గతంలోకి జారిపోయాను.

***

ఆ రోజు ఇదే గుళ్ళో వేదాధ్యయనంలో ఉన్నాను. నా వృత్తీ అదే, దినచర్యా అదే! మధ్యలో ఓ ఫోన్ వచ్చింది.
"గురువాయుర్ గుడేనా అండీ "అని.
నేనూ తెలుగు రాష్ట్రంనుండే వచ్చాను కాబట్టి, మంత్రం ఆపి, ఫోన్లోనే "అవునండీ " అన్నాను.
"గురువాయూర్ గుళ్ళో ప్రతీ సంవత్సరం ఉత్సవాలు జరుగుతాయని, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయనీ విన్నామండీ. అప్లికేషన్ పెట్టాలనుకుంటున్నాం. ఆ గుళ్ళో తెలుగు వారున్నారు అని తెలిసింది. చిరునామా దయచేసి తెలియజేయగలరా. మా పిల్లలు ఆ కార్యక్రమంలో పాల్గోనాలని మా కోరిక!" అడిగింది ఓ ఆడ గొంతు.
నేను చిరునామా చెప్పి, నా పనిలో నిమగ్నమై పోయా. మర్నాడు మళ్ళీ ఫోన్ మ్రోగింది.
"ఏమండీ! నిన్న ఫోన్ చేసాం! చిరునామా చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలకు దరఖాస్తు పెట్టాము. మాకేమన్నా సహాయపడగలరా? దరఖాస్తు అందినదీ లేనిదీ, కార్యక్రమం వివరాలూ తెలపగలరా? మేం మళ్లీ ఫోన్ చేస్తాం!"
"సరేనండీ తప్పకుండానండీ, కమిటీ వాళ్ళకి చెప్పి" అన్నాను. నిత్యానుష్టానం, సంధ్యావందనం, స్వాధ్యయనం, దేవాలయంలో స్వామి వారి సేవ నిత్యకృత్యమైన నేను, మానసికంగా ఎంతో అలజడిలో...
"గురువాయూరప్పా! కృష్ణా! కుచేలుణ్ణి కాచావే నన్ను పరీక్షిస్తున్నావెందుకు?" అని కన్నీళ్ళతో అనునిత్యం ప్రార్థిస్తూ ఉండే స్థితిలో ఉన్నాను నేనప్పుడు.
మర్నాడు మళ్ళీ ఫోన్ "ఏమండీ! మా సాంస్కృతిక కార్యక్రమాల సంగతి గుడి వాళ్ళు ఏమన్నారూ? " అని.

"మీ దరఖాస్తు అందిందటండీ. నేనూ గుర్తు చేస్తానండీ" అన్నాను.

మళ్ళీ మర్నాడు ఫోన్, ఆమర్నాడు మళ్ళీ ఫోన్, నాకు చిరాకు వచ్చేస్తోంది. కానీ సభ్యత అడ్డంవచ్చి , ఏమీ అనకుండా సంభాషణ కొనసాగిస్తున్నా. మళ్ళీ ఫోన్.

"ఏమండీ! మీకేం కావాలండీ?" విసుగ్గానే అడిగాను.

"మీ ఆశీర్వచనం కావాలి" అంది.

"ఆశీర్వచనమా? మహదాశీర్వచనమా?" అడిగాను కోపంగా.

"ఎందుకండీ అంత కోపం! పిల్లలకీ.......ఐనా రెంటికీ తేడా ఏంటో ..." అంది.

తను నాతో పరిచయం పెంచుకోటానికే ప్రయత్నిస్తోందని.. ఎందుకో అనిపించింది. రోజుకోసారి ఫోన్ చేసి మాట్లాడటం వల్ల మా మధ్య చనువూ పెరిగింది. తను మాట్లాడే విధానాన్నిబట్టి ఆమెను చూడాలనే కోరిక కలిగింది. దానికి చాలా బలమైన కారణమూ ఉంది.

నా భార్య పురిటికని పుట్టింటికి వెళ్ళింది. ఇంతకు ముందే నేను ఇద్దరు ఆడపిల్లల తండ్రిని. ఆపరేషన్ వికటించి, మళ్ళీ మాకు కవలపిల్లలు ఆడపిల్లలే కలగటం నేను జీర్ణించుకోలేకపోయాను. మానసిక ప్రశాంతతను కోల్పోయాను. అదోలాంటి డిప్రెషన్. నా బీదరికమూ, నలుగురు ఆడపిల్లలూ, ముసలి తల్లిదండ్రులూ. హే! కృష్ణా! నను పరీక్షించకయ్యా! అనని రోజు లేదు. ఆర్తితో మొరపెట్టుకోని క్షణమూ లేదు. దాదాపు పిచ్చివాడినై పోయాను.

ఆ సమయంలో ఆమె పరిచయం, నాకెందుకో.. ఎండిన బీడుపై వానజల్లే. పైగా ఆడవాసన తగలక విలవిల్లాడే వేళ, తను అలాంటిదేమో అనే ఆశ నాకు తెలీకుండానే, విచక్షణ కోల్పోయేటట్లు చేసింది.

"మీ గోదావరి జిల్లాల్లోని ఓ ఊళ్ళో నాకు పని ఉంది. వస్తున్నాను. వస్తే మాకేం ఇస్తారూ?" అడిగాను.

"మాదగ్గరేం ఉందీ ఇవ్వడానికి, మా సిగ్గు దొంతరలు దోసిళ్ళలో పెట్టి అందిస్తాం రండి." అంది ఆమె. ఆమె ఏ ఉద్దేశ్యంతో అన్నా, నాకు మాత్రం ఇంకోలా వినబడి, నిలువ లేని ఏదో, ప్రేరణ నన్ను తరిమింది. కృష్ణుని వంక చూసాను. అదే చిరునవ్వు ఆయనలో.

***

పని పూర్తయి ఆమె దగ్గరకు నేను వెళ్ళేసరికి అర్ధరాత్రి అయింది. వెళ్ళిన దగ్గరనుండీ నా చూపంతా 'ఆమె' పైనే ఉంది. పరిసరాలు పట్టించుకునే స్థితిలో లేను. లైటు కాంతిలో మెరిసిపోతోంది ఆమె అందంగా. వేదపండితుణ్ణయిన నాకు నమస్కరిస్తూ, ఆమె ముసలి అత్తా మామ కనిపించారు! కానీ ఇవేవీ చూసే మానసికస్థితిలో లేను. నా ధ్యాసంతా, 'ఆమె' మీదే ఉంది.

ఎన్నో కబుర్లు చెప్పింది. నా కళ్ళల్లోని వెలుగుతో సయ్యాటలాడింది. ఆశల ఊహల ఉఱ్ఱూతలూగించింది. ఆమె నుండి ఏదో పొందాలనే నాలో వయసు మనసూ పోరు.

"మీరు బాగున్నారు. మీ పక్కన నిలబడాలంటే అర్హత కావాలి, అలాంటిది మీరే వెతుక్కుంటూ మా ఇంటికి వచ్చారు. భగవత్స్వరూపులు!" అంది.

"ఎందుకూ.. మీరు నా పక్కనే ఉన్నారుగా! డాబా మీదికెడదామా?" అన్నాను.
నా మాట వినిపించుకోదేం! ఏదేదో మాట్లాడేస్తూ ఉండగానే, బస్సు టైం అయింది. ఎక్కించేసింది.

తిరిగి వచ్చాక "కృష్ణా, గురువాయూరప్పా! సొంతవాళ్ళు పిలిస్తేనే వెళ్ళని నేను, అంత దూరం నువ్వే తరిమినట్లుగా వెళ్ళానే.. ఏం చేద్దామనీ నువ్వాడే నాటకం. విష్ణుమాయా? నీకే తెలియాలి" కోపంగా అన్నాను. కానీ లీలామానుష విగ్రహుడు అదే చిరునవ్వు.

ఆమె మళ్ళీ ఫోన్ చేసింది. నా కోరిక తీర్చలేదనే కసి నాలో జ్వాలై మండింది. తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాను.
"ఈ మాయ మాటలు మాట్లాడే, అంత దూరం రప్పించావు. పిచ్చివాడికి మల్లే అంత దూరం పరుగెత్తుకు వచ్చాను. దూరపు కొండలు నున్నగా ఉంటాయని మీలాంటి జ్ఞానుల వల్లే మేం నేర్చుకోవాలి. నేను నలుగురు ఆడపిల్లల తండ్రిని. నా పని నన్ను చేసుకోనీయండి. ఇలా మా ప్రశాంతతను చెడగొట్టకండి!" తిట్లు పూర్తి కాకముందే ఫోన్ పెట్టేసింది.
మళ్ళీ ఆమె ఫోన్ చేయదనుకున్నా. కానీ ఆరు నెలల తర్వాత ఫోన్ చేసింది.
"బాగున్నారా?" అంది.
"బాగున్నాను! మీరూ మీవారూ బాగున్నారా?" ప్రశాంతంగానే అడిగాను.
"బాగున్నాం. మీరూ పిల్లలూ, అక్కా బాగున్నారా?" అంది.
"అక్కా! ఇదెక్కడి వరసా?"అన్నాను.
"ఎందుకండీ అంత కోపం?" అడిగింది ఆమె.
"ఏమండీ భానుమతిగారూ! నేను అతి బీద బ్రాహ్మణుణ్ణి. నా మీద ఆధారపడి, నలుగురు పిల్లలు, ముసలి తల్లిదండ్రులూ, ఓ భార్యా ఉన్నారు. నేను ఏరకంగానూ మీకు సాయపడలేను. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' ఎవరు చేసుకున్న ఖర్మ వారు ఇదిగో ఇలా అనుభవించాల్సిందే అనుకునే స్థితిలో నేనున్నాను. నన్ను వదిలేయండి!" అన్నాను.
"బాబూ కుచేలశర్మగారూ!" అంది పరిహాసంగా.
"నా పేరు విష్ణు, విష్ణుశర్మ!"
"విష్ణూ .. మీరు నాకంటే జ్ఞానంలో పెద్దవారు. నేను వయసులోనూ, అనుభవంలోనూ పెద్దదాన్నేనండీ! మీరు మనసును నా ధ్యాసలో కాకుండా, మా ఇంట్లోకి చూసుంటే తెలిసేవి కొన్ని నిజాలు మీకు. ఖర్మఫలం ఎంత ఛండాలంగా ఉంటుందో, ఎన్ని రకాల ఖర్మలుంటాయో, అడుగడుగునా చవిచూసిన దాన్నేనండీ. తల్లీ తండ్రీ లేరు. తోబుట్టువులూ అంతంత మాత్రమే. ముసలి అత్తా మామా. చిన్నవయసులోనే పక్షవాతం వచ్చి ఉద్యోగం మానేసి, మంచం ఎక్కిన భర్తా, ఇద్దరు పిల్లలూ. ముసలి మామగారి ప్రభుత్వ పదవీ

విరమణానంతర భృతి కాక, కొద్దిపాటి ఆస్థీ, నేను చేసే చిన్నపాటి ఉద్యోగం ఇవే ఆధారం. కానీ నా పెదవులపై చిరునవ్వు చెరగలేదు. నేనెప్పుడూ ఎవరి కోసమూ ఆశ పడలేదు!"

"మరి నాకెందుకు ఫోన్చేస్తున్నట్లూ?" వెటకారంగా అన్నాను.

"దేవాలయంలో వేదం చదివే విష్ణుశర్మని పనిగట్టుకొని, కాలమో, విష్ణుమాయో, ఇక్కడ ఈ మారుమూల వరకూ, సుదాముని ఇంటికి కృష్ణుడు వెదుక్కుంటూ వెళ్ళినట్లు తరిమి పంపిందంటే, ఏదో కార్యాకారణ సంబంధం లేనిదే జరగదు. ప్రకృతి చెప్పే సందేశం ఏమిటో!" అంది...

నేను కూలబడి గుళ్ళోకి తొంగిచూసా, చిద్విలాసంగా గురువాయూరప్ప నవ్వు. ఆ తర్వాత ఆమె నా వాట్సప్ లోకి వచ్చి నిరంతరమూ మెసేజెస్ రూపంలో మాట్లాడుతూనే ఉండేది, నా నుండి ఎటువంటి స్పందనా, సమాధానం లేకపోయినా సరే. బహుశా ఏదో తీవ్రమైన మానసిక ఒత్తిడిని తట్టుకోటానికే ఇలా మాట్లాడేస్తోందని నాకనిపించింది. మరి మాట్లాడటానికి నన్నే ఎందుకు ఎంచుకుందీ?

"ఓసారి మీరంతా రండి దైవదర్శనానికీ, మా దర్శనానికీ!" అన్నాను.

"దైవాన్ని మనుషుల్లో దర్శించటమే నాకిష్టం. ఇక మీ దర్శనభాగ్యం? ఏ క్యాలెండర్ మీద చూసినా, శేషతల్పంపైన పవ్వళించిన మీరేగా! మీ పాదాలు వత్తుతూ అక్క!" అని నవ్వేది.

రోజుకో పేరుతో సంబోధించేది.

"శ్రీధరా! ఏం చేస్తున్నారూ?"

"మాధవా! ఏంటి సంగతులూ?"

"పద్మనాభా! బాగున్నారా?!" 'అనిరుద్ధా, పురుషోత్తమా'... ఇలా..

ఇలా నా పేరు నేను మరిచిపోయి, సహస్రనామాలతో పిలవబడుతూ, పలుకుతూ, తననుండి నేను చాలా నేర్చుకున్నాను.

స్వీయ నియంత్రణ, పరిస్థితులకు ఎదురొడ్డి పోరాడడం, ఏ పరిస్థితుల్లోనైనా, చిరునవ్వు చెదరనీయకపోవటం! ఆమె మీద చెడు అభిప్రాయం పోయి, ఆడదంటే ఇలా ఉండాలి, కాదు... ఇలాగే ఉండాలి... అనే అభిప్రాయానికి వచ్చి, ఎప్పుడు ఫోన్ చేసినా, నవ్వుతూ కుశల ప్రశ్నలడిగే స్థితికి వచ్చేసాను.

ఓరోజు "మీరు ఇబ్బందుల్లో ఉన్నట్లున్నారు. పైకమేదన్నా కావాలా? నేను ఆర్ధిక సహాయం చేయగలను!" అంది. నేను ఆశ్చర్యపోయాను.

"మీరే ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితుల్లో, ఇదేం సాహసం?" అన్నాను.

"ఫరవాలేదు! ఉన్నదానిలోనే పంచుకుందాం!" అంది.


ఎందుకు పంచుకోవాలో నాకు అర్థంకాలా! కానీ దేనికో నా సాన్నిహిత్యం కోరుకుంటోందని మాత్రం అర్థమయింది. శారీరక సుఖం కాదు. అది వాళ్ళింటికి వెళ్ళినప్పుడే అర్థం అయింది. డబ్బు కాదు, అది ఇప్పుడర్థమవుతోంది. కొన్ని బంధాలకు, అర్థాలుండవు. కలయికలకు పేర్లూ ఉండవేమో!

నిజంగానే డబ్బు పంపింది. వద్దనలేని పరిస్థితిలో మొహమాటంగా "ఎందుకండీ" అని మాత్రం అనగలిగా.
"వేదం అంటే భారతీయ ఆత్మ అండీ! విదేశాలు మనల్ని గౌరవిస్తున్నాయంటే వేదమూ, యోగా, సాంప్రదాయాలే. అలాంటి వేదం, బీదరికంలో మగ్గిపోకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజానిదే. నేనే కాదు, ఇంకెవరైనా పెద్దమనసున్న మారాజులుంటే, వాళ్ళనీ సాయం అడుగుతా మీ పేరు చెప్పి.." అంది.
అన్నంత పనీ చేసింది. ఎక్కడెక్కడి నుండో విరాళాలు వచ్చేవి. ఆర్ధికంగా కాస్త కుదుటపడ్డా!
ఆశ్చర్యంగా ఆమె నెలనెలా డబ్బు పంపుతూనే ఉంది. ఏదో వ్యాపారం కూడా మొదలు పెట్టానని చెప్పింది. నాలుగు సంవత్సరాల తర్వాత ఆరోజు రిజిష్టర్డ్ పోస్ట్ వచ్చింది. ఆశ్చర్యం అది నా పేరు మీదే. తెరిచా. అన్నీ చూసి ఘ్రాన్పడి పోయా. బ్యాంక్ ఫిక్సెడ్ డిపాజిట్ బాండ్స్. నలుగురు పిల్లలకీ, ఒక్కోరికీ రెండు లక్షల చొప్పున ఎనిమిది లక్షలు, నా పేరు మీద రెండు లక్షలు. మొత్తం పదిలక్షల రూపాయల డిపాజిట్ తాలూకు జిరాక్స్ కాపీలూ, ఓ ఉత్తరం!
“బాబూ కుచేలశర్మగారూ.. కాదు ఈ రోజు నుండి మీరు విష్ణుశర్మగారే!
సఖ్యం కలవాలంటే ఏడు అడుగులు కలిసి నడిస్తే చాలంటారు. ఏ సఖ్యానికైనా, అదే వర్తిస్తుందంటాను నేను! ప్రతీ పరిచయానికీ, అర్ధమో, పరమార్థమో ఉండాలంటారు, కానీ మన పరిచయానికి ఏ పేరు పెట్టాలో, నాకు తెలీలా! ఓవేళ మీకు తెలిసీ, నాకు చెప్పాలనుకున్నా, నేను మీకు ఇక కన్పించనూ, వినిపించనూ. మీరు ఊహించింది నిజమే. నా మానసిక ఒత్తిడి తట్టుకుని, మనిషిగా నిలద్రొక్కుకోటానికే ఇన్నాళ్ళుగా మీతో ఆడానూ, పాడానూ.
‘నాతోనే ఎందుకు? నేను మీకేం ఇవ్వగలిగాను?’ అని మీ ప్రశ్న.
ఇవ్వడానికీ, ఎవరెంత ఇచ్చిపుచ్చుకున్నారో తేల్చుకోటానికి, ఇది వ్యాపారం కాదండీ, స్నేహం. అయినా ఎవరు ఎందుకు కలుస్తారో, విడిపోతారో, తేల్చాల్సింది మీ గురవాయూరప్పే. మిమ్మల్ని నావైపు తరిమిన మానసిక స్థితే, నన్నూ మీ వైపు మానసికంగా దగ్గర చేసింది. కానీ ఇద్దరినీ ఏ తప్పుకీ ప్రేరేపించకుండా ఆపింది ఆ గురువాయూరప్పే.
అత్తయ్యా, మామయ్యా పోయారు. ఆస్థులన్నీ అమ్మేసి, అనారోగ్యంలో ఉన్న మావారిని, పిల్లలను తీసుకొని మా పల్లెటూరికి వెళ్ళిపోతున్నాను. ఊరు, పేరుతో మీకు సంబంధం లేదు. కానీ ఆస్థులు అమ్మేసాక బీదరికంలో అల్లాడుతున్న, నలుగురు ఆడపిల్లల వేదపండితుల కుటుంబం కళ్ళ ముందు కదలాడింది. ఏ జన్మలో ఏం పాపం చేసానో, చాలా అనుభవించాను. ప్రాయశ్చిత్తం అనుకోండి, ఏదో జన్మ ఋణం అనుకోండి. ఒరిజినల్ కాపీలు ఓ మనిషి ద్వారా మీకు అందజేయబడతాయి. ఆ సొమ్ము పిల్లల పెళ్ళిళ్ళకు వెదుక్కోకుండా చేతికొస్తుంది. నా గురించి వెదక్కండి. ఎప్పుడన్నా గుర్తుకు వస్తే, గురువాయూరప్పలో నన్ను చూసుకోండి. ఇక ఉంటాను. శెలవ్.
మీకు ఏమీ కాని
-నేను”

నా చేతిలో కాగితాలు జారిపోయినాయ్. అమ్మా మగువా.. నువ్వు తల్లివా? చెల్లివా? పరాశక్తివా? నిన్ను ఎన్ని పేర్లతో పిలిచినా తక్కువే! ఓ స్త్రీ నీకు వేల ప్రణామాలు. గాలిలోనే చేతుల పైకెత్తి నమస్కరిస్తూ, వడివడిగా గర్భగుడిలోకి పరుగెత్తాను. 'ఇదంతా నీ మాయా లీలా విలాసం కాదూ' అడిగాను. అప్పుడూ అదే చిరునవ్వుతో, కన్నీళ్ళ నడుమ మసకమసకగా కనబడ్డాడు గురువాయూరప్ప. మళ్ళీ మరో మోహినీ అవతారంలో!

గతంలోంచి బయటి కొచ్చి దేవుణ్ణి చూస్తూ 'గురువాయూరప్పా' అనుకున్నాను. నీ గురువాయూరప్పతో పాటుగా నీకు నేనున్నానులే అని ధైర్యం చెబుతున్నట్లు కనిపించింది ఆమె.

***0***



# నలుపే తెలుపు

## బోడపాటి రమేష్

సినిమా షూటింగ్ మొదటి రోజునే ప్రెస్ వాళ్ళకి చెప్పించాడు ప్రొడ్యూసర్ చేత... సినిమాకు ఎంత ఖర్చయినా సరే క్వాలిటీకి వెనకాడను అని. ఆ పార్టీ మత్తులో జోగుతున్న పాత్రికేయులు ముచ్చటగా మూడు ముక్కల్లో రాసుకుని వాళ్ళ పత్రికల్లో ఎక్కించేశారు, 'భారీ చిత్రనిర్మాణం' అని. ఆ రోజునే జిల్లాలవారిగా అమ్మకాలు కూడా జరిగిపోయాయి. డైరెక్టర్, హీరోల మహాత్యం అది. నరసారావుపేట చాంతాడులా ఖర్చు పెరిగిపోతోందే కాని పిక్చర్ అడుగు తగలటం లేదు.

మొబైల్ మాటల రచయిత అక్కడే ఒక మూల కూర్చుని మాటలు వండుతున్నాడు. ఆయన స్క్రిప్ట్ ఎప్పుడూ పూర్తిగా ఇవ్వడు. అది తన వృత్తికే కళంకం అని ఆయన నమ్మకం. ఆరోజు షూటింగ్ వివరాలు ప్రొద్దున్నే కనుక్కుని స్పాట్లో మాటల 'వాయ' తీసి ఇచ్చేసి వెళ్ళిపోతాడు.
హీరోగారి కోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఇంటికి ఫోను చేస్తే పొద్దున్నే బయలుదేరి షూటింగుకు వెళ్లిపోయారని సమాధానం. నిజమో కాదో తెలుసుకోవాలనే ధైర్యం ఎవరికి లేదు. ఇంత వయసొచ్చినా ఎందుకంత తాపత్రయం అనుకోవటం తప్పించి.

అవతల జూనియర్ ఆర్టిస్టులకు ఇంకొకసారి టీ ఇప్పించారు. జు.ఆ. సప్లైయర్ సణుక్కుంటున్నాడు, మరీ 'టీ పోతులు' అయ్యారేమిట్రా అని. ఎందుకంటే ఇది ఆరోజు ఆరోసారి టీ ఇప్పించటం.

ఇంతలో హీరోగారొస్తున్నారు అంటూ కలకలం మొదలయింది. హీరో అవినాష్ అప్పుడే తను కొత్తగా కొన్న లక్జరీ కారులో వస్తున్నాడు. హీరో కారు దిగటంతోనే ప్రొడ్యూసర్, ఫైనాన్సియర్ నమస్కారం అన్నారు. డైరక్టర్ కూడా బాగుండదని దూరం నుంచే విష్ చేశాడు. అవినాష్ తన ఎడం చెయ్యి ఎత్తి అందర్నీ పలకరించాడు. ఆ పక్కనే ఉన్న ఏ.సి. గెస్ట్ హౌస్లో మేకప్ చేసుకోటానికి వెళ్లిపోయాడు.. తన సెక్రెటరీతో కలిసి.

తను ఆలస్యంగా ఎందుకు వచ్చాడో ఆయన చెప్పలేదు. ఎవరూ అడగలేదు. అసలా ప్రశ్నే అసందర్భంగా అనిపించింది అక్కడివాళ్ళకి.

కొంతసేపటికి సెక్రెటరీ బయటకు వచ్చాడు. ప్రొడ్యూసర్ డైరెక్టరు ఆయన్ను కలుసుకున్నారు.

"ఇవాళ సార్ డైలాగులేమిటి?" అన్నాడు దర్పంగా.

మొ.మా. రచయిత అప్పటిదాకా ఆదరాబాదరాగా రాసిన మాటల మూట ఆయనకు అందచేశాడు. అది చదివిన సెక్రెటరీ చప్పరించి "అబ్బే ఇంకా ఫోర్సు కావాలండి... సార్ ఏమంటారో!" అని లోపలికి వెళ్ళాడు.

ఎంతసేపటికి హీరోగారు బయటకు రావటంలేదు. ఇంకొకసారి జూనియర్ ఆర్టిస్టులకు టీ ఇప్పించాల్సి వచ్చింది ప్రొడక్షన్ మేనేజరుకి. జూ.ఆ. సప్లయర్ అనుకున్నాడు 'ఈ రోజు ఖర్చులో తనకు మిగులు లోటే' అని.

కొంతసేపటికి సెక్రెటరీ బయటకొచ్చి "సార్ మూడ్ బాగాలేదు. ఇవాళ షూటింగ్ కాన్సిల్ " అన్నాడు.

నిర్మాత సెక్రెటరీ లోపలికెళ్ళారు. హీరోతో బయటకొచ్చారు. పరీక్షగా చూసినవాళ్ళకి నిర్మాత జేబు ఖాళీగాను, సెక్రెటరీ సూట్ కేస్ బరువుగాను కనిపించింది.

"రిహార్సల్స్ చేద్దామా?" అన్నాడు డైరెక్టర్. ఎందుకంటే షూటింగ్ కు తీసుకురావటం వరకూ నిర్మాత పని. ఆ తర్వాత పని తనదే కాబట్టి.

కానీ అవినాష్ "అక్కర్లేదు. ఈ మాటలు నా హృదయం లోంచి వస్తాయి. మీరే చూస్తారుగా. హాట్సాఫ్ టు ది రైటర్" అంటూ ఆ పక్కనే బిక్కుబిక్కుమంటూ చూస్తున్న రచయితను చూసి నవ్వాడు.

"అదే మహా భాగ్యం" అన్నట్టు మురిసిపోయాడా మానవుడు..

"రెడీ.. ఏక్షన్" అంటూ ఈల వేశారు డైరెక్టర్. కెమెరా స్టార్టయింది.

"కాబట్టి కామ్రేడ్స్ మనమంతా కలసికట్టుగా పోరాడి, మన మేనేజ్మెంట్ పెత్తందారీ, పెట్టుబడిదారీ విధానాల్ని కూకటివేళ్ళతో పెళ్లగించాలి. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకూడదు. అవినీతినీ, లంచగొండితనాన్నీ, మన ఛాయలకు రానివ్వకుండా తరిమికొట్టాలి."

"ఈ ఒక్క షాటే చాలు సార్, మన సినిమా హిట్ అవ్వటానికి!" అన్నాడు ఫైనాన్సియర్ తనకు రాబోయే లాభాలను కళ్ళముందు ఊహించుకుంటూ.

అంతా "నటన" అని సణుక్కున్నాడు నిర్మాత, ఇదంతా చూస్తూ.

ఎందుకంటే హీరోగారికి బ్లాక్ లో సమర్పించిన మొత్తం కళ్ళముందు ఆడుతోంది. అది ఇచ్చేదాకా షూటింగ్ మొదలవ్వలేదు మరి.

"అదే సార్ మనకు కావాల్సింది" అన్నాడు మొ.డై. రై. మురిసిపోతూ.

***0***




# పౌడర్ డబ్బా

సీత మండలీక

శాంత పెళ్లి అయి హైదరాబాద్ వెళ్లి పోయాక, శాంతతో పాటు రంగి జీవితంలో కూడా చాలా మార్పు వచ్చింది. రంగి, శాంత ఒకే పల్లెటూరి అమ్మాయిలు. అంతేకాక ఇద్దరూ పక్క పక్క ఇంటి వాళ్ళే. శాంత, రంగి కన్న రెండేళ్ళు పెద్ద. అందుకే రంగి, శాంతని అక్కా అని పిలుస్తుంది. ఇద్దరూ అక్కాచెల్లెళ్ళ మాదిరిగానే ఉంటారు.

శాంతకి ఏడాది క్రిందట ఆటో డ్రైవర్ వెంకట్ తో పెళ్లయి హైదరాబాద్ వెళ్ళిపోయింది. అప్పటినుండి రంగి ఒంటరిదై పోయింది.

శాంత పెళ్లయ్యేక చాలాసార్లు ఆ పల్లెటూరు వచ్చింది. వచ్చినప్పుడల్లా ఆమెలో మార్పును చూసి రంగి ఆశ్చర్య పోయేది. 'శాంతక్క ఇప్పుడు చూడ ముచ్చటగా తయారయింది. తన కట్టు, బొట్టులో చాలా మార్పు వచ్చింది. ఇదివరకు చీరలు కట్టుకునేది. ఇప్పుడు డ్రెస్సులు వేసుకుంటోంది. జడకు బదులు క్లిప్పులు పెట్టి తల దువ్వి తయారవుతుంది.' అని అనుకునేది.

అన్నిటికంటే రంగికి ఇష్టమయింది శాంతక్క రాసుకునే వాసన పగుడరు.

"అది రాసుకున్న శాంతక్క మొహం ఎంతో మెరిసిపోతుంది. వాసన కూడా ఎంత బాగుంటుంది. అమ్మని కొనిపెట్టమంటే 'మనకెందుకే ఆ సోకులు' అంటుంది. హాయిగా కళ్యాణం సేసుకుని హైదరాబాద్ పోవాలి. బోలెడు బట్టలు, క్లిప్పులు, పగుడరు అన్నీ కొనుక్కోవాలి. అన్నట్టు మరిసిపోయాను... శాంతక్క అక్కడ గిన్నెలు తోమడం, ఇల్లు ఊడ్చడం చేసి చాలా పైసలు సంపాదిస్తున్నాది. నేనూ అట్లాగే సెయ్యాల." అని నిశ్చయించుకుంది రంగి.

ఇలా కలలు కని, ఆరు నెలల తరవాత పళ్ళు అమ్ముకుంటున్న హరిబాబుని మనువాడి హైదరాబాద్ లో కాపరం పెట్టింది రంగి. హైదరాబాద్ చేరిన వెంటనే గిన్నెల పనిలో చేరి పైసలు సంపాదిస్తానని హరిని ఒకటే సతాయించడం ఆరంభించింది.

"మావా! మన ఇంటి సుట్టూ శానా ఇళ్లున్నాయి. ఓ రెండిళ్లలో గిన్నెల పనికి కుదురుకుంటాను!" అని హరితో చెప్పింది రంగి.

"రంగీ! నువ్వు పల్లెటూరి దానివి. ఇక్కడ మనుషుల సంగతి నీకు తెలియదు. మంచి సెడ్డలు తెలుసుకుని పనిలో పోవాల. డబ్బున్న పెద్దోళ్ల సంగతి నీకు తెల్వదు. ఆళ్ళ మనసులు.. డబ్బు లేని పేదోళ్ళ మనసంత

నొచ్చంగా ఉండవే రంగి!  ఇంట్లో ఏది పోయినా మననే వేలెత్తి సూపుతారు ఎందుకొచ్చిన బాద!"  అని చెప్పాడు హరి.

"నేను నమ్మకంగా పని సేస్తాను మావా బయపడమాకు!" అని చెప్పింది రంగి.

"సరే, నువ్వేం తొందరపడమాకు.  నేను గౌరమ్మ పిన్నికి సెప్తా,  ఆమెతో పోదువుగానిలే!"  అని చెప్పేడు హరి.

తక్కువ పని అని శ్యాం సారు ఇంట్లో, ఉమా అమ్మ చాలా మంచిదని వాళ్ళింట్లో,  ఇలా రెండిళ్లలో పనికి పెట్టింది గౌరమ్మ .

శ్యాంసారు  ఇంటికి ఎనిమిది గంటలకల్లా వెళ్లి, తొమ్మిది గంటలకల్లా పని పూర్తి చేసేది రంగి. ఉమా అమ్మ ఇంట్లో తొమ్మిది గంటల నించి పదకొండు గంటలకి పని పూర్తి చేసేది. పనులన్నీ శుభ్రంగా చెయ్యడంతో ఉమా అమ్మ చాలా సంతోషించింది. వాళ్ళింట్లో చాయి కూడా ఇచ్చేది. శ్యాం సారు వెయ్యి, ఉమా అమ్మ రెండువేల రూపాయలు ఇచ్చేవారు. నెలకి మూడు వేలు ఎప్పుడూ కళ్ళ చూడలేదేమో.. రంగి సంతోషం పట్టలేకపోయింది. అమ్మతో చెప్తే "పైసలు దాచుకోవాల బిడ్డలు పుట్టేక అవసరం!" అంది.

శాంతక్కలాగే తను కూడా డ్రెస్సులు వేసుకోవాల. మావ కూడా అదే మాటన్నాడు. క్లిప్పులు, మెరుస్తున్న బొట్లు మొదటి జీతంలోనే కొనాల.

మర్నాడు పనికి పోడానికి డ్రెస్ వేసుకుంటే 'నీకు ఇది చాలా బాగా నప్పిందే రంగీ' అంటూ మావ ముచ్చట పడ్డాడు. ఉమా అమ్మగారు కూడా 'నువ్వు డ్రేస్సేవేసుకోవే.. పొడుగ్గా ఉంటావు కదా! నీకు చాలా నప్పిందే' అన్నారు .

ఈ మధ్య శ్యాం సారుకి పెళ్లయి వాణి అమ్మని తీసుకు వచ్చారు. ఎందుకో రంగికి ఆ అమ్మ అంత నచ్చలేదు. ఏ పని చేసినా వెంటే ఉంటుంది.  అసలు మాట్లాడదు. పొద్దుటే పనికి వచ్చినప్పుడు చాయి కూడా ఇవ్వదు. 'ఉమా అమ్మ మంచి అమ్మ' అని మనసులో ఎన్నో సార్లు అనుకుంది రంగి. వాణి అమ్మ తెల్లగా చాలా బాగుంటారు. స్నానం చేసి పగుడరు  పూసుకుని వస్తే ఘుమ ఘుమలాడిపోతారు.

ఆ వేళ అమ్మ చాలా సంతోషంగా ఉన్నారు. "ఏమే రంగీ చాయి తాగుతావా?" అని చాయి ఇచ్చారు. ఇల్లు ఊడుస్తుంటే వెంట తిరుగుతూ ఏవో కబుర్లు చెప్తూనే ఉన్నారు. వాణి అమ్మ డ్రెస్సింగ్ టేబుల్ క్లీన్ చేస్తుంటే నేను చేస్తానమ్మా అంటూ అక్కడే ఉన్న పగుడరు  డబ్బా చేతిలో తీసుకుని తుడుస్తూ ఈ పగుడరు డబ్బా ఎంతయిందని అడగకూడని ప్రశ్న వేసింది రంగి. 'నాలుగు వందలయిందని' వాణి చెప్పి, చాలా మట్టుకు పౌడరు అయిపోయిందని, అల్మారాలో ఉన్న కొత్త డబ్బా తెచ్చి పెట్టింది వాణి.

మర్నాడు పాత పౌడరుడబ్బాలో పౌడర్ వాడేక, డబ్బా పారేయవే అని రంగి చేతులో పెట్టింది వాణి "అమ్మా ఈ డబ్బా నేను తీసుకోనా?" అంది.

"దీనితో నీకేం పని?" అని నవ్వుతూ రంగి చేతిలో పెట్టింది.

ఆ వేళ హరితో మాట్లాడుతూ, "మావా! పగుడరు కొనిపెడతావా? కానీ దాని ఖరీదు అడగమాకు!" అంది

“ఎంతవుతుంది?” హరి అడగగానే, మెల్లిగా బుర్ర వంచుకుని, “మరి...మరి...నాలుగొందలవుతుంది మావా!“ అని చెప్పింది.

“నాలుగొందలెట్టి పగుడారా? ఊరుకో!” అన్నాడు హరి.

“లేదు మావా! ఆ అమ్మగారు రాసుకుని ఘుమ ఘుమ లాడిపోతారు.”

“వాళ్ళు పెద్దాళ్ళు. మనకి అలాంటి కోరికలుండకూడదు.” గట్టిగా చెప్పేడు హరి.

***

ఉమా అమ్మ వాళ్ళ అమ్మాయి అపర్ణ విదేశం నించి రావడంతో రంగికి ఆ ఇంట్లో పని ఎక్కువైంది. అపర్ణ తన పాత డ్రెస్సులు, గోళ్ల రంగులు రంగికి చాలా ఇచ్చింది. రంగికి సరదా తీరినట్లుయ్యింది. ‘ఈ అమ్మాయిగారు ఎంత మంచి అమ్మాయిగారో!’ అనుకుంది.

చలాకీగా తిరుగుతూ అమ్మకి శుభ్రంగా అన్ని పనులలో సాయం చేస్తున్న రంగిని చూస్తే అపర్ణకి ముచ్చటేసి అయిదు వందలు ఇచ్చింది. “ఇలాగే అన్ని పనులూ చేస్తూ అమ్మకి సాయంగా ఉండాలి సరేనా!” అంది.

“అట్టాగేనండి.” వినయంగా అంది రంగి

‘ఈ డబ్బుతో మావ నడిగి పగుడరు కొనుక్కోవాలి.’ అనుకుంటూ ఇంటికి చేరింది.

హరి రాగానే, “మావా! అపర్ణ అమ్మాయి గారు నాకు అయిదొందల రూపాయలిచ్చింది.” సంతోషంగా అంటూ. “మావా...మావా! మరేమో నువ్వు ఈ డబ్బుతో నాకు పగుడరు కొని తెస్తావా?” తను తెచ్చిన పాత పౌడర్ డబ్బాను, డబ్బును హరి చేతిలో పెట్టి గోముగా అడిగింది

***

హరి తెచ్చిన కొత్త పౌడర్ డబ్బా చూసి ఆనందంతో ఎగిరి గంతేసింది రంగి. మర్నాడు పౌడర్ రాసుకుని, గోళ్ళకి రంగు, వంటికి మంచి డ్రెస్సూ వేసుకుని వాణి అమ్మ ఇంటికి పనికెళ్ళింది.

షోకుగా తయారై వచ్చిన రంగిని చూసి వాణి , ‘ఆమ్మో! దీని వేషం మారిందే? పనిపిల్లలా లేదు. ఇదేమిటి దీని దగ్గర నేను రాసుకునే పౌడర్ వాసన వస్తోంది?’ అనుకుంటూ, అనుమానంగా లోపలకెళ్ళి డ్రెస్సింగ్ టేబుల్ పై చూసింది. అక్కడ పౌడర్ డబ్బా లేదు. మిగిలిన గదుల్లో వెతికింది. ఎక్కడా పౌడర్ డబ్బా కనిపించ లేదు. ‘రెండు రోజుల క్రిందట ఆ డబ్బాను చూస్తూ ఖరీదెంతమ్మా అని కూడా అడిగింది. అంటే అప్పుడే దానిమీద కన్నేసిందన్న మాట.’ వాణి బుర్రలో రంగి మీద అనుమానం బలపడింది. ‘ఆ పౌడర్ డబ్బా మాయం చేసిందన్న మాట. దాని వెనుకే ఉంటున్నా ఎప్పుడు తీసేసుకుందో? ఛీ...ఛీ! ఎంతయినా పనివాళ్ళు దొంగ బుద్ధి పోనిచ్చుకోరు. దీని సంగతి తేలుస్తాను.’ అని నిశ్చయించుకుంది వాణి.

“ఏమే... రంగీ! ఏదో మంచి దానవనుకుంటే దొంగతనం చేస్తావా? నా పౌడర్ డబ్బా దొంగిలిస్తావా?” నిలదీసింది వాణి.

“అమ్మా! ఏంటమ్మా నువ్వంటున్నది? నేనటువంటిదాన్ని కాదమ్మా. నువ్వట్లా అనబోకమ్మా. నాకు చాలా బాదవుతుంది. నువ్వు రాసుకునే పౌడర్ వాసన నాకు బాగా నచ్చి, మా మావనడిగానమ్మా. నిన్ననే నా మావ కొత్త డబ్బా నా కోసం తెచ్చేడమ్మా.” దీనంగా అంది.

“నాలుగొందల పెట్టి, నీ మావ పౌడర్ కొంటాడా! నన్ను నమ్మమంటావా! ఇలాంటి దొంగ పనులు చేస్తే మా ఇంట్లో పని చెయ్యొద్దు!” కఠినంగా అంది వాణి.

“నన్ను నమ్మమ్మా. నేను దొంగని కానమ్మా! ఉమా అమ్మ అమ్మాయిగారు అపర్ణమ్మ అయిదొందలిస్తే దాంతో కొనుక్కున్నానమ్మా. కావాలంటే మా మావని తీసుకొస్తా మీరే అడగండమ్మా!” ప్రాధేయపడుతూ అంది.

“నీ మాటలు నేను నమ్మను. నువ్వొకటి, మీ మావొకటా? మీరందరూ ఒకటేగా. మీరిద్దరు తోడుదొంగలు.” అంటూ రకరకాల మాటలంది వాణి.

వాణి మాటలకు మనసంతా వికలమైంది రంగికి. బాధతో ముభావంగా పని పూర్తిచేసుకుని చాయి కూడా తాగకుండా ఇంటికి పోయింది రంగి. ఈ విషయం తన మావకి చెప్పడానికి భయపడింది రంగి.

***

మర్నాడు ఆఫీస్ పని మీద కేంప్ వెళ్లి వచ్చిన శ్యాం, “అన్నట్టు వాణీ! మొన్న నా బట్టలు సర్దుకుంటూ పొరపాటున నీ పౌడర్ డబ్బా నా సూట్ కేసు లో పెట్టేసాను. ఇదిగో.” అని పౌడర్ డబ్బా తీసి డ్రెస్సింగ్ టేబుల్ మీద పెట్టేడు.

“అయ్యో పాపం! రంగికి అన్యాయంగా దొంగతనం అంటగట్టాను. నిజం తెలుసుకోకుండా ఎన్ని మాటలన్నాను. అనవసరంగా దాని మనసును కష్టపెట్టాను.” అనుకుంది. కొంచెంసేపు బాధ పడింది. అంతలోనే మనసుకు సర్దిచెప్పుకుని, “ఏదో అప్పుడప్పుడు ఇలాంటి పొరపాట్లు జరుగుతాయి. ఇంట్లో పనిచేసే వాళ్ళని అలా అనుమానించడం మామూలే.” అని సరిపెట్టేసుకుంది.


దొంగతనం అంటగట్టారని పని మానేస్తే అది నిజమౌతుందని భయపడి, రంగి మాములుగానే వాణమ్మ ఇంటికి పనికెళ్లింది. గదులు ఊడ్వడానికి వెళ్లే ముందు వాణితో, “అమ్మా! గదులు ఊడ్వాలి మీరు రండమ్మా” దొంగతనం అంటగట్టానని ఇది నన్ను రమ్మంటోందని మనసులో అనుకుని, దాని వెనుక వెళ్ళడానికి మొహం చెల్లక, “నువ్వు ఊడుస్తూ ఉండు నే వస్తా!” అని తప్పించుకుంది. తటపటాయిస్తూనే రంగి గది తుడుస్తోంది. అనుకోకుండా రంగి దృష్టి డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న పౌడర్ డబ్బాపై పడింది. నిన్న కనబడని డబ్బా ఇవాళ ఎలా వచ్చిందబ్బా.. అని ఆశ్చర్యపోయింది.

తన మావ అన్నమాటలు రంగికి జ్ఞాపకం వచ్చాయి... ‘డబ్బున్న పెద్దోళ్ళ మనసులు డబ్బు లేని పేదోళ్ళ మనసంత నొచ్చంగా ఉండవే రంగి...!’ రంగికి ఆ మాటల్లోని విషయం అర్థమయింది.

మరొక మంచి ఇల్లు కుదిరితే ఈ అమ్మని ఒదిలేయాలని రంగి ధృడంగా నిశ్చయించుకుంది.

***0***

# ఆవకాయ-ఆత్మానుబంధం



## అక్కిరాజు శ్రీహరి

మధ్యాహ్న సమయం. గురువుగారు విశ్రమించారు. పక్కనే శిష్యగణం కూర్చొని వున్నారు. వాళ్ళూ విశ్రమించే వేళయింది.

ఇంతలో ఒక శిష్యుడు అడిగాడు, 'గురువుగారు, ఇవ్వాళ ఉదయం భిక్షకు వెళ్ళిన చోట తిన్న ఆవకాయ బ్రహ్మాండంగా వుంది. అంత రుచిగా ముందెన్నడూ తినలేదు. తెల్లటి అన్నంలో ఆ ఎర్రటి ఆవకాయ, నేయితో కలుపుకొని ముద్దచేసి నోట్లో పెట్టుకొని తింటుంటే, ఆహ్.. ఏంచెప్పను, స్వర్గానికి బెత్తెడు దూరంలో వున్నాననిపించింది. ఆ రుచే మళ్ళీ మళ్ళీ గుర్తుకొస్తున్నది. ఇలా అనిపించటం నా సాధనకు ఆటంకమంటారా?'

'నాయనా. ఒక విధంగా నీకు ఆత్మానుభవమయిందన్న మాట' అన్నారు గురువుగారు చిన్నగా నవ్వుతూ.

'అదేమి గురువుగారు, ఆవకాయకు ఆత్మానుభవానికి ఏమిటి లంకె? మీరు నన్ను ఆటపట్టిస్తున్నారు కదా'

'లేదు నాయనా. చెబుతాను విను. నీకు ఆవకాయ ఎలా పెడతారో తెలుసా? మా అమ్మ పెడుతుంటే ఒకటి రెండు సార్లు చూశేను. కాని అప్పుడు ఆటల ధ్యాసలో పడి సరిగా గమనించలేదు. నా పూర్వాశ్రమంలో ఏటా వేసవికాలం వచ్చిందంటే అందరి ఇళ్ళల్లో ఆవకాయ పెట్టే కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగేది. అదో యజ్ఞం లాంటిదే అనుకో. దానికీ విధివిధానాలు వున్నాయి. ముందుగా పుల్లటి మామిడికాయలు ఏరికోరి తీసుకొని, కడిగి, తేమ లేకుండా తుడిచి, ముక్కలుగా తరగాలి. తరిగేటప్పుడు అన్ని ముక్కలకు కొంచెమైనా టెంక వుండేటట్లు చూసుకోవాలి. అటుపై ఆ ముక్కలకు మిగిలిన జీడి వేరుచేసి, వాటికి వున్న సన్నటి పొరను మెల్లగా తీసేసి, చక్కగా తేమ లేకుండా శుభ్రమైన గుడ్డతో తుడిచేయాలి. ఈలోగా ఆవపొడి, కారం, ఉప్పు తయారు చేసుకొని, శ్రేష్టమైన పప్పు నూనె కూడా దగ్గర పెట్టుకోవాలి. మంచి పింగాణి జాడి తుడిచి పక్కనే ఉంచుకోవాలి. ఇక ఒక పళ్ళెంలో ఆవపిండి, ఉప్పు, కారము సరైన పాళ్ళలో కలిపి ఇంకో పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు ఓ గుప్పెడు మామిడికాయ ముక్కలు నూనెలో ముంచి తీసి ఆవమిశ్రమంలో ఆ పొడి పట్టేటట్టు తిప్పి, ఆ ముక్కల్ని జాడిలో వెయ్యాలి. అలా తరిగి పెట్టుకున్న ముక్కలనన్నిటినీ జాడిలో, ముక్క మునిగే వరకు నూనె పోసి, మూత పెట్టి, మూతకు గుడ్డ కట్టి, జాడీని ఓ పక్కన ఎవరికీ అందనంత ఎత్తులో వుంచాలి. అలా

కొద్ది రోజులు వుంచి, మధ్యలో ఓ సారి ముక్కలు తిరగవేసి కలిపిన తర్వాత ఆవకాయ తయారవుతుంది.'

శిష్యుడు వింటున్నాడు కాని.. ఆత్మకు ఈ ఆవకాయకు సంబంధం కనబడటం లేదు.

గురువుగారు చెబుతున్నారు.

'నాయనా, ఆవకాయకు ముడిసరకు మామిడికాయ ముక్కలు, ఆవపిండి, కారం, వుప్పు, ఇంకా నూనె. అయితే వీటిని విడివిడిగా తింటే దేని రుచి దానిదే. కొన్ని తినలేము కూడా. అన్నిటినీ ఎలా పడితే అలా కలిపి వెంటనే తిన్నా, నీకు ఆవకాయ రుచి రాదు. తగిన పాళ్ళలో కలిపి కొన్ని రోజులు ఊరపెడితే గాని, ఆ రుచి రాదు. రోజులు గడిచే కొద్దీ రుచి గొప్పగా అవుతుంది.'

'అది అలా వుంచు. ఈ సృష్టి ఎలా జరిగిందో చూడు. ఈ సృష్టి ఆరంభంలో మొదటిగా సూక్ష్మ పంచభూతాలు సృజింపబడ్డాయి. అంటే ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి. వాటి నుంచి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, ప్రాణాలు, అంత:కరణాలతో సూక్ష్మ శరీరం ఏర్పడింది. ఆ పంచభూతాలే అన్నీ ఒక పద్ధతిలో కలిసి స్థూల భూతాలై, వాటి నుంచి స్థూల శరీరం తయారయింది. అందులోకి జీవం అంటే... ఆత్మ ప్రవేశించి ప్రాణాన్ని, చైతన్యాన్ని ఇస్తుంది. అలా మానవ ప్రాణి అయితే ఓ తొమ్మిది నెలలు తల్లి గర్భంలో వుండి చక్కగా తయారై బయటకు వస్తుంది.

ఆ విధంగానే.. ఆవకాయ కలిపిన తర్వాత, మామిడి ముక్కలో ఉన్న ఆ రసం.. ఉప్పు, కారం, నూనెలతో కలిసి ఊరి, మొత్తం ఆవకాయలో ఆవరించేస్తుంది. నీవు ఆవకాయను అన్నంలో కలుపుకొని తిన్నప్పుడు నీకు కలిగిన అనుభవం ఆ ఊరిన రసానిది. ఆవకాయకు ఆ రసం ఎలాంటిదో శరీరానికి ఈ ఆత్మ అలాంటిది. అందుకే నీకు ఆత్మానుభవమయిందన్నాను. అర్థమయిందా.'

శిష్యుడికి అర్థమయిందో లేదో కాని తలూపి, 'ఆవకాయ తిన్నంత తేలికా ఈ ఆత్మ అనుభవంలోకి రావటం, అలా అయితే మాకు ఇంత సాధన ఎందుకు అవసరమవుతోంది? చెప్పండి గురువుగారు.' అని అడిగాడు.


'అలా అడిగావు బావుంది. చెబుతా విను. నిజమే, మనలోని ఆత్మను గుర్తించటం ఆవకాయ తిన్నంత సులువు కాదు. ఆవకాయలో రసం ఎలా విస్తరించిందో, మన శరీరంలో కూడా ఆత్మ అలా అణువణువునా నిండిపోయింది. అందుకే దాని వునికి తెలియదు. దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే సాధన చేయాల్సిందే. ఎటువంటి సాధన? మళ్ళీ ఆ ఆవకాయనే పట్టుకో. ఆవకాయ తయారి గురించి చెప్పానుగా. ఏమేం చేసాం? ముందుగా ఏమేం కావాలి, వాటి పరిమాణం, ఎలా శుద్ధి చేయాలి, ఎలా కలపాలి అనే విషయాలను తెలుసుకోవాలి. అదీ అంతకు ముందు ఆవకాయ పెట్టటంలో ఆరితేరిన వాళ్ళను అడిగి చెప్పినది వినాలి. అది తెలుసుకోవటం! అటు తర్వాత వాటిని తెచ్చి, చెప్పిన పద్ధతిలో కలపాలి. కలిపే సమయంలో ఏవైనా సందేహాలు వస్తే మళ్ళీ అడిగి తీర్చుకోవాలి. ఇది సందేహం తీర్చుకోవటం! అలా కలిపిన మిశ్రమాన్ని కొంత కాలం కదల్చకుండా ఉంచేయాలి. ఇది

ఊరవేయటం. దాంతో ఆవకాయ తినటానికి సిద్ధం. ఆ విధంగానే వేదాంత శాస్త్రం గురించి సమర్ధుడైన గురువు చెప్పగా వినాలి. అది శ్రవణం! చెప్పిన దానిని అర్ధం చేసుకుంటూ, సందేహాలు వస్తే అడిగి నివృత్తి చేసుకోవాలి. ఇది మననం! ఆపై ఆ విషయాలను నిరంతర చింతన చేస్తూ వంట పట్టించుకోవాలి. అది నిధిధ్యాసనం! ఈ శ్రవణ, మనన, నిధి ధ్యాసనాల వల్ల ఆత్మ అవగతం అవుతుంది. అంటే నీకు ఈ దేహము, మనసు, చిత్తము, అహంకారాలకు విలక్షణంగా ఉంటూ, వీటన్నిటికీ చైతన్యాన్ని ఇచ్చే ఆ ఆత్మ స్వరూపం అనుభవంలోకి వస్తుంది. అర్ధమైందా నాయనా!!'

'గురువుగారు, చాలా బాగా చెప్పేరండి. సాధన విషయం ఎలా వున్నా ఆవకాయతో కలిగిన ఆత్మానుభవం పదే పదే గుర్తుకు వస్తూనే వుంది!'

'నాయనా, నువ్విక ఆ ఆవకాయ జపం మాని, సాయంకాలపు అనుష్ఠానానికి తయారవు,' అంటూ విశ్రమించారు గురువుగారు.

***0***



# నేరము శిక్ష

అంగర వెంకట శివప్రసాద రావు

'అసలీ గోర్నమెంటోల్లకి బుద్దిసేదే. అసలీ కరోనా మహమ్మారి ఎలిపొచ్చీసినాది గానీ, నిచ్చేపంలా రిచ్చా తొక్కి రోజుకో అయిదారొందలు కల్ల జూసివోణ్ణి. రిచ్చా అద్దె కట్టేసి, ఇంటికో ఇంత పడేసి మిగిలిందాంతో జల్సా సేసుకునేవోణ్ణి. పన్లాపీసి ఇల్లలో కూకోమంటే రోజెలాగడుద్దని ఆలోసించి, ఇంటికో ఎయ్యి, పదేనొందలు పడేసినారు. బియ్యాలు పప్పులు, కూరగాయలు పంచీసినారు. అంతా బానేవుంది గానీ, మాలాంటోల్ల గురించి కూడ కుసింత ఆలోసించి వుంతే బావుండేది. అటు పన్లేక, ఇటు నోరు తడారి పోతావుంటే, ఏటీసెయ్యడానికి తోసట్నేదు. ఇంటికాడ తిని కూకుంటే సరిపోద్దేటి?' రంగడు ఇంటి ముందు గట్టుమీద కూర్చుని తనలో తనే గొణుక్కుంటున్నాడు.

అటుగా వచ్చిన కూతురు లచ్చిని చూసి నోరు మూసేసాడు. బొడ్లో వున్న చుట్టపీక తీసి, దాని కొస నోటితో కొరికి ' సస్ ' అని వూసి, అగ్గిపుల్లతో వెలిగించాడు. అది వెలగనని మొరాయిస్తే, దాన్నో బూతుమాటతో కసిరి, అరచెయ్యి అడ్డం పెట్టి, మరో పుల్ల వెలిగించి మొత్తానికి తన దార్లోకి తెచ్చుకున్నాడు. గుండెల్నిండా పీల్చి, గుప్పు గుప్పుమని పొగ వొదిలాడు.

"ఏట్రాఅయ్య! నీలో నువ్వే గొణికగీసుకుంటున్నావు" అంది లచ్చి. లచ్చి ఐదో క్లాసు వరకూ చదువుకుంది కానీ తన వాళ్లతో మాట్లాడుతున్నప్పుడు వాళ్ల భాషే వచ్చేస్తుంది ఆమెకి.

"ఏటీసేదు ఎదవ సుట్ట ఎలక్కపోతే నాలుగు పీకి మరీ ఎలిగించాను!" మాట మార్చాడు రంగడు.

"గవర్నమెంటోల్లని తిడతన్నావు?" నిలదీసి అడిగింది లచ్చి.

'అదేసే.. మాలాంటోల్ల గురించి కూడ ఆల్లు కుసింత ఆలోసించాలి కదే!' నసిగాడు రంగడు.

'మీ గురించి ఆలోసించేదేటుందిరా అయ్య? ఇంటికాడ తిని కూసోమని అంతన్నారు.. ఈ కరోనా పాలిన పడకుండా. అదా ఆల్లు సేసిన తప్పు' మందలించింది లచ్చి. ఆమె మరి కొంచెం రంగడి మాటల్లోని అంతరార్థం గ్రహించివుంటే ఆ అనర్థం జరిగి వుండకపోవచ్చు.

లచ్చి ఐదో క్లాసు వరకూ చదువుకుంది కాబట్టి ఆమెకి గ్రామ పంచాయితీలో పని దొరికింది. గవర్నమెంటు వాళ్లు ఇలాంటివాళ్లని ప్రోత్సహించి వాళ్ళకి తగిన పని కల్పిస్తున్నారు. మొదట్లో చిన్నచిన్న పనులప్పగించి,

వాళ్ల పనితనం గుర్తించి, మరికొంత ఎక్కువ బాధ్యతలు అప్పగించడం మొదలుపెట్టారు.  ఆమె పని చేస్తూనే పైచదువులు కూడ చదివి ఇంటరు వరకూ చదివింది. దాంతో ఆమెకి మరింత బాధ్యతతో కూడుకున్న, డబ్బుతో ముడి పడివున్న పనులు కూడ ఆమె చేత చేయించడం మొదలుపెట్టారు. వాళ్ల వెనుక కొంత నిఘా కూడ ఏర్పాటు చేసి, వాళ్ల పనితనం, పనిలో వాళ్లు ఎంత బాధ్యతతో వుంటున్నారో గమనించడం కూడా చేస్తున్నారు.

ఆమె తన పనితనాన్ని నిరూపించుకుని అంచెలంచెలుగా ఎదిగింది.  ఆమెని గ్రామ వాలంటీరుగా నియమించారు. వృద్ధాప్య ఫించను పంపిణీ బాధ్యత  ఆమె మీద పడింది. ఆమె నివసిస్తున్న ఒక్క గ్రామమే కాకుండ చుట్టుపక్కల గ్రామాల వారికి ఫించను ఇచ్చే బాధ్యత కూడా ఆమెకి అప్పగించడం జరిగింది. దాంతో ఆమెకి పని ఒత్తిడి పెరిగింది.

ప్రతి రోజు ఆమె తనపై అధికారి దగ్గర లిస్టు, దాంతో పాటు డబ్బు తీసుకుని వూళ్లోకి వెళ్లి ఇంటింటికి తిరిగి వాళ్లని గుర్తించి, వాళ్లకి యివ్వవలసిన సొమ్ము అందజేసి, సొమ్ము అందినట్లు వాళ్లచేత వేలిముద్రలు వేయించుకుని, సెల్ ఫోనులో ఫోటో తీసుకుని, సాయంత్రానికి మిగిలిన సొమ్ము తిరిగి పై అధికారికి అందజేయవలసి వుంటుంది.

ఆరోజు కూడా ఉదయం నుండి తన పనిలో తిరుగుతూ సాయంత్రానికి ఆ రోజుకి చివరి ఫించను అందజేయడానికి ఒక యింటికి వెళితే ఆ ముసలమ్మ ఎక్కడికో వెళ్లిందని, యింకా తిరిగి రాలేదని తెలిసింది. 'రేపొచ్చియిస్తానని' చెప్పమని పొరుగువారికి చెప్పి వెనుతిరిగింది.  సమయం మించిపోవడంతో ఆమెపై అధికారి దగ్గరకు వెళ్లకుండా యిల్లు చేరింది.  అప్పుడప్పుడు అలా జరగడం మాములే. అయితే ఎప్పుడూ ఆమె దగ్గర డబ్బు మిగల్లేదు ఆ రోజులా! ఆ మర్నాడు వెళ్లి, ముందురోజు కాయితాలు అప్పజెప్పి, మర్నాటికి కావలసినవి తీసుకోవడం పరిపాటే.

గుమ్మంలో ఎదురుపడ్డ తండ్రితో మాట్లాడి ఆమె లోనకెళ్లి, కాయితాలతో పాటు మిగిలిన సొమ్ము రెండువేల ఐదు వందల రూపాయల్ని  తన బేగులో పెట్టి, స్నానానికి వెళ్లింది.
రంగడు ఆమె వెనకే లోనకెళ్లి, ఆమె డబ్బు బేగులో పెట్టడం గమనించాడు. మరునిముషంలో అది తీసుకుని ముందు రోజే తీసిన మద్యంషాపు వేపు నడిచాడు. అర్ధరాత్రి వరకూ తండ్రి యిల్లు చేరకపోవడంతో గాభరాపడింది.  అనుమానమొచ్చి, తన బేగు తీసి చూసిన ఆమెకి గుండె జారిపోయింది. విషయం ఆమెకి అవగతమైంది. కరోనా వల్ల నలభైరోజులుగా మద్యంషాపులు తెరవకపోవడం, అదీ నిన్నటినుంచే తెరవగా జనం బారులు బారులుగా బారుషాపుల వద్ద నిలబడి ఎగబడి కొనుక్కుపోవడం ఆమె గమనించింది. తన

బేగులో సొమ్ము కాజేసి, తన తండ్రి కూడా  అటే వెళ్లివుంటాడని వూహించింది. ఆమె వూహ కరెక్టే అన్నట్టు రంగడు తూలుతూ లొల్లాయి పదాలు పాడుకుంటూ యిల్లు చేరేడు.

'ఒసేలచ్చీ.. బేగీ వణ్ణంపెట్టీవే .. ఆ ఎదవనాయాళ్లూ మందుతో పాటు సీకులు కూడ పెట్టుంటేనా .. నాసామిరంగా .. సొరగం దిగొచ్చేదే .. ఎన్నాళ్లకి సుక్క పడింది ..' తూలుతూ గట్టుమీద కూర్చుండిపోయాడు.

'దొంగసచ్చినోడా తాగడానికి డబ్బులెక్కడివిరా?'  ఏడుస్తూ అడిగింది లచ్చి తెలిసినా.

'తాగినోడు ఎప్పుడూ అబద్దం జెప్పకూడదని మా గురూగారు సెపుతుండేవోరు. ల్లచ్చిందేవి నీ బేగులో కుల్లిపోకూడదే. అదెక్కడికెల్లాలో అక్కడికే సెర్సేసాను.'  అన్నాడు రంగడు.

'అది గవర్నమెంటోళ్ల డబ్బురా' అంది లచ్చి.

'గవర్నమెంటంటే ఎవురే? మనవే... ఆల్ల డబ్బు ఆల్లకే నాను అందించేసానే.  బేగీ వణ్ణం పెట్టీయే. తాగింది దిగిపోద్ది!' అన్నాడు రంగడు.

'నీకు అదొక్కటే తక్కువ. ఇప్పుడు నేను ఆళ్లకి ఏటి సెప్పాల? నా మీద నమ్మకం పెట్టుకుని అంతడబ్బు ఇచ్చారు.' గొల్లుమంది లచ్చి.

'ఆల్ల డబ్బు ఆల్లకిచ్చేసానని సెప్పీవే.' అన్నాడు రంగడు.

'అదెలారా? సొమ్ము అందినట్టు ఆల్ల దగ్గర ఏలి ముద్ర తీసుకుంతాం గదా.' బేలగా అంది మతిపోయి లచ్చి.

'గవర్నమెంట్లో మన వోట్లు ఆల్లే ఏసేసుకోటంనేదూ? ఇదీ అలాగే.'  సన్నగా నవ్వుతూ అన్నాడు రంగడు.

'అంటే ..ఆంటే .. దొంగ సంతకం సేసీమంటావా .. అది తప్పు కాదా..' అంది లచ్చి.

'ఓసోస్ ..ఆల్లుసేత్తే ఒప్పు ..   మనం సేత్తే తప్పా..' అన్నాడు రంగడు.

ఆ రాత్రంతా ఆలోచించింది లచ్చి. దొంగసంతకం చేసి లెక్క అప్పజెప్పేస్తే .. తరవాత ఆ ముసిల్ది తన ఫించను అందలేదని ఫిర్యాదు చేస్తే,  తన పరిస్తితేంటి? తన వుద్యోగం పోతుంది. ఉన్న ఒక్క జీవనాధారం పోతే పక్కూళ్ళో కరోనా వల్ల చిక్కుకుపోయిన గంపెడు సంసారాన్ని ఎలా నెట్టుకు రావాలి. పైగా దొంగ అని ముద్రపడితే తనకి పనెవరిస్తారు. ఏదో ఒకటి ఆలోచించాలి. పోనీ జరిగింది చెప్తే? తన తండ్రి ఒట్టి తాగుబోతని నలుగురికీ తెలిసిపోతుంది. ఇన్నాళ్లు రిక్షాతొక్కి సంపదించిందాంట్లో తాగివోడు. ఇంటికొచ్చి గుట్టుచప్పుడు కాకుండా పడుకుండేవోడు. తనల్లరిపాలవలేదు.. తన కుటుంబాన్ని అల్లరిపాలు చెయ్యలేదు. ఈ దిక్కుమాలిన కరోనా వచ్చి జనాల్ని పనిలోకి వెళ్లనివ్వక.. పోనీ వెళ్ళనివ్వలేదు.. బావుంది. నలభై రోజులు మందుషాపులు మూసేసి ఒక్కసారి తెరవగానే జనాలు ఎగబడిపోయి కొనేసుకుని తెగ తాగేస్తున్నారు. నాన్నలాంటోళ్లు చేతిలో డబ్బుల్లేక ఇదుగో ఇల్లా దొంగతనానికి అలవాటుపడి నా కొంప ముంచేసాడు. ఇప్పుడు నాకు దారేది? చివరకి ఆమెకో ఆలోచన వచ్చింది. ఆ ముసిల్ది లేకపోయేసరికి, డబ్బుతో ఇంటికి

తిరిగొస్తుంటే వెనకనుండి ఎవరో దొంగ నాకోళ్లు బండి మీద వచ్చి, తన బేగు లాగిసుకుపోయేరని .. కొంత ముందుకెళ్లి డబ్బులు తీసుకుని, బేగక్కడ పారేసి పోయేరనీ,  చెప్తే?  తన జీతంలో తెగ్గోసుకోమని ఆ అధికారిని బతిమాలాలని నిర్ణయించుకుంది.

ఆ మర్నాడు ఆమె అలాగే అతనికి చెప్పింది. అతను ఆమె నిజాయితీని నమ్మేడు. అతని పైఅధికారికీ విషయం చెప్పవలసిన పద్ధతిలో చెప్పి, లచ్చి తమ దగ్గర చాలాకాలంగా పని చేస్తోందని, చాలా మంచి అమ్మాయని చెప్పాడు. వాళ్లు అతని మాటకి విలువిచ్చి ఆమె జీతంలో ఆ డబ్బు వసూలు చేసుకోడానికి అంగీకరించారు.

తన తండ్రి తాగుబోతని నలుగురికీ చెప్పలేదు.  తను దొంగ సంతకం చేసి తప్పు దారిపట్టలేదు.

***0***

# పదవీ దాహం

## నిష్ఠల సుబ్రహ్మణ్యం



"అమ్మా మంజరీ! ఏం చేస్తున్నావూ?" అడిగాడు అప్పుడే వచ్చిన ప్రకాష్.

"ఇప్పుడే హోమ్ వర్క్ అయింది అంకుల్. ఆడుకుందుకు వెళ్తున్నాను." అమాయకంగా జవాబిచ్చింది మంజరి.

"గుడ్! ఒకసారి రాజుగారి తోటకి వెళ్ళొద్దామా? అప్పుడే రెండు రోజులు అయింది. తాతయ్య గారు కబురు పెట్టారు!" అన్నాడు ప్రకాష్.

"రేపు వెళ్దాము మామయ్యా! తలనొప్పిగా ఉంది." మంజరి అంది.

"అలా అంటే ఎలా అమ్మా! నాన్నకి ట్రీట్మెంట్ కోసం డబ్బులు కావాలి కదా! " ఆశ పెట్టాడు.

"అవుననుకో! కానీ అమ్మమ్మకి తాతయ్యకి అనుమానం వస్తుంది!" అంది. కానీ, తాతయ్యకి ట్రీట్మెంట్ కి డబ్బులు కావాలి కదా, అందుకని ప్రకాష్ వెంట బయలుదేరింది .

అక్కడ కొద్ది దూరంలో ఉన్న పాలేరు రామునాయుడు, వాడి స్నేహితుడూ చూసారు. వాళ్ళు మాట్లాడుకుంటూ, "ఒరేయ్! ఆ రాజుగారి బామ్మర్ది ప్రకాష్ గాడు, ఆ పిల్లని పట్టుకుని, ఆ తోటల వెంపట తిప్పుతున్నాడురా! ఆ రాజుగారి ధాన్యం మిల్లులోకి తీసుకెళ్తున్నాడు. ఏటో అర్థం కావడం లేదు!"

"ఒరేయ్ పెద్దోళ్ళ వ్యవహారాలు అలాగే ఉంటాయి. మనకెందుకు రా!" అన్నాడు వాడి స్నేహితుడు.

***

అది ఒక గ్రామం. అక్కడ రామరాజుగారికి కొబ్బరి తోటలు ఉన్నాయి. ధాన్యం మిల్లులు ఉన్నాయి. మంచి పలుకుబడి ఉంది. వారానికోసారి పట్నం వెళ్లి వస్తుంటాడు. ఎప్పటికైనా రాజకీయాలలో కనీసం, చిన్న చక్రం అయినా తిప్పాలని ఆయన ఉబలాటం. రాజుగారికి భార్య, ఒక కొడుకు! కొడుకు అమెరికాలో ఉంటాడు.

మంజరి, తాత సీతారామశర్మ స్కూల్ మాస్టర్ గా పంచాయతీ స్కూల్ లో ఉద్యోగం చేసి, రిటైర్ అయి, ఇక్కడ ఉన్న స్వంత ఇంటిలో భార్యతో కలిసి ఉంటున్నాడు. మంజరి వయసు 13 సంవత్సరాలు ఉంటాయి. కూతురి కూతురు. కూతురు కులాంతర వివాహం చేసుకుంటే, పుట్టిన బిడ్డను లాక్కుని, కూతురిని అల్లుడిని బయటకు గెంటేసాడు.

తరువాత కూతురు అల్లుడు దుబాయ్ వెళ్లిపోయి అక్కడ సెటిల్ అయిపోయారు. రాను రానూ సీతారామశర్మ ఆరోగ్యం దెబ్బతింది. గుండె జబ్బు వచ్చింది. ఇంగ్లీష్ డాక్టరు దగ్గర వైద్యానికి తన

దగ్గర సరియైన అర్థిక స్తోమత లేక పోవడంతో భార్యకు చెప్పకుండా, అర్ ఎంపీ డాక్టర్ దగ్గర ఏదో మూలికా వైద్యం చేయించుకుంటున్నాడు...

***

"రండి రాజు గారూ! ఏమిటి సంగతి?" పార్టీ ఇంచార్జిగారి పి.ఏ. పలకరించాడు.

"ఆ! ఏముందండి? దొరగారిని పలకరించి వెళ్దామని వచ్చాను!" అన్నాడు రామరాజు.

"అంతేకదా... వచ్చేస్తారు కూర్చోండి!"

ఇంకొక అరగంట లో పార్టీ ఇంచార్జి వచ్చారు.

"లోపలకి వెళ్ళండి!" రామరాజుని లోపలకు పంపించాడు పి.ఏ.

"అయ్యా! నమస్తే!" అంటూ రామరాజుగారు చేతులు జోడించారు.

"ఓహో! రామరాజు గారా!" నవ్వుతూ పార్టీ ఇంచార్జి పలకరించాడు.

"చిత్తం! మరి నా సంగతి పార్టీతో మాట్లాడారా?"

"అయ్యో! ఎంత మాట!" అంటూ ఓ నిమిషం ఆలోచించినట్టు మౌనం వహించి.. "కాంపిటీషన్ ఎక్కువగా ఉంది రాజుగారు! ఆ రాయుడు గొడవ పెడుతున్నాడు. రెండేళ్ల నుంచి ప్రయత్నిస్తున్నాడు. మీకు తెలియనిది ఏముంది చెప్పండి !" అన్నాడు పార్టీ ఇంచార్జి

"సార్! ఇలా అయితే ఎలా? మాలాంటి వాళ్ళకి ఒక ఛాన్స్ ఇవ్వాలి కదా! నేను ఎన్నాళ్ల నుంచో కష్టపడుతున్నాను. మీకూ తెలుసు!" అన్నాడు రామరాజు.

"సరే ఒక పని చెయ్యండి.. పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయి. మిమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకునేటట్లు చేస్తాను. అందులో ఫిక్స్ అయిపోండి! నా మాట వినండి. ఇలా ఖాళీగా ఉండే కంటే మంచిది కదండీ! అవకాశం వచ్చినప్పుడు ఎం.ఎల్.ఏ. టికెట్ కి ప్రయత్నిస్తాను. ఏమంటారు?" పార్టీ ఇంచార్జి ఏదో ఉపకారం చేసినట్టు అన్నాడు.

"సరే! అలాగే కానివ్వండి. మరి తప్పుతుందా? మీరు అన్నట్లు ఖాళీగా ఉండటం కంటే బెటర్."

"మరి...." నసిగాడు ఇంచార్జి

"ఎంతమాటా!.." అంటూ సూట్ కేస్ అందించాడు రామరాజు.

"ఎంత?" సూట్ కేస్ ఓపెన్ చేసి అంచనా వేసేందుకు ప్రయత్నించాడు పార్టీ ఇంచార్జి.

"ముప్పై" అన్నాడు రామరాజు.

"ఇంకొక ఇరపై చూడండి. దానితో చాలా పని ఉంది. మధ్యలో ఎంత మందికి పంచాలో! మీకు తెలియనిది ఏముంది?"

"సరే! తప్పేదేముంది?" అంటూ బయటపడ్డాడు రామరాజు.

***

ఆ తోటలో ఒక చోట ధాన్యం మిల్లు ఉంది. ఆ మిల్లు వెనుక భాగంలో, కొంత మంది పిల్లలు తమ తమ పనిలో నిమగ్నమై ఉన్నారు. ఒక చిన్న కుటీర పరిశ్రమలా ఉంది. పదిమంది పిల్లలు కష్టపడి పని చేస్తున్నారు. అందరూ పదమూడు, పదిహేను వయస్సు వాళ్లే.

ఒక వ్యక్తి గదమాయించి వాళ్ళచేత పని చేయిస్తున్నాడు. సన్నగా పొడవుగా ఉన్నాడు. పాత సినీమాలో రమణారెడ్డిలాగా ఉన్నాడు. వాడి పేరు శేషగిరి. చేతిలో ఒక బెత్తం ఉంది.

"త్వరగా! అయిదు అయిపోతోంది. అయ్యగారు వచ్చే టైము అయింది. మీరు సరిగ్గా పని చెయ్యకపోతే, నాకు పడతాయి అక్షింతలు!" అరుస్తున్నాడు.

అప్పటికే సాయంత్రం నాలుగున్నర అయింది.

మళ్ళీ అన్నాడు. "ఇంకొక అరగంట చేయండిరా.. వెళ్లిపోదురు గాని. చీకటి పడితే కష్టం. ఈలోగా అయ్యగారు కూడా వచ్చేస్తారు." అంటూ పని చేయిస్తున్నాడు శేషగిరి.

“ఒరేయ్! ఎన్నాళ్లురా ఇలాగ?" నెమ్మదిగా ఒక కుర్రాడు.. మూర్తి అన్నాడు పక్క కుర్రాడు రాజుతో.

"ఒక్క రోజు అన్నాడు కదా అని, నేను సరేన్నాను. ఇప్పటికి మూడు నెలల నుండి చేస్తున్నాము. ఏదో ఖర్చుకి డబ్బులు ఇస్తున్నారు. ప్చ్!" అన్నాడు రాజు.

"ఈ పని మానేద్దామన్నా, మన పెద్దవాళ్ళకి చెప్పేద్దామన్నా, మనల్ని, మన పెద్ద వాళ్లని చంపేస్తాం అని బెదిరిస్తున్నారు!" ఆ పక్కనే ఇంకొక కుర్రాడు భయపడుతూ అన్నాడు..

"ఒరేయ్! ఎవర్రా అది? మాట్లాడకుండా, పని చెయ్యండి" వార్నింగ్ ఇచ్చాడు శేషగిరి.

ఇంకా తక్కువ గొంతుతో, "మన గురించి వదిలెయ్యి. ఆ మంజరి చేత చేయిస్తున్నారు. పాపం..." అనుకుంటూ వాళ్ళందరూ ఏమీ ఎరగనట్లే పని చేస్తున్నారు.

***

ఒక రోజు, రాజు మిల్లుకి వెళ్తుంటే, దారిలో వాడి స్నేహితుడు కరీం కనిపించాడు.

"ఒరేయ్ రాజూ! నువ్వెక్కడో మిల్లులో పని చేస్తున్నావుట, నాకు అక్కడ పని ఇప్పించరా, నాకు ఖర్చుకు డబ్బుకు ఉండటం లేదు!" అంటూ కరీం పలకరించాడు. కరీం కూడా రాజు వయసు వాడే.

రాజు కంగారుగా అటూ ఇటూ చూసి "గట్టిగా మాట్లాడకు!" అన్నాడు.

“అదేమిటి? అంత కంగారుపడుతున్నావు?" కరీం అడిగాడు.

"అదేం లేదులే. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు వరకు మాత్రమే. రోజుకి మూడువందల రూపాయలు ఇస్తారు. ఇష్టమేనా?" అన్నాడు రాజు.

"సరే!" అన్నాడు కరీం.

"సరే! పద!" అంటూ రాజు, కరీంని తనతో బాటు మిల్లుకి తీసుకు వెళ్ళాడు.

శేషగిరి వచ్చిన వాళ్ళని పేరు పేరునా పిలుస్తూ అందరూ వచ్చారా లేదా? అని చూస్తున్నాడు.

అప్పుడే వచ్చిన రాజుని, అతని వెనుక ఉన్న కరీమ్ ని చూస్తూ "వీడెవడు?" అన్నాడు.

రాజు "వీడు నా ఫ్రెండ్ సార్! మా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. వీడికి పని కావాలిట. స్కూలు ఇప్పుడు లాక్డౌన్ లో ఉంది కదా సారూ.. అందుకే పని చేస్తాడట!" అన్నాడు.

శేషగిరి వాడికేసి ఎగాదిగా చూసి, "సరే! వాడికి ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో చెప్పు" అన్నాడు.

"రారా" అంటూ రాజు, కరీంని వాడితోబాటు లోపలకి తీసుకు వెళ్లి, ఏం చెయ్యాలో చెప్పాడు.

***

ఒకరోజు సాయంత్రం అయిదు గంటలు అయింది. పిల్లలు అందరూ ఆనందంతో బయటకు పరిగెత్తారు. సరిగ్గా అపుడే పోలీస్ జీప్ వచ్చింది. మర్నాడు.. పోలీస్ స్టేషన్. ఎస్సై తన సీట్ లో కూర్చున్నాడు.

ఎదురుగా ఒక బల్ల మీద రామరాజు, అతని బావమరిది ప్రకాష్, గుమాస్తా శేషగిరి ఉన్నారు. ఎస్సై కి ఎదురుగా కుర్చీలో కరీమ్, తండ్రి అబ్దుల్లా ఉన్నారు. ఆ ప్రక్కగా కుర్రాళ్ళు అందరూ ఉన్నారు.

ఎస్సై మాట్లాడుతూ, "ఏమయ్యా రామరాజు! నీకు వయసు ముదిరిపోయింది. అయినా అధికారం కావాలి. దాని కోసం నువ్వు ఎంచుకున్న దారి తప్పు! గంజాయి మొక్కలు పెంచి, మత్తు మందు తయారు చేసి వ్యాపారం చేస్తున్నావు. అందుకు ఎవరికి అనుమానం రాకుండా అభం, శుభం ఎరుగని చిన్నపిల్లల చేత వెట్టిచాకరి చేయించి, వాళ్ళ భవిష్యత్తు పాడు చేస్తున్నావు. పిల్లలను బాలకూలీలుగా మార్చేసావు. ఆఖరికి ఆ చిన్న పిల్ల మంజరిని కూడా వదలలేదు. వాళ్ళ తాతయ్యకి వైద్యం చేయిస్తానని ఆ పిల్లకి ఆశ పెట్టావు. నీ మీద పెట్టబోయే కేసులకు బెయిలు రాదు. ఇక ఇంతే సంగతి. అనుభవించడానికి సిద్ధంగా ఉండు!" రైటర్ కేసి, తిరిగి, 402 ఎఫ్.ఐ.ఆర్. తయారు చెయ్యి. రేపు కోర్ట్ లో సబ్మిట్ చెయ్యి" అన్నాడు.

ఎస్సై తిరిగి మాట్లాడుతూ, "ఇంత చిన్న పల్లెటూరులో ఎవరికి అనుమానం రాదని అనుకున్నావు. మాకు నీ మీద అనుమానం వచ్చి, హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్లా కొడుకు కరీంని నీ దగ్గర పనిలో పెట్టాము!" అని హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్లాతో, "నువ్వు , నీ కొడుకు కరీం ప్రభుత్వానికి చాలా ఉపకారం చేసారు. నీ ప్రమోషన్ కి రికమెండ్ చేస్తాను. మీ అబ్బాయి కరీమ్ కి కూడా మంచి భవిష్యత్ కి ఏర్పాటు చేస్తాను!" అని, కరీంని ప్రత్యేకంగా అభినందించాడు ఎస్సై.

అబ్దుల్లా సెల్యూట్ చేస్తూ,"థాంక్ యూ సార్!" అన్నాడు. కరీంతో కలిసి పనిచేసిన పిల్లలు, వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలాడుకోసాగారు. “ఈ కరీమ్ భలే చేసాడురా! వాళ్ళ నాన్న పోలీస్ అని చెప్పలేదు." అని ఒకడు అంటే, "పోనీలేరా, మంచి పనే చేసాడుగా!" అని అనుకున్నారు.

ఇంతసేపు బిక్కుబిక్కుగా ఒకచోట కూర్చున్న మంజరి ఒక్కసారిగా ఏడుపు లంకించుకుంది.

“చూడండి సార్! నా చేతులు ఎంత నొప్పి పెడుతున్నాయో!" అంది కన్నీళ్లు తుడుచుకుంటూ.

ఎస్సై “చూడు అబ్దుల్లా, ఈ అమ్మాయిని జాగ్రత్తగా వాళ్ల ఇంటి వద్ద దించేయ్....ఆ! అక్కడ ఇవేమీ ఎవరికీ చెప్పకు!."

తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోయింది!!

***0***



# తలుపులు-తాళాలూ

## మధురాంతకం రాజారాం

తలుపులు, తాళాలూ  అంటే ఎందుకో అయిష్టం నాకు! వెళ్ళినంత దూరం వెళ్ళి, యింటి ముంగిట నిల్చునేసరికి, ఆ ఇల్లు మూసిన తలుపులతో ప్రత్యక్షమైతే ముఖాన చింతనీళ్ళు చల్లినంత బాధగా ఉంటుంది.

మనుషులు లోపలెక్కడో వుంటారు. పిలిచినా వినిపించదు. తలుపు పైన ముష్టిఘా'తాలకు గూడా పూనుకుంటే, యిష్టమున్నా లేకున్నా లేచి వచ్చి తలుపు తీయడం తప్పనిసరి! కానీ ఆ చిరాకూ, ఆ విసుగుదలా దాచుకోవాలంటే దాగేది కాదు గదా.  ద్వారానికివతల మనిషి కనిపించిన తర్వాత ముఖాన రంగులు మార్చుకుని ఎంతో కొంత ఆప్యాయత ఒలకబోయడం జరగవచ్చు, కానీ గొంతువక్కతో నోరు వగరెక్కిపోయిన తరువాత ఎంత పానకమైనా ఏమంత రుచిస్తుంది.

మానవ నాగరికతా చరిత్రలో గృహ నిర్మాణదశ ఒక అతి ముఖ్యమైన ఘట్టమే కావచ్చును.. కాని సరిగ్గా ఆ ఘట్టంలోనే మనిషికి మనిషిపైన అవిశ్వాసం బయల్దేరి వుంటుందని నాఅనుమానం! గూళ్ళకు మల్లే, గుహలకు మల్లే యిళ్ళు కట్టుకున్నది చాలక, వున్న కాసంత దారికడ్డంగా తలువులు పెట్టుకుని, నాలుగు గోడల మధ్య ఖైదీలా నక్కి కూర్చున్న మానవుడు తన దుస్థితికి తానెందుకు దుఃఖించడం లేదో నాకర్థం గాదు. అందులోనూ రాతి గోడలైతే ప్రశస్తమా! ఇటుక గోడలైతే శ్రేష్ఠమా! మట్టి గోడలైతే పనికిరావా! దడి కట్టుకుంటే, అది ఈసడింపుకు కారణమా? అంటే ఏమన్నమాట? తన చెరసాలను తానెంత కట్టుదిట్టంగా కట్టుకుంటే మానవుడి కంతగా పరువు ప్రతిష్ఠలు లభ్యమౌతున్నాయన్న మాట! కేవలం కారాగారవాసాన్ని మాత్రం లెక్కకు తీసుకుని చూస్తే సెంట్రల్ జైల్లో కాలం గడువుతున్న ఖైదీకి, బాహ్య ప్రపంచంలో నివసిస్తున్న సభ్యమానవుడికి పెద్దగా విభేదం కనిపించదు. ఎటొచ్చీ ఒకటి రెండు తేడాలున్న మాట నిజం! లోకంనుంచి తనను వేరు చేస్తున్న తలుపుపైన ఆధిపత్యం లేనివాడు నేరస్తుడు. అలా కాకుండా సభ్యమానవుడు తన తలుపును తాను లోపల నుంచి గడియ పెట్టుకోనూగలడు, బయటి నుంచి తాళం వేసుకోనూగలడు.

మనిషికో యిల్లు, ఇంటికో తలువు. తలువుకొక తాళం, తాళానికొక తాళంచెవి. మాయల మరాఠీవాడు ఏడు దీవులకవతలి చిలుకను నమ్ముకున్నట్టుగా, మానవుడు వేలెడంత లేని తాళంచెవిని నమ్ముకోడమే విచిత్రం. తన కుమారుడి ప్రయోజకత్వాన్ని గురించి, తన భార్య రూపాన్ని గురించి మానవుడెలాగైతే

చెప్పుకోగూడదో, అలాగే తన తాళంచెవిని యితరులకు ముట్టజెప్పగూడదని చెబుతుంది లోకనీతి. ఒక్కొక్క చోట తాళంచెవిని నమ్మి, పెళ్ళాం చేతి కివ్వడంగూడా జరగదు. తాళపుచెవుల బరువును బట్టి వ్యక్తికి హోదాలభిస్తున్న మాటను నేనుకాదనను! కానీ అలాగని తాళపుచెవులు అపనమ్మకానికి గుర్తులని చెప్పడానికి మాత్రం నేను సందేహించను. నాది అలిఘర్ తాళమని ఒకడు, నాది హస్తినాపురి తాళమని మరొకరు, నా తాళానికి ఏడు లీవర్లని ఒకరు, పదకొండని మరొకరు! అయ్యా, నిజమే కావచ్చు. కానీ అణువునే బ్రద్దలు చేస్తుండగా, విశ్వరహస్యాలనే ఛేదించి వేస్తుండగా, యిక నీ తాళాలకు భద్రత ఎక్కడ? శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు వుండనే వున్నాయి కదా!

అందుకనే అనంతాకాశమే పైకప్పుగా, విశాల భూవలయమంతా గృహాంగణంగా భావించి హాయిగా ఆనందంగా బ్రతికిన ఆదిమానవుడే అదృష్టవంతుడేమో ననిపిస్తుంది. కానైతే తలుపులూ, తాళాలూ లేని స్వేచ్ఛా ప్రపంచంలో బ్రతకగలిగితే బాగుండునన్నది ఒక ఆదర్శం మాత్రమే! ఆదర్శం అందంగా వుంటుంది. ఆహ్లాదం కలిగిస్తుంది. ఏమైనా అది ఒక తీయటి కల. కళ్ళు తెరవగానే కలగా మారిపోవడం కల యొక్క స్వభావం. ఆపైన కళ్ళకు కొట్టవచ్చినట్టుగా కనిపించేది నిష్ఠురమైన వాస్తవం. మానవుడి ఊహ ఓ నాణెం లాంటిదైతే, దాని కొకవైపున బొమ్మలాంటి ఆదర్శంతో బాటుగా, మరో వైపున బొరుసులాంటి వాస్తవం గూడా వుంటుంది. ఆదర్శాన్ని ఆరాధించక పోయినా తప్పు లేదు కానీ, అందువల్లనే యిది బొమ్మను గురించిన కథ కాదు. మరేమో బొరుసుకు సంబంధించిన ఉదంతం!

చెప్పదలచుకున్నది రంగనాధాన్ని గురించి -

చేయగూడదనుకున్న పనే చేయవలసి రావడం, కలుసుకోగూడదనుకున్న వ్యక్తినే కలుసుకోవలసి రావడం ఇవన్నీ మానవుడిపైన విధి చేసే కుతంత్రాలు. పనిగట్టుకుని యిక రంగనాధాన్నిక లుసుకోగూడదన్న నిర్ణయానికి నేను రావడం రెండేళ్ళ క్రిందటి మాట ! కానీ తప్పనిసరి పరిస్థితుల్లో కలుసుకోవలసి వచ్చింది. బస్ స్టాండు నుంచి రంగనాధం యిల్లు ఓ మైలు దూరంలో వుంది. ఇంకా అయిదుగంటల సైరన్ మోగలేదు. హైస్కూలు కుర్రాళ్ళప్పుడే యిళ్ళకు తిరిగి వెళ్తున్నారు. ఉద్యోగులు, విలాస పురుషులు షికారు బయల్దేరడానికైనా యింకా కొంత వ్యవధి లేకపోలేదు. నూటికి తొంబైపాళ్ళు రంగనాధం యింటి దగ్గరే వుండవచ్చునని ఆశించాను. మూసివున్న తలుపులు కంటబడేసరికి, నా ఆశ సగం మేరకు అడియాసై పోయింది. గ్రుడ్డిలో మెల్లగా తలుపుకు తాళం వ్రేలాడటం లేదు. ఒక వేళ రంగనాధం యింట్లో లేకపోయినా అతడి ఆచూకీ అయినా లభించవచ్చు. పిలిచి చూచాను. తలువుపైన చేయి చేసుకున్నాను. అయిదు నిమిషాల ఎడతెగని ప్రయత్నానికి ఫలితంగా నోరు నొప్పి పెట్టింది, చేయి స్వాధీనం తప్పింది. గజేంద్రుని మొర సూటిగా వైకుంఠానికే వినిపించగా నా పిలుపు, ఆ తలుపు దాటుకుని లోపలి వాళ్ళకు వినిపించక పోవడమే అబ్బురం. వినిపించినా తలుపు తీయగూడదని వాళ్ళనుకుంటే, యిక వాళ్ళ చేత బలవంతంగా ఆ పని చేయించడానికి నాకు మంత్ర తంత్రాలేవీ తెలియవు. ఇతరుల అవసరాన్ని గుర్తించడానికి నిరాకరించి, తలుపుకు గడియ పెట్టుకుని లోపల కూర్చుంటే కూర్చున్నారు గానీ, ఆ అవసరం తమకే కలిగినప్పుడు

వాళ్ళు తలుపు తెరుచుకుని బయటికి రాక తప్పదు. అందాకా అరుగు పైన్నే బైఠాయించాలన్న నిర్ణయానికి వచ్చాను.

పని లేకుండా పంచపైన కూర్చునేసరికి వీలు చూచుకున్న మనను సింహావలోకానికి బయల్దేరింది. రంగనాధానికి సంబంధించిన జ్ఞాపకాలు స్మృతిపథంలో మెరపులా మెరసి మాయమైపోసాగాయి-

***

"మా యింటి తలుపులెప్పుడూ నీకోసం తెరిచే వుంటాయి." అనేవాడు రంగనాధం.

వినివినీ వాడుకై పోయిన తరువాత అందులోని వైచిత్రి స్ఫురించడం లేదు గానీ, మొదటిసారిగా అమాట విన్నప్పుడు నా కాశ్చర్యం కలుగకపోలేదు. తలుపులు పెట్టడంలో ఉద్దేశం వాటినెల్లప్పుడు తెరచి వుంచడం కాదు. అలా తెరిచి వుంచినట్టయితే ఎదురుచూచిన వ్యక్తులతో బాటుగా, ఎదురుచూడని ఉపద్రావాలు గూడా కొన్ని యింటి లోపలికి దాపురించవచ్చు. ఈ నా అనుమానాన్ని కాస్తా బయటికి చెప్పేశానేమో, ఫకాలున నవ్వేశాడు రంగనాధం!

"భలేవాడివి శేఖరం! పాటంటే చెవి కోసుకుంటానన్న వాడి చేతికి చాకిచ్చి, ఏది కోసుకో చూద్దామన్నట్టుంది. నీ సందేహం! తలుపులెప్పుడూ తెరిచి వుంటాయంటే నీ రాక మాకెప్పుడూ ఆనందదాయకమేనని అర్థం. నువ్వేమో పల్లెటూరివాడివి. అరకప్పు మంచి కాఫీ త్రాగాలన్నా ఈ బస్తీకి రాక తప్పదు. నేను వెయ్యిళ్ళ పూజారిని. నువ్వొచ్చిన సమయానికి నేను యింట్లో వుండవచ్చు, ఉండకపోవచ్చు. మా ఆవిడ నీకు క్రొత్తగాదు. బాయిలర్ లో బొగ్గులు వేస్తే అయిదు నిమిషాల్లో వేడినీళ్ళు సిద్ధం! నువ్వు నా కోసం కాచుకుని కూర్చోడం అనవసరం! నీ పాటున నువ్వు నీ స్నానపానాలు ముగించి హాయిగా ఈ గదిలో రెస్టు తీసుకో .."

పురుషులందు పుణ్య పురుషులు వేరు మాత్రమే గాదు, అరుదు గూడా! అలాగే మిత్రుల్లో గూడా మనసిచ్చేవాళ్ళు, మమకారాలు సెరపేవాళ్ళు అరుదు. రంగనాధం నాతో కలిసి చదువుకున్నవాడు కాదు. సమ వయస్కుడైనా కాదు. నా కన్నా పదేళ్ళు పెద్దవాడు. ఉబుసు పోక ఉద్యోగం లాంటిదేదో చేస్తున్నా, ఆ ఉద్యోగానికి అతీతమైన పరపతి, పలుకుబడి అతనికి సంఘంలో వున్నాయి. దట్టంగా తీగలల్లుకున్న మెట్ట పొలాని కడ్డంగా పరుగెత్తడం ఎంత సులభమో, రామాపురం వీధుల్లో రంగనాధం వెంట బయల్దేరి గమ్యస్థానం చేరుకోడం అంత సులభం! రంగనాధానికి పరిచితుడో, మిత్రుడో, ఆత్మీయుడో కానివాడు ఆ ప్రాంతంలో ఉండడని నా నమ్మకం. నాలాంటి పల్లెటూరి వ్యక్తికి ఆతిధ్య సత్కారాలు సెరపడం ద్వారా అతడాశింపదగిన ప్రయోజన మేది కనిపించదు. లేదంటే రంగనాధం కట్టుకున్న ఒకానొక గాలిమేడకు నేనొక గోడలా, కాకపోతే ఒక దూలంలా ఉపకరించినమాట నిజం ! రంగస్థల చరిత్రలో ఒక అపూర్వ విప్లవాన్ని సాధించి, దేశంపైన జైత్రయాత్ర సల్పడమే వ్యాపకంగా గల, ఒక నాటక సమాజాన్నితయారు చేయాలన్నది అతడి ఆశయం, రంగనాధం వూహలోనే పుట్టి వూహలోనే అణగారిపోయిన ఆ సంచార నాటకసమాజంలో నాది శాశ్వత సభ్యత్వం. కనిపించినప్పుడల్లా క్రొత్తగా తనకు స్ఫురించిన పథకాలను, విధానాలను వివరించేవాడు

రంగనాధం. చెబుతున్న రంగనాధానికి, వింటున్న నాకు ఆ ఆలోచనలు పంచదార కన్నా, పాయసం కన్నా పరమ రుచ్యంగా వుండేవి.

కానీ పగటి కలలన్నీ నెరవేరవచ్చు నన్న పేరాస మాత్రం నాకేకోశానా వుండేది గాదు. కళ కళ కోసమేనన్నట్టుగా కలలు కనడంలోనే కొంత ఆనందం వుంది. పెట్టుబడితో అవసరం లేకుండా విరివిగా లభించే ఈ అనందాన్ని విడనాడుకోవలసిన అగత్యం నాకు కనిపించలేదు. నాటకాలలాగా, సినిమాలలాగా పగటి కలలు గూడా వినోదంగా కాలక్షేపం చేయడానికి సాధనాలు. రంగనాధం ఈ సత్యాన్ని గమనించినట్టు లేదు. తీరని కోరికల అలజడి బుర్రలో తేనె టీగల బృందగానంలాంటిది. దానివల్ల శాంతిమాట దేవుడెరుగు, మనసుకు విశ్రాంతిగూడా లభించదు. భ్రాంతిలో పడి కొట్టుకపోతున్న వాడిలా కనిపించేవాడు రంగనాధం. కల్లోల సాగరంలో ఈదులాడుతున్న వాడికెదురైన ఏకాంత ద్వీపంలా నేనప్పుడప్పుడు రంగనాధానికి తారసిల్లే వాణ్ణి!

“నువ్వా శేఖరం| రా, కూర్చో. ఇదిగో పార్వతీ| మన శేఖరం వచ్చేశాడు!” అంటూ అతడు సంబరంలో తలమునకలై పోయేవాడు. “చూడు శేఖరం! నువ్వొచ్చావు కనుక, ఈరోజు నేను ఆఫీసుకు సెలవు పెట్టడం ఖాయం. మధ్యాహ్నందాకా బాతాఖానీ, సాయంకాలం షికారు. ఆపైన సినిమా వుండనే వుంది.” అంటూ కార్యక్రమం నిర్ణయించేవాడు. పూట పూటకు ఒక పిండివంట చేయమని భార్యకు పురమాయించేవాడు. అడపా దడపా ఈ అతిథి సత్తమ్ముణ్ణి మేపవలసి వస్తున్నందుకు యింటి ఇల్లాలు నొచ్చుకుంటుందేమోనన్న సందేహం కలుగకపోలేదు. కానీ ఆమె గూడా ‘వచ్చారా అన్నయ్యా! మీరు రావడమే పదివేలు! మీ పుణ్యమా అని ఈయన కొంత సేపైనా యింటి పట్టున్నే వుంటారు!“ అనడంతో నా సందేహం పటా పంచలైంది, రామాపురం వెళ్ళి సాయంకాలానికల్లా తిరిగొస్తానని చెబుతే, యింటి దగ్గర మావాళ్ళు నమ్మేవాళ్ళు కారు. రామాపురంలో వున్న నా మిత్రుడు అంత సులభంగానన్ను వదిలి పెట్టడని వాళ్ళకు బాగా తెలుసు.

ఇదంతా గడచిన కథ. రంగనాధం రామాపురం నుంచి జిల్లా ముఖ్య పట్టణానికి కాపురం మార్చడమే నాలుగేళ్ళ క్రిందటి మాట! ఎప్పుడో ఒకప్పుడు రంగనాధం, లోకుల కందరికీ దిగ్భ్రమ గలిగించే మహత్కార్యం ఒకటి చేయగలడని నేననుకున్నాను గానీ, ఉద్యోగానికి రాజీనామా యిచ్చి, పల్లెలో పొలమమ్ముకుని ఆ డబ్బుతో పట్టణానికి తరలి వెళ్ళగలడని మాత్రం అనుకోలేదు. ఏమిటిలా చేశావని అడిగితే, రంగనాధం తేలిగ్గా నవ్వేశాడు. “రామాపురంలో ఏముందోయ్ శేఖరం! ఇక్కడ చూడు- ఎన్ని లారీలు, ఎన్ని మండీలు! ఎంత వ్యాపారం, ఏం కథా! నువ్వు చూస్తూనే వుండు. నాలుగేళ్ళలో అదృష్టచక్రాన్ని గిర్రున త్రిప్పేస్తాను!' అన్నాడు రంగనాధం.

అదృష్టాన్ని పరీక్షించుకోడం కోసం మానవులు ఖండాంతరాలకే పయనం సల్పుతుండగా రంగనాధం పట్టణానికి తరలి వెళ్ళడం, గొప్ప తప్పిదమనీ నేనెలా అభిప్రాయ పడగలను? రామాపురం కంటే పట్టణం పదిపన్నెండు రెట్లు పెద్దది. అందుకు తగ్గట్టు రంగనాధం జీవితవిధానం గూడా మారింది. పట్టణంలో అతడు కాపురమున్న యింటికి చెల్లించుకుంటున్న అద్దె, రామాపురంలో అతడి నెలజీతంతో సమానం! యింటి

నిండుకూ ఫర్నిచరు. అదనంగా రేడియో. ప్రత్యేకంగా ఆఫీసు గది. ఉదయం అయిదు గంటలకు తలుపు తెరిచింది మొదలు, రాత్రి పదికో పదకొండుకో మళ్ళీ తలుపు మూసేదాకా ఎడతెగని మిత్రసందోహం, అంతులేని చర్చలు, చర్చల కనుపానంగా ప్రక్కన్నే వున్న హోటల్లో నుంచి పానీయాలు, వాటి కనుబంధంగా బంకులో నుంచి కిళ్ళీలు, సిగరెట్లు, రంగనాధం పని మోతగా వుంది. పట్టణంలో కాపురం పెట్టిన క్రొత్తలో నేను రంగనాధాన్ని నాలుగైదుసార్లు కలుసుకున్నాను. కలుసుకున్న ప్రతిసారీ నాకు రూఢిగా అవగతమైన విషయమొక్కటే! పాపం, రంగనాధాని కొక క్షణమైనా తీరిక లభించడం లేదు. తనకోసమని యింత దూరం నుంచీ నేనువెళ్తే 'రావోయ్ శేఖరం! ఇదేనా రావడం? అంతా క్షేమమే గదూ! కూర్చో' అంటూ పొడిపొడిగా నాలుగు మాటలు వల్లించి, అతడు మళ్ళీ మిత్రులతో కలిసి యిష్టాగోష్టిలో నిమగ్నుడై పోయేవాడు. అప్పటికి నాకేదో నిరాదరణ జరిగిపోయిందని గాదు నేను చెప్పడం, ఆదరణ వెలగకాయలో గుజ్జులాంటిది. కాయ లోపలికి గుజ్జు యిలా వచ్చిందని గానీ, కరి మ్రింగిన తరువాత అది ఇలా మాయమైందని గానీ ఎవరూ చెప్పలేరు. ఒకప్పుడొకచోట అయాచితంగా లభించిన ఆదరం, మరొకప్పుడు అదేచోట ఆశించినా లభించక పోవడం సంభవమే! పోగా నాలాంటి దారంట వెళ్ళే దానయ్యల నందరినీ రంగనాధం ఆదరిస్తూ కూచోవాలన్న అత్యాశ గూడా నాకు లేదు. ఎటొచ్చీ నా కొక్కటే సందేహం! రంగనాధం ఆశయం అదృష్టచక్రాన్ని గిర్రున తిప్పడమేననుకుందాం. కానీ అతడు తన ఆశయ సాధన కోసం తీవ్రంగా కృషిచేస్తున్న సూచనలు కానరావడం లేదు. మాటలవల్ల మామిడికాయలే రాలవు. ఇక అదృష్ట చక్రం తిరగడం ఎలా సాధ్యం?

చొప్పదంటు ప్రశ్న లేస్తే పంతులుగారికి కలిగే చిరాకు ఎలాంటిది? నాసందేహాన్ని విన్నప్పుడు రంగనాధానికి సరిగ్గా అలాంటి సందేహమే కలిగింది. 'నీకు తెలియదోయ్ శేఖరం! నిమిషాల్లో వందలార్జించే అవకాశాలెన్నో యిక్కడున్నాయి. ఆలోగా కొన్ని దుబారా ఖర్చులకు మనం వెనుకాడగూడదు. వీలయినంత త్వరగా ఓ లారీ కొనాలనుకుంటున్నాను. అదృష్టం కలిసొచ్చి అనతికాలంలో ఒక్క లారీయే పది లారీలవుతుంది ...” అన్నాడు రంగనాధం.

“ఏమౌతుందో ఏమిటో! ప్రస్తుతానికి నేనీ రాబంధులతో వేగలేకపోతున్నాను. మీరింట్లో వుంటే తెలిసిన పాట, మాటల గోలతో, వెకిలినవ్వులతో పైకప్పు ఎగిరిపోతుంది. మీరింట్లో లేకపోతే యిక సరేసరి, రెండు నిమిషాలకోసారి తలుపు తెరవాలి. ‘ఇంట్లో లేరు. బజారుకు వెళ్ళారు. కొంత సేపట్లో వచ్చేస్తారు.’ అంటూ వివరాలు చెప్పి, యిలా యింటి లోపలికి వస్తానో లేదో మళ్ళీ తలుపుపైన చప్పుడు ...“

“చూచావా శేఖరం! ఇదీ వరస. ఈ రోదన భరించలేక నేను దీనికొక ఉపాయం కనిపెట్టేశాను. ఉండు పార్వతీ, తెస్తానుండు” అంటూ గది లోపలికి వెళ్ళాడు రంగనాధం.

నివ్వెర పడిపోయినట్టుగా అక్కడే నిల్చుండి పోయింది రంగనాధం భార్య. నేనూ యించుక ఆశ్చర్యంతో గది గుమ్మం వైపు చూస్తున్నాను, మూరెడు పొడుగు యినుప రేకొకటి చేతబట్టుకుని రంగనాధం హాల్లోకి వచ్చాడు. రేకు పైన యిత్తడితో పోతటోసిన రంగనాధం నామ్యాక్షరాలు మిలమిలా మెరసి పోతున్నాయి.

పేరుకు చివర రెండు అరలున్నాయి. జరపడానికి వీలున్న రేకుముక్క మూలంగా ఆరెండింటిలో ఒక అర ఎప్పుడూ మూసుకునే వుంటుంది.

“ఇదేమిటో తెలుసా పార్వతీ! ఇన్ అవుట్ బోర్డన్న మాట! 'ఇన్' బయటకి కనిపిస్తే నేనింట్లోనే వున్నట్టు ‘అవుట్' కనిపిస్తే నేను బయటికి వెళ్ళినట్టు. ఇకపైన దీన్నిలా గదిలో దాచిపెట్టను. సింహద్వారానికవతల గోడకు తాపడం చేస్తాను. ఎవరొచ్చినా దీని పైపోసారి చూచి నేనింట్లో లేనని తెలిస్తే ,చక్కా తిరుగు దారిబట్టి వెళ్ళిపోతారు.'

“ఏమిటో బాబూ! వాళ్ళంతటితో తృప్తిపడి వెళ్ళిపోతారని నాకు మాత్రం నమ్మకం లేదు ” అంది రంగనాధం భార్య.

నామట్టుకు నాకు మాత్రం ఆ సమస్యను పరిష్కరించడానికి అంతకు మించిన ఉపాయం వుండదనిపించింది. కానీ, ఆ బోర్డు తగిలించిన వేళా విశేషమేమిటో గానీ ఎప్పుడు వెళ్ళినా, ఎన్నిసార్లు వెళ్ళినా రంగనాధం ఇంట్లో ఉండేవాడు కాదు. అసలు నేను పట్టణానికికెళ్ళే అవకాశాలే చాలా తక్కువ. ఇక అరుదుగా వెళ్ళినప్పుడు రంగనాధం తన యింటి గోడకు తగిలించిన బోర్డుపైన పొరబాటుగానైనా “యిన్' అన్న సంకేతం కనిపించేది గాదు. చివరికోసారి రంగనాధం యోగ క్షేమాలను, వ్యాపార పరిస్థితులను తెలుసుకోగోరి పల్లెనుంచి ఒక జాబు వ్రాసి చూచాను! పదిరోజుల్లో ప్రత్యుత్తరం వచ్చింది.

“డియర్ శేఖరం! నువ్వింత వెర్రిబాగుల వాడివని అనుకోలేదు. నేనేదో మిత్రుల బెడద నుంచి తప్పించుకోడానికని మా యింటి గోడ కొక బోర్డు తగిలించుకుంటే, దాన్ని శిలాశాసనంగా విశ్వసించడం నీ పొరపాటు. ఔనంటే కాదనిలే, కాదంటే అవుననిలే అన్న విరుద్ధ వ్యాఖ్యానం బహుశా నీకు తెలిసివుండదు. నీలాంటి వాళ్ళకోసం మరో ఉపాయం కనిపెట్టాను. మా యింటికిప్పుడు ఓ ఫోనుగూడా వుంది. బస్టాండు దగ్గర నుంచీ నువ్వొక ఫోనులో నుంచీ వాకబు చేసి, నేనింట్లో వున్నదీ లేనిదీ తెలుసుకోవచ్చు. ఒక వేళ నేనింట్లో లేకపోతే, నువ్వు నా కోసం ఇంతదూరం నడచి రావలసిన శ్రమ తప్పుతుంది. వచ్చిన తరువాత ఇప్పుడు తలుపు బాదవలసిన అవసరం గూడా నీకేర్పడదు. బైటునుంచి ఓ బటన్ అదిమితే చాలు, ఇంట్లో ఓ గంట మ్రోగుతుంది.'

యాత్రా దర్శనిలో బదరీనాథ్, కేదారినాథ్ యాత్రల్ని గురించి చదివాను. తన యింట్లో వుండగా రంగనాధాన్ని కలుసుకోడం అంతకంటే సులభం కాదేమోనన్న భ్రమ కొద్ది నిమిషాలపాటు నన్నావహించింది. ఐనా క్రొత్తగా అమల్లోకి వచ్చిన టెలిఫోను తోడ్పాటును సైతం నేను విడనాడదలచుకోలేదు. బస్ స్టాండు దగ్గర టెలిఫోను సౌకర్యాలున్న మండీలు దండిగా వున్నాయి. ఒకసారి పట్టణం వెళ్ళినప్పుడు ఒక మండీలో నుంచీ రంగనాధానికి ఫోను చేశాను.

బదులు పలికిన కంఠం నాకు పరిచితమైనదిగాదు.

'ఎవరండీ శీతలమా! ... అబ్బే, వినిపించడం లేదండీ! శేఖరమన్న మాట! ..పల్లెనుంచి వచ్చారా? మంచి పనే చేశారు! అయ్యగారి కోసమా, అరరే ఆయన వూళ్ళోలేరే! ఎక్కడికెళ్ళారంటారా, ఏమో ఎలా చెప్పగలం!

నెల్లూరో, గుంటూరో, తెనాలో చెప్పలేం! ఎప్పుడొస్తారంటారా, అది మీ అదృష్టం. వస్తే రాత్రికే రావచ్చు. లేదా నాలుగు రోజులు ఆలస్యం కావచ్చు....'

ఫోను క్రింద పెట్టేశాను. బజార్లో పని చూచుకుని హొటల్లో భోజనం చేసి, ఓ సినిమాకు వెళ్ళి కూర్చున్నాను. అర్ధరాత్రి సమయానికి యింటర్వెల్లో దీపాలు వెలిగాయి. తేనీరు సేవించి వద్దామని స్టాలు దగ్గరికి వెళ్తుండగా, మేడ మెట్లు దగ్గర సిగరెట్టు కాల్చుకుంటూ కనిపించాడు రంగనాధం.

"నువ్వు.. నువ్వేనటయ్యా రంగనాధం! సాయంకాలం నేను ఫోను చేసినప్పటికి నువ్వింట్లో లేవు. ఎప్పుడొచ్చినట్టు?" అంటూ నా ఆశ్చర్యం నేను వెళ్ళబోసుకున్నాను.

"మామూలుగా నౌకరు కుర్రాడు అలాగే చెబుతుంటాడు" అంటూ ముసిముసి నవ్వులు ఒలక బోసాడు రంగనాధం.

నౌకరు కుర్రాడలా చెప్పినందుకు గాదు నాకు విచారం. వాడలా చెప్పడం రంగనాధానికి హితవుగానే వున్నట్టుంది. జరిగిన పొరపాటుకు ఈ పెద్దమనిషి లాంఛనంగా నైనా విచారం ప్రకటించడం లేదు. బుర్రకు సమ్మెటపెట్టు తగిలినట్టుగా నా బుద్ధి మొద్దుబారిపోయింది. సినిమా పూర్తయ్యేదాకా నోటమాట పెగిలింది కాదు.

కానీ రంగనాధంలో వచ్చిన మార్పును గురించి విపరీతంగా ఆలోచించి బుర్రను పాడు చేసుకోవలసిన అవసరం నాకు కనిపించలేదు. గడచిన రెండేళ్ళలో నేను దాదాపు అతణ్ణి గురించి తలపెట్టడమే మానేశాను. అంతరాంతరాల్లో యిక మీదట నా అంతట నేనుగా రంగనాధాన్ని కలుసుకునే ప్రయత్నాలు చేయకూడదన్న నిర్ణయానికి గూడా వచ్చాను. అంతా మనమనుకున్నట్టే జరిగితే యిక ఈ ప్రపంచ నాటకం రక్తిగట్టదేమో! ఇన్నాళ్ళకిన్నాళ్ళకు మళ్ళీ రంగనాధంతో పనిబడింది. కానీ ఈసారి నేను టెలిఫోను, కాలింగ్ బెల్ మొదలైన ఉపకరణాలను నమ్మదలచుకోలేదు. స్వయంగా నా కళ్ళనే నమ్మదలుచుకున్నాను.

తరువాతి కథ మీకు కలిసిందే! వచ్చి చూచేసరికి మిత్రులే కాదు సరిగదా.. చీమలు దోమలులాంటి క్రిమి కీటకాలు చొరబడడానికైనా వీల్లేకుండా తలుపు, కిటికీలు బంధింపబడి వున్నాయి. గోడపైన బోర్డు గానీ బటన్ గానీ కనిపించటం లేదు. ఆరుగుపైన కూలబడి పదిహేను నిమిషాలు వేచి చూశాను. వేసిన తలుపు వేసినట్టే వుంది.

ఆక్షణాన నాకు, లోకానికి రంగనాధానికి మధ్య పెనుభూతంలా నిలిచివున్న ఆ తలువుపైన పట్టరానంత కోపం వచ్చింది. బలం కొద్దీ నాలుగు పిడిగుద్దులు ప్రసాదించి దాన్ని బ్రద్దలు చేసేయాలన్నంత ఉక్రోషం గూడా కలిగింది. భావ ప్రకోపానికే గనుక బలంవుంటే నా కోపతాపాలకే ఆ తలుపు నుగ్గు నూచమై పోయివుండవలసింది. అంత పని జరగలేదు గానీ, అతిధ్యం లభించనందుకు కినిసి కాశీనగరాన్ని శపించబోతున్న దూర్వాస మహర్షికి అన్నపూర్ణ ప్రత్యక్షమైనట్టుగా తటాలున తలుపు తెరుచుకుంది.

"మీరా అన్నయ్యా! ఇంకా ఎవరో అనుకున్నాను. కూచుందురు గానీ లోపలికి రండి!' అంది రంగనాధం భార్య.

అలాగైతే పది నిమిషాలకు మునుపు నేను తలుపు తట్టడం ఈమెకు వినిపించిందన్నమాట!
"ఈమధ్య మనుషులు రావడం మరీ ఎక్కువై పోయింది. వచ్చిన వాళ్ళకు బదులు చెప్పలేక ప్రాణాలు పోతున్నాయి. ఏమని చెప్పుకోనన్నయ్యా! నా అవస్థ ఆ భగవంతునికే ఎరుక!"
నిజమే గావచ్చు! సమాజంలో అంతస్థు పెరిగిన కొద్దీ మనుషులతో బెడదగూడా పెరుగుతుంది. గొప్పవాడంటు ఒకడుంటే, అతనికి ఒక వందమందైనా ప్రక్క వాళ్ళుండడం లోకసహజం. ఒక విధంగా అది గర్వకారణం గూడా! ఆమాటే పార్వతమ్మతో చెబుదామనుకున్నాను. చెప్పకపోవడమే మంచిదైంది!
ఆమె చెప్పుకు పోతోంది.
"నెలరోజులైంది. ఈయన వూరు విడిచి వెళ్ళి! ఎక్కడికి వెళ్ళారో తెలియదు. వ్యాపార సాపారాలు కట్టిపెట్టి ఆరుమాసాలైంది. ఊరిలో ఎవరెవరికి ఎక్కడెక్కడ ఎన్నెన్ని అప్పులున్నాయో తెలియదు. చిల్లరంగడవాడు రెండు వందలదాకా లెక్క చెబుతున్నాడు, ఇంటద్దె నాలుగు మాసాలుగా బకాయి. గంట కొకరుగా, అరగంట కొకరుగా అప్పులవాళ్ళు యింటిపై కొస్తున్నారు. తలుపు పైన సవ్వడి వినిపిస్తే గుండె జల్లుమంటుంది. పగటిపేళ నాకెలాగో గడచి పోతుంది. ప్రొద్దుపోయి చీకటి పడితే, ఈ లంకంత యింట్లో నా నీడే నన్ను భయ పెడుతుంది. పులి మీద పుట్రలాగా ఈ ఎలట్రిసిటీ వాళ్ళొకరు... రెండు నెలలుగా బిల్లు చెల్లించలేదేమో, ఎప్పుడెప్పుడు లోపలికొచ్చి ఈ ఫ్యూజు కాస్తా వూడలాక్కుని వెళ్ళిపోదామా అని చూస్తున్నారు! ఈయింట్లో రాత్రయ్యేసరికి దీపాలుగూడా వెలుగకపోతే యిక నా గతేమౌతుందో నాకే తెలియడం లేదు ... "
ఆ పరిస్థితిలో నాలుగు ఓదార్పు మాటలు చెప్పడం కన్నా నేను చేయగలిగిందేమీ లేకపోయింది, సెలవు తీసుకుని బయటికి వస్తూ తలుపు వైపొకసారి చూచాను. ఎందుకో ఉన్నట్టుండి దాని పట్ల నాకు గౌరవభావం కలిగినట్లు తోచింది.
ఎందుకని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ప్రశ్నకు సమాధానంగా నా వెనుక వైపున రంగనాధం భార్య తలుపు మూసి, గడియ పెట్టుకుంటున్న చప్పుడు వినిపించింది.

***0***



# వినదగునెవ్వరు చెప్పిన ..

మెడికో శ్యామ్ గారు తయారు చేసిన సాహితీ వంటకాన్ని కథామంజరి వారు వడ్డిస్తే, ఆ 'వంటకాన్ని' మరింత మందికి చవులూరిస్తూ చేరవేసిన బి ఎస్ మూర్తి గారికి ధన్యవాదాలు. మొదటిసారి విన్న వెంటనే నాకు 'బాగా చదివారు' అని అనిపించింది. యూట్యూబు మాధ్యమాన్ని ఉపయోగించి ఈ మధ్య చాలా ఛానెల్స్ తెలుగు కథలు చదవాలనే ధ్యేయంతో తెరువబడ్డాయి. అయితే కథలను సరి అయిన మాడ్యులేషన్ లో, వాక్యాలను సరిగా విరిచి చదవడంలో సఫలీకృతులైన వారు కొద్ది మందే. ఆ నేపథ్యంలో మూర్తిగారికి మంచి మార్కులు ఇవ్వవచ్చు. కథామంజరి ఈ మాధ్యమాన్ని కూడా ఎన్నుకుని కథలను మరింత మందికి అందిస్తూ ప్రాచుర్యంలోకి తీసుకు రావాలనుకునే వారి ప్రయత్నానికి అభినందనలు.

ఆర్. శేషతల్ప శాయి , హూస్టన్.

శ్రీ ఇందు రమణ గారి కథ చాలా బావుంది. నా మిత్రులలో లోనే రాజారావ్ లాంటివాళ్ళని కాకపోయినా వెంకటేష్ లాంటి వాళ్ళని చాలా మందిని చూశాను. శ్రీమతి సరస్వతి గారు ఎంతో మంచి మాడ్యులేషన్ తో చాలా బాగా చదివారు. Especially background music has complimented the narration.

రాఘువ అవసరాల

బుడి బుడి అడుగులతో అడుగులు వేస్తూ రెండో వర్షంలోకి అడుగిడిన సుగంధ సుమగుచ్ఛం "కథామంజరి"కి అభినందనలు! ఈ సంచికలో సుకథానిలయపు చిరునామా "కారా" మాష్టారుగారి నివాళితో ప్రారంభించడం సమంజసమే. సాధారణంగా సంపాదకీయం అంటే సినిమా ముందు వేసే టైటిల్ లాగా త్వరగా అయిపోవాలనుకొనేవారి ఊహకు భిన్నంగా "కథాకీయం" మనసులో మాట తెలిపేలా వుంది. విన్నపాలు వినవలెలో మనదైన తెలుగును బ్రతికించుకోవాలనే తపనను వ్యక్తపరిచారు. సంచికలో ఆయా కథా రచయితల ఫోటోలు,సంక్షిప్త పరిచయం చేయడం ముదావహం. ఇక కథల వీధిలో.... చిన్న పనికైనా గొప్ప సహాయం చేసే వ్యక్తులుంటారని చెప్పిన శ్రీ ద్విభాష్యంవారి "శివరంజని "కథ బాగుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబపు ఆచారాలు, కట్టుబాట్లను కొనసాగించలేక స్వరూప తీసుకున్నవిప్లవాత్మక నిర్ణయాన్ని "జీవితంపై దాడి" కథలో చక్కగా తెలిపారు శ్రీ శివకుమార్ గారు. అప్యాయతే ఊపిరిగా పెరిగిన బాల్యస్నేహితులు పంచుకున్న అభిమానాలు, పరిస్థితుల ప్రభావంతో అపకారం చేసిన మిత్రుడికి కూడా ప్రాణదానం చేసిన మహోన్నతుని కథ ద్వారా చాలామందికి తమ బాల్య స్నేహితులను గుర్తుకు తెచ్చారు రచయిత శ్రీ ఇందూరమణ. మద్యం అలవాటు, డబ్బు పొందాలనే ఆశ ఉన్నప్పటికీ నిజాయితీని వదలని వ్యక్తి కథని "తప్పు తాళం కప్పదే" లో ఉత్తరాంధ్ర మాడలీకం చక్కగా వాడుకున్నారు రచయిత. అమ్మ చేతిలో కమ్మని వంటల గుబాళింపులకు ప్రముఖ రచయితల గూర్చిన విశేషాలు మేళవించి చక్కని వంటకాన్ని రుచి చూపించారు మిత్రులు మెడికోశ్యామ్. నీతిని అంటిపెట్టుకునే వారు ఏ పదవిలో వున్నా, తాము మనఃశ్శాంతిని కలిగి ఉండడమే కాకుండా, సమాజానికి, దేశానికి ఉపయోగపడతారని చెప్పిన జొన్నలగడ్డ దంపతుల "మారాజులొచ్చారు" కథ. ప్రేమకు బాల్య స్నేహితుడు దీప్తా కన్నీరే తార్కాణమని "స్నేహితుడు'" కథలో బాగా తెలిపారు రచయిత్రి. బామ్మగారు, కస్టమ్స్ అధికారులను తన అచ్చతెలుగు పరిజ్ఞానంతో తికమక పెట్టి, నేరగాళ్లను పట్టిచ్చిన "బామ్మగారొస్తున్నారు బహుపరాక్ ".. జెన్నీగారి కథ హాస్యభరితంగా ఉంది. కనుమరుగవుతున్న కుటుంబ అభిమానాలు, సంబంధాల జడివానలో సతమతమవుతున్న కుమార్తె సంతోషానికి ఓ తల్లి తీసుకున్న నిర్ణయం "ఆపాతమధురం". అభిమానించే వ్యక్తుల మధ్య ప్రేమకు పెళ్ళే పరమార్థం కారాదని జానకి, శ్రీరాం పాత్రల ద్వారా "జీవనవేదం" కథలో శ్రీ యాజ్ఞ్యవల్కశర్మగారు చక్కగా తెలిపారు.

గండికోట వెంకట కుటుంబరావు, విజయనగరం

రాయని భాస్కరులు మెడికో శ్యామ్ తాజా "వంటకం" కథామంజరిలో జులై 2021 సంచికలో వడ్డించి, యుట్యూబ్ లో వినిపించినందుకు అనేక ధన్యవాదములు! హైద్రాబాద్ భాష లో "డబుల్-కా-మీఠా" తిన్నంత మధురంగా అనిపించింది. కథను, శ్రావ్యంగా వినిపించిన శ్రీ మూర్తి గారి ప్రయత్నం అభినందనీయం. అక్కడక్కడా కనిపించిన ముద్రారాక్షసాలను పిడియఫ్ ప్రతిలో సవరించమని మనవి!

డా. అల్లాడి మోహన్

రాత్రి హాయిగా చేరబడి ఆనందంగా కథలు విన్నా. ఏమని చెప్పను నా సంతోషం. భలే ఉందిలే! శుభాకాంక్షలు కథామంజరి!

KVND ప్రసాద్, విశాఖ

# పాఠకుల కథ

## సమ్మెట ఉమాదేవి గారి స్నే'హితుడు'

సమ్మెట ఉమాదేవి కథ రాయదు. జీవితాన్ని కథగా మలుస్తుంది. ఈ జీవిత కథ పేరులో రెండు పేర్లున్నవి. స్నేహితుడు, హితుడు. ఇదోక గొప్ప టెక్నిక్. లంబాడీ తండా నేపథ్యంలో కథ నడుస్తుంది. ఆమెకు, తండా బతుకులకు విడదీయరాని సంబంధం ఉన్నది. పేదోడి జీవితంలో కూడా ప్రేమ కథలుంటాయి అనేది ఈ కథ ముఖ్యాంశం. పవిత్ర ప్రేమ భౌతిక సంబంధం కోరుకోదు అనేది తీర్పు. స్త్రీ పురుషుల మధ్య స్నేహంతో కూడిన ప్రేమ ఉండొచ్చు. వారి మధ్య సంబంధం శారీరక సుఖానికి దారితీయవలసిన అవసరం లేదు... అనేది చెప్పకనే చెప్పారు రచయిత్రి. ఈ అభిప్రాయం సమాజంలో పాతుకుపోయిన అభిప్రాయానికి వ్యతిరేకం. Unorthodox view. చదువరి కాత్యాను అతను పెళ్ళి చేసుకుంటే బాగుండు అనుకుంటాడు. కాత్యా అతనిని ప్రేమించినట్టు రచయిత్రి చెప్పలేదు. అతనిది వన్ సైడడ్ లౌ. ఆమెకు ఆర్థిక స్వాలంబన కలిగించే బాధ్యత తీసుకున్నాడు. మగ దిక్కుగా తను మిగిలాడు. మొగుడు బాధ్యత తీసుకోలేదు. ఐతే, ఆమెను పెళ్ళి చేసుకుంటే, ఇది ఒక 'గొప్ప' కథ స్థాయిని కోల్పోయిది.

ప్రో. నరసయ్య పంజాల

## మెడికో శ్యామ్ గారి "వంటకం"

వంటకం' చదువుతూ ఉంటే మెడికో శ్యాం విశిష్టత తెలుస్తోంది. పాత రచయిత రాసిన కొత్త కథ, సంప్రదాయ బద్ధంగానే ఉన్న అధునాతన కథ, కథ గురించి రాసిన కథ, ఇది 'అనగానగా..' కథ కాదు, ఏ వాదమూ, 'ఉద్యమమూ' లేని కథ. కథకు పెట్టిన శీర్షికకు న్యాయం చేయటానికా అన్నట్టు, కథ అమ్మ వంట తో మొదలవుతుంది. మంచి ఎత్తుగడ. బాల్యంలోని జ్ఞాపకాలు ఇష్టపడని వారెవరు? కుంపటి మీద కాలీఫ్లవర్, బంగాళా దుంపలను మరిగిస్తూ ఆ కూరల నీరును నూనెతో కలపడాన్ని 'సాంప్రదాయతనూ' ఆధునికతతో కలపడంగా రచయిత చమత్కరిస్తాడు. పదును దేరిన వ్యంగ్యంతో పాటు హాస్యాన్ని ప్రధాన వాహికగా చేసుకున్న రచయిత, కొత్తిమిరా కరివేపాక అని వాదించుకునే స్నేహితునీ, అతని భార్యనీ ప్రస్తావిస్తాడు. కథ చదువుతున్నంతసేపూ మనకు హాస్య రసాన్ని చవి చూపించే ఇలాంటి ఉదంతాలు మధ్యలో వస్తాయి. ఉడుకుతున్న కూరనీళ్ళలో చిత్రాలు రచయితను వర్తమానంలోకి తీసుకొచ్చి - కరోనా కల్లోలం చూపిస్తాయి: 'మనుషులు టపటపా రాలిపోతు భయంతో ఎక్కడికి పోవాలో తెలియకుండా తడబడుతున్న వీళ్లు, నా వాళ్లేనా నేనెరిగిన వాళ్ళేనా? ...భయం. విస్మయం. విభ్రాంతి. విహ్వలిత. మృత్యుఘోష. చావుకేక, చావునీడ.. నలుదిశలా. చావులోనూ దక్కని గౌరవం. ఇవ్వలేని అసహాయత! ఇవి కేవలం ఊహలు కావు అని చెప్పడం కోసం రచయిత, సమకాలికులైన దుష్యంత్ కుమార్ లాంటి హిందీ కవిని

ఉదాహరిస్తాడు. ఇప్పుడు 'కొత్త కథకుడిని శిష్యుని పాత్రలో ప్రవేశపెట్టి, గురుశిష్య సంవాదంలో అసలు విషయానికి వస్తాడు, కథని నిర్వచించడానికి పూనుకుంటూ - పురాణం, కా.రా. చలం మాటలను గుర్తు చేస్తాడు. పనిలో పనిగా పాఠకుల మెదడుకు మేత పెడతాడు! కొకు గురించి 'అనరాని అనలేని మాటలు' అన్న 'ఉప' వేతన శర్మ ఎవరు? కథ అంటే 'భయమూ, ఉద్వేగమూ, మోహమయమూ'ల సమ్మిశ్రమం అన్న కుర్ర 'కాఫ్కా' ఎవరు? వీరెవరో తెలిసిన వారిలో ఇవి నవ్వు పుట్టించక మానవు ! దేవులపల్లిని తలుచుకుంటూ ‘ఆశయాల్లో ఆకాశం వైపే చూస్తున్నాను, చిన్నమెత్తు రాయలేకపోతున్నాను' అన్న ఆత్మజ్ఞానాన్ని రచయిత కనబరుస్తాడు. కథ ఎత్తుగడా.. ముగింపుకు మధ్య చేర్చిన ఈ చర్చే 'వంటకం' కు ఆయువుపట్టు. లక్ష్య దిశ, కష్ట దశ కలిపి తన గురించి మనల్నే అభిప్రాయం ఏర్పరచుకోమంటాడు. ముగింపులో వర్తమానానికి మళ్ళీ వస్తాడు. ఇప్పుడు అతను డయాస్పోరా రచయిత. అమెరికాలో తను చేస్తున్న వంటకంలో ఒకప్పటి మనసుని కల్లోల పెట్టే దృశ్యాలూ శబ్దాలూ ఎటు పోయాయి? ఎలా పోయాయి? అదృశ్య ధారలలో అమృతం కురిసిందా?' అని ఆశ్చర్య పోతాడు. ఉపసంహారం లో కథకుడు కవి అవుతాడు:

'రచన పచన

వచన రచన

కైత రాతలేవైనా ..

కలిగించ గలగాలి

కసింత ఊరాడింపూ ఒకింత నమ్మకం

చిలికించాలి

చిటికెడు కరుణ

గుప్పెడు ఆదరణ

విహరింప చేయాలి

కొన్ని క్షణాలైనా ఉన్నత ఉదాత్త వీధులలో!'

మెడికో శ్యాం కవి కాబోయి కథకుడు అయ్యాడు అని అందుకే కొందరు అంటుంటారు! అతనొక బుద్ధిజీవి, అతని కథలు మేధావుల కథలు. ఇంత వైవిధ్యభరితంగా అతని రచనలు ఉంటాయి కనుకనే అతన్ని అనుకరించడం అసాధ్యం. కథను బి ఎస్ మూర్తి బాగా చదివి వినిపించారు. వినడానికి హాయిగా ఉంది వారి గొంతు.

గనేశ్వరరావు, హైదరాబాదు

## మెడికో శ్యామ్ గారి “వంటకం”

వంటకం కథ గమ్మత్తుగా ఉంది. నిజానికి ఇది వంటకం గురించి కాదనీ, దాన్ని మెడికో శ్యామ్ మెటఫర్ గా వాడేరనీ సామాన్య పాఠకుడికి ఇట్టే అర్థం అవుతుంది. వంటకం పేరుతో రచయితలు కథలను వండడానికి పడే పాట్లూ, వాళ్ళ ప్లాట్లూ వ్యంగ్యంగా చెప్పేరు. తెలుగు సినిమాలో ఫార్ములాల్లాగే, కథల్ని వండి వడ్డించడంలోనూ, కథలో పసలేనప్పుడు చెయ్యి తిరిగిన (లేదా చెయ్యితిరిగిన రచయితలమని

అనుకుంటున్న) రచయితలు శిల్పం పేరుతోనో మరో పదబంధంతోనో చెలామణీ చెయ్యడం, లేదా, కొందరు పాశ్చాత్య రచయితల పేర్లో, వాదాలో, ఉద్యమాల పేర్లో చెప్పి పాఠకుడు తన అజ్ఞానానికి వగచేలా చేస్తూ, వారు అందించిన విజ్ఞానాన్ని గ్రహించి తరించమని బోధించడమూ అందరికీ తెలిసినదే. కవితాసంకలనాలు వేసుకున్న ప్రతివారూ కవులు కానక్కరలేనట్లే, కథా సంకలనాలు వేసుకున్న ప్రతివారూ కథకులు కానక్కరలేదు, వాళ్ళు వంటలో ఎంత సిద్ధహస్తులైనా. అంతర్జాలం అందుబాటులోకి వచ్చిన తర్వాత, బ్లాగులూ, ఈ-పత్రికలూ ముమ్మరమై, ఎవరు వ్రాసింది వారు ఏ కత్తెరవాటూ (వేటూ) పడకుండా అచ్చేసుకోవడం మరింత సులభం అయింది. గొప్ప కథకి వస్తువు అనుభవంలోంచి (స్వీయానుభవం కానక్కరలేదు) కాకుండా, ఒక అపూర్వ, సంఘర్షణాత్మక, భయోద్వేగ మోహమయ వాతావరణంలోంచి రచయిత ఎంతో కష్టపడితే వస్తుందని ఈ మధ్యనే ఎక్కడో చదివిన గుర్తు. తరిగిన కూరలు దొరికినట్టే, అన్ని సందర్భాలకూ అతికే సంఘటనలు ఉంటాయి. ఇక వాటిలోంచి కథలు అల్లుకోవడమే తరవాయి. మనకి అతిశయోక్తుల మీద ఉన్న మమకారం స్వభావోక్తి మీద లేదు. ఎవర్నైనా పొరపాటునో, తెలియకో కొత్త కథకుడు అనో, కొత్త కవి అనో అన్నామంటే, అలా అన్నందుకు వాళ్ళు బాధపడవచ్చు. ఈ కథలో, నాకు అర్థమైనంతవరకు, శ్యామ్ గారు ప్రస్తావించిన మాటల వెనకనున్న వ్యక్తులు/రచయితలు/సంపాదకులు కొందరు నాకు పరిచయమే. అన్నిటిలోనూ వారితో ఏకీభవించలేకపోయినా, కొన్నిటిని కాదనలేను. ఈ కథలో అచ్చుతప్పులు ఎక్కువగా ఉన్నాయి. సంపాదకులు దాన్ని సవరిస్తే బాగుండేది. అన్నిటికన్నా ముఖ్యమైనది కృష్ణశాస్త్రి కవితలో .... "మంజువాటి" అన్న పదాన్ని "మందవాటి" అని తప్పుగా కోట్ చేశారు. చదివిన మూర్తి గారు కూడా దాన్ని గమనించలేదు. సంపాదకుల కష్టాలు సానుభూతితో అర్థం చేసుకోగలను. కానీ, బాగా ప్రచారంలో వున్న పంక్తుల్నీ, కవుల్నీ తప్పుగా సూచించడం నా దృష్టిలో సరిదిద్దుకోగలిగిన అపరాధం. గూగుల్ సెర్చ్ చేసినా తెలిసేది. దీనిని అచ్చుతప్పులు సవరించకుండా వినిపించడం వల్ల, మీ "శ్రవ్య" సంచిక "శ్రావ్యం" గా లేదు. శ్రీ బి. ఎన్. మూర్తి గారు బాగానే చదివారు.

ఎన్.ఎస్. మూర్తి, బెంగుళూరు

***0***

# వివరి పేజీ విన్నపాలు

- మీకు తెలిసిన కథాభిమానులను పరిచయం చేయండి. వారి మెయిల్ నుండి subscribe@kathamanjari.in కి వారి ఇష్టాన్ని తెలియచేస్తే చాలు. ప్రతినెలా ఉచిత సంచిక వారి మెయిల్ కు చేరుతుంది.

- కథామంజరి శ్రావ్య సంచికని వినండి. subscribe చేయండి.

- మీకు తెలిసిన యువ రచయితలని ప్రోత్సహించండి. వారి మెయిల్ వివరాలు మాతో పంచుకోండి. మీతో మేమూ చెయ్యి కలుపుతాం.

వచ్చే యువ ప్రత్యేక సంచికతో ఉత్సాహంగా కలుద్దాం. శలవు.

